ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 17.07.2026 | సంపుటి :12 సంచిక : 358 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
జనంసాక్షి tv JANAMSAKSHI

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## నేడు పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు


**నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ,జూలై16(జనంసాక్షి):** దేశంలో తొట్టతొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనున్నది. హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభంకానున్నది. ప్రధాని మోదీ నేడు ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. హైడ్రోజన్ రైలు భారతీయ రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నది. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడవనున్నది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్

మిగతా 2లో..

## కాళేశ్వరం ప్రాజెక్టుల రక్షణపై వివరణ ఇవ్వండి



- కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం, ఎన్డీఎస్ఏకు హైకోర్టు నోటీసులు
- తదుపరి విచారణ 21కి వాయిదా

**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో పాటు కన్నెపల్లి, సుందిళ్ల పంప్‌హౌస్‌ల రక్షణపై వివరణ ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వానికి, కేంద్రానికి, ఎన్డీఎస్ఏకు సంబంధిత అధికారులకు

మిగతా 2లో..



## 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**ఎంపీలకు కొత్త మార్గదర్శకాలు**

**బిజినెస్ జాబితాను విడుదల చేసిన సెక్రటరీ జనరల్**

**న్యూఢిల్లీ,జూలై16(జనంసాక్షి):** ఈ నెల 20 నుంచి ఆగస్టు 17 వరకు అత్యంత ప్రాధాన్యంతో జరగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం ఎంపీల

మిగతా 2లో..

# తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చిస్తాం

**గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**

**సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తాం :ఉత్తమ్ కుమార్ రెడ్డి**



- గత ప్రభుత్వం రూ.లక్షకోట్లకుపైగా ఖర్చు చేసి ప్రాజెక్టులు పడావుపెట్టింది
- కమీషన్లకోసం మొదలుపెట్టిన కాళేశ్వరం వారి హాయంలోనే కూళేశ్వరమైంది
- సీతారామ ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేస్తాం
- పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

**మణుగూరు, జూలై 16 (జనంసాక్షి):** తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చిస్తామని, సీతారామ ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని అన్నారు. గురువారం అశ్వాపురం మండలం సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,

మిగతా 2లో..



## టీజీ20 లీగ్‌కు విశేషాదరణ

**అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లవలే ప్రాముఖ్యత లభించింది**

- ఇలాంటి లీగ్‌ల ద్వారా దేశ ప్రతిష్ఠ పెంచే క్రీడాకారులు వెలుగులోకి రావాలి
- గతంలో జాతీయస్థాయి క్రీడలకు హైదరాబాద్ వేదికైంది
- తెలంగాణకు స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చాం
- క్రీడలకు సంబంధించి మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి
- స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేశాం : సీఎం రేవంత్
- ముఖ్యమంత్రిని కలిసిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టు ప్లేయర్లు, మేనేజ్‌మెంట్
- ఆటగాళ్లకు సీఎం ప్రశంస.. చెక్కుల అందజేత

**హైదరాబాద్(జనంసాక్షి):** టీజీ20 లీగ్‌కు మంచి ఆదరణ దక్కిందని, అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లకు వచ్చినంత ఆదరణ వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. యువత ఎదిగేందుకు టీజీ20 లీగ్ చక్కగా ఉపయోగపడుతుందని ప్రశంసించారు. టీజీ 20 విజేత హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ టీమ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసింది. టీమ్‌తో పాటు ఫ్రాంచైజీ యాజమాన్యమైన రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ కిరణ్, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, ఉషోదయా

మిగతా 2లో..

## భట్టికి ఇరిగేషన్‌లో ఓనమాలు తెలియవు


**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకార పూరిత ధోరణితో వ్యవహరిస్తున్నారు**

**గత రెండున్నరేళ్లుగా పాలమూరు,రంగారెడ్డిపై సీఎం రేవంత్ సమీక్ష చేయలేదు : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**



**హైదరాబాద్ (జనంసాక్షి):** బీఆర్ఎస్ నాయకుడు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కాంగ్రెస్ మంత్రులపై విరుచుకుపడ్డారు. ఇరిగేషన్ విషయంలో రాష్ట్ర మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఓనమాలు తెలియవని, ఆయన సమైక్యవాది అని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకార పూరిత ధోరణితో ఉన్నారని విమర్శించారు. సమైక్య రాష్ట్రంలో పాలమూరు రెండు తరాల జీవితాలను కోల్పోయిందని వెల్లడించారు. జలయజ్ఞంలో పాలమూరు ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ , టీడీపీ కలిసి 26 ఏళ్లలో కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ. 2,600 కోట్లు ఖర్చు పెట్టారని తెలిపారు.భీమా,కోయిల్ సాగర్ బీఆర్ఎస్ హయాంలోనే

మిగతా 2లో..



## జగన్నాథ రథయాత్రలో అపశృతి

**తొక్కిసలాటలో ఒకరు మృతి**

**వందమందికి పైగా భక్తులకు గాయాలు**

**పూరీ,జూలై16(జనంసాక్షి):** ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రాండ్ రోడ్డులో రద్దీ విపరీతంగా పెరగడంతో తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో ఒకరు మరణించగా 100 మందికి పైగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన సిబ్బంది క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, రద్దీ విపరీతంగా పెరగడంతో ఓ వ్యక్తికి ఊపిరాడక స్పృహ తప్పిపోయినట్లు తెలిసింది. వెంటనే ఆ వ్యక్తిని పూరీ జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు అయితే, ఈ విషయంపై అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు.

మిగతా 9లో..



## యూకేకు ఎగుమతులు పెంచుతాం

**ఆ దేశంతో యూకెతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని తెలంగాణకు అనుకూలంగా మలుచుకుంటాం:మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్,జూలై16(జనంసాక్షి):** భారత్– యునైటెడ్ కింగ్ డమ్ ల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం వల్ల తెలంగాణా గరిష్ఠ ప్రయోజనం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందం వల్ల దేశం నుంచి ఎగుమతి అయ్యే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై యుకె సుంకాలను తొలగించిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. యుకె డిప్యూటి ట్రేడ్ కమిషనర్ చంద్రు కె అయర్ ఆధ్వర్యంలో గురువారం నాడు సచివాలయంలో తనను కలిసిన ప్రతినిధి బృందంతో శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం భారీగా వృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేసారు. రెండు దేశాల మధ్య రూ.32.56 లక్షల కోట్ల వాణిజ్యానికి అవకాశం ఉందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణాలో పారిశ్రామిక వస్తూత్పత్తి, లైఫ్ సైన్సెస్, ఏవియేషన్, డిఫెన్స్, ఐటి, సెమికండక్టర్స్, చిప్ ల డిజైన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను వృద్ధి చేసామని, యుకె పారిశ్రామికవేత్తలు

మిగతా 2లో..

## నీళ్లు ఎత్తిపోయండంటే.. బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారు

**రైతులకు కరెంట్ ఇవ్వకపోగా భూములపై ట్యాక్స్ వేస్తారట..**

**రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఆగ్రహం**

**హైదరాబాద్(జనంసాక్షి):** రిటైర్డ్ ఇంజినీర్లు, తెలంగాణ సాగునీటి పారుదల శాఖ మేడిగడ్డ గేట్లు మూయకుండా కన్నెపల్లి గేట్లు ఎత్తొచ్చని చెప్తే.. ఆ నీళ్లు ఎత్తొచ్చని చెప్పిన ఇంజినీర్లను జైళ్లలో పెడతమని, బెల్ట్‌తో కొడ్తమని రాజకీయాలు చేస్తున్నది మీరని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్


మిగతా 2లో..



# 'ఖర్గ్'పై అమెరికా కన్ను

**ఇరాన్‌కు అత్యంత కీలకమైన ద్వీపం స్వాధీనం చేసుకోవడానికి అమెరికా వ్యూహం**

- పికాక్స్ పర్వత కాంప్లెక్స్ ధ్వంసం చేయడానికీ ప్రణాళికలు
- సిచువేషన్ రూమ్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో చర్చించిన ట్రంప్
- ప్రస్తుతం చర్చల గురించి ఎలాంటి ఆలోచనా లేదు
- మా దేశ రక్షణపైనే పూర్తిగా దృష్టి సారించాం : ఇరాన్ విదేశాంగ శాఖ



**వాషింగ్టన్(జనంసాక్షి):** పశ్చిమాసియాలో పరిస్థితులు దిగజారుతున్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం పక్కనపడిపోయింది. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిచువేషన్ రూమ్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేదిశగా పలు కీలక అంశాలను ఆయన పరిశీలించినట్లు అంతర్జాతీయ మీడియా కథనా లు వెల్లడించాయి. ఇరాన్ చమురు ఎగుమతికి కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడం, ఆ దేశ అణు కార్యక్రమంలో కీలకమని భావి స్తోన్న పికాక్స్ పర్వతంపై దాడి చేయడం గురించి ట్రంప్ ఈ సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నా యి.ఇరాన్ ఆర్థికవ్యవస్థకు ఖర్గ్ ద్వీపం అత్యంత కీలకమైంది. దానిని స్వాధీనం చేసుకుం టే.. ఇరాన్‌పై ఆర్థికంగా ఒత్తిడి తీసుకురావొచ్చని అమెరికా ఎప్పటి నుంచో భావిస్తోంది. దీంతో పా టు హర్మూజ్ జలసంధికి సమీపంలోని ఇరాన్ ద్వీపాలు అబూముసా, గ్రేటర్ టన్బ్, లెస్సర్‌టన్బ్‌ను

మిగతా 2లో..

## హర్మూజ్ గుండా వెళ్లే నౌకల్లో భారతీయుల్ని నియమించుకోవద్దు

**కేంద్రం కీలక అడ్వైజరీ**

**హర్మూజ్‌లో ఉద్రిక్తతల దృష్ట్యా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆదేశాలు అమల్లో ఉంటాయని వెల్లడి**

2లో..

## అమెరికా స్థావరాలను ఆక్రమించండి

- ఆ దేశ సైనికుల్ని బంధించండి
- ఇందుకోసం భూతల దాడులు చేయండి
- ఇరాన్ మాజీ విదేశాంగ మంత్రి, పార్లమెంట్ సభ్యుడు మనుచెహర్ మొత్తకి

## 9వ తరగతిలో మూడో భాష వద్దు



**బోర్డు పరీక్షల ముందు విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుంది**

**అవసరమైతే ఆరో తరగతిలోనే ప్రవేశపెట్టాలి : సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికలో భాగంగా మూడో భాష అమలుకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తొమ్మిదో తరగతిలో కొత్త భాషను ప్రవేశపెట్టడం సరికాదని పేర్కొంది. దీనివల్ల విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందని అభిప్రాయపడింది. దీనికి బదులు.. ఏదైనా కొత్త భాషను ఐదు లేదా ఆరో తరగతిలోనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి సూచించింది. తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన పిటిషన్ (సీబీఎస్ఈ అంశంపై కాకుండా)ను విచారించిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం త్రిభాషా విధానంపై ఈ విధంగా వ్యాఖ్యానించింది.దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో త్రిభాషా విధానం అమలు అవుతున్న

మిగతా 9లో..

## సోనమ్ వాంగ్‌చుక్‌కు వెంటనే చికిత్స అందించండి



- కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం
- పర్యావరణ ఉద్యమకారుడి ఆరోగ్యంపై ధర్మాసనం ఆందోళన

**న్యూఢిల్లీ,జూలై16(జనంసాక్షి):** పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అతడి ఆరోగ్యాన్ని కాపాడాలని ఆదేశించింది. రెండు వారాలకుపైగా ఢిల్లీలోని జంతర్‌మంతర్

మిగతా 2లో..

## తెలంగాణలో ఆషాఢ బోనాల సందడి

**ప్రజలకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు**

**గోల్కొండ కోటలో ప్రారంభమైన ఉత్సవాలు**

**అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం**

**హైదరాబాద్,జూలై16(జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆధ్యాత్మిక విశ్వాసానికి అద్దం పట్టే ఈ వేడుకల ప్రారంభం సందర్భంగా నగర ప్రజలకు, భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బోనాల పండుగ సామాజిక ఐక్యతకు ప్రతీక అని కొనియాడిన ఆయన.. భక్తుల నమ్మకాలకు, సంప్రదాయాలకు భంగం కలగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.20 కోట్ల నిధులను కేటాయించిందని గుర్తుచేశారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాల్లో

మిగతా 2లో..

## కాళేశ్వరం రక్షణపై వివరణ ఇవ్వండి

నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.కాళేశ్వరం నీరు వృథాగా సముద్రంలోకి వెళ్తున్నా మేడిగడ్డ పిల్లర్లు రిపేర్ చేయకుండా రాజకీయం చేస్తున్నారని ఓ న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, సురక్షితంగా వినియోగించడంలో విఫలం అయ్యారని పిటిషన్‌లో పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం మేడిగడ్డ పిల్లర్లను ఔఆూం రిపోర్ట్ ప్రకారం పునరుద్ధరించాలని, మిగిలిన రిజర్వాయర్లపై ఔఆూం దర్యాప్తు చేసి రిపోర్ట్ ఇవ్వాలని లాయర్ హైకోర్టుకు విన్నవించారు.

## నేడు పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు

సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్–సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపేట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆనోడ్‌పై హైడ్రోజన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణాలు.. ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవుతాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటాన్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్‌ను నిల్వ చేసేందుకు పెట్రోలియం శాఖ లైసెన్సు జారీ చేసింది. మొత్తం 12 స్టేషన్లలో రైలు ఆగుతుంది. జింద్ సిటీ, పాండు పిండర, లలిత్ ఖేరా, భంబేవా, ఇషాపూర్ ఖేరి, బూటానా, ఖంద్రాయి, గోహనా, రత్రా, లాత్, మోహనా హర్యానా, భర్వాస్ని స్టేషన్లలో ఆ రైలు ఆగనున్నది. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రొడక్ట్స్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

## భట్టికి ఇరిగేషన్‌లో ఓనమాలు తెలియవు

పూర్తి అయ్యాయని వెల్లడించారు.బీఆర్ఎస్ హయాంలో కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 4.50 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని వివరించారు. పాలమూరు జిల్లాలో 10 లక్షల ఎకరాలకు కేసీఆర్ నీళ్లు ఇచ్చారని, శ్రీశైలం దగ్గర సోర్స్ పెట్టి పాలమూరు,రంగారెడ్డి ప్రాజెక్టుకు కేసీఆర్ శ్రీకారం చుట్టి 27 వేల ఎకరాల భూసేకరణ పూర్తి చేశామన్నారు. ఇంకా 160 ఎకరాలు మాత్రమే భూ సేకరణ మిగిలి ఉందని తెలిపారు. ఐదు రిజర్వాయర్లు నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన,ఉద్దండాపూర్ నిర్మించామని చెప్పారు.గత రెండున్నరేళ్లుగా పాలమూరు,రంగారెడ్డి పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికి కళ్లు కనిపించడం లేదని విమర్శించారు. డిండి ప్రాజెక్టు కోసం 40 టీఎంసీలకు పర్మిషన్ తీసుకురావాలని, కృష్ణాలో 588 టీఎంసీల నీళ్లు తెలంగాణకు కావాలని రేవంత్ రెడ్డి అందుకు డిమాండ్ చేయాలని సూచించారు. కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీళ్లను లిఫ్ట్ చేసే అవకాశం ఉందని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ మంత్రిగా హోం మంత్రిగా రేవంత్ ఫెయిల్ అయ్యారని తెలిపారు.కేసీఆర్ హయంలో విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని గుర్తు చేశారు. మహబూబ్ నగర్ జిల్లాకు గురుకులాలు , మెడికల్, ఇంజనీరింగ్ ,పాలిటెక్నిక్ కకాశాలలు కేసీఆర్ హయం లోనే అడిగినన్ని వచ్చాయని వివరించారు. మీడియా సమావేశంలో బీ ఆర్ ఎస్ నేతలు కె .కిషోర్ గౌడ్ ,అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, గౌతమ్ ప్రసాద్ పాల్గొన్నారు.

## నీళ్లు ఎత్తిపోయండంటే.. బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారు

లీడర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు నీరందచండి..కరెంట్ ఇవ్వండి..విద్యుత్ సామర్థ్యం ఉన్నది.. విద్యుత్ ప్లాంట్లు ఉన్నయి. బొగ్గు లేక విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. దృష్టి పెట్టండి అని ప్రభుత్వాన్ని ముల్లు కట్టె పెట్టి నిద్రలేపుతున్నాం. మీకు విషయాలు చెబుతున్నమన్నారు.గరైతులకు నాణ్యమైన కరెంట్ ఇవ్వండని ప్రభుత్వానికి హరీశ్ రావు సూచించారు.. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ చేస్తారట. కమిషన్ల కోసం గ్రీన్ ఎనర్జీ పాలసీని నిలిపేశారు. నాణ్యమైన బొగ్గును వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. దేవాదులకు నీళ్లు అందడానికి కారణం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కోతలు–వాతలు తప్ప ఏమీ లేవన్నారు. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ వేస్తారట. రైతులకు నీళ్లు ఇవ్వమంటే రక్తం పారిస్తామంటున్నారు. రెండు పంటలకు బోనస్ ఎగ్గొట్టారు. విద్యుత్ కోసం రైతులు ధర్నాలు చేస్తున్నారు. విద్యుత్ సామర్థ్యం ఉన్నా ఉత్పత్తి చేయలేకపోతున్నారు. 7,180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంటే 3100 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం 33 శాతం మాత్రమే. ఎల్‌నినో వస్తుందని తెలిసినా ముందస్తు ప్రణాళిక లేదు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పారిశ్రామిక వేత్తలు, ప్రజలపై భారం పడుతోందన్నారు. కాళేశ్వరం నీరు వృథాగా సముద్రంలోకి వెళ్తున్నా మేడిగడ్డ పిల్లర్లు రిపేర్ చేయకుండా రాజకీయం చేస్తున్నారని ఓ న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, సురక్షితంగా వినియోగించడంలో విఫలం అయ్యారని పిటిషన్‌లో పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం మేడిగడ్డ పిల్లర్లను ఔఆూం రిపోర్ట్ ప్రకారం పునరుద్ధరించాలని, మిగిలిన రిజర్వాయర్లపై ఔఆూం దర్యాప్తు చేసి రిపోర్ట్ ఇవ్వాలని లాయర్ హైకోర్టుకు విన్నవించారు.దీంతో హైకోర్టు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో పాటు కన్నెపల్లి, సుందిళ్ల పంప్‌హౌస్‌ల రక్షణపై వివరణ ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వానికి, కేంద్రానికి, ఔఆూంకు, సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.

# తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చిస్తాం



రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు మ్యాప్‌లు, సాంకేతిక నమూనాల ద్వారా బ్యారేజ్, పంప్‌హౌస్‌లు, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థ, ఆయకట్టు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనులు, అవసరమైన నిధులు తదితర అంశాలను మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరిగేషన్ రంగంపై గతంలో సుమారు రూ.1.81 లక్షల కోట్లకు పైగా వ్యయం జరిగినప్పటికీ అనేక ప్రాజెక్టులు ఇంకా వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు.
పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై సుమారు రూ.27,500 కోట్లు వ్యయం జరిగినట్లు తెలిపారు . ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించి జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్ డి ఎస్ ఏ), కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూ సి) సూచనల మేరకు సాంకేతిక పరీక్షలు, భూగర్భ పరిశీలనలు, నిర్మాణ భద్రతా అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిపుణుల నివేదికల ఆధారంగా అవసరమైన పునరుద్ధరణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు . ప్రజల భద్రత, నిర్మాణ నాణ్యత, నీటి నిల్వ సామర్థ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని నిర్ణయాలు శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే తీసుకుంటున్నామని వివరించారు. గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా, అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించేలా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు.జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో రాజీవ్ సాగర్ ప్రాజెక్టు రూ.1,640 కోట్లతో రెండు లక్షల ఎకరాలకు, ఇందిరా సాగర్ ప్రాజెక్టు రూ.1,680 కోట్లతో మరో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించబడినట్లు తెలిపారు. మొత్తం సుమారు రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళిక రూపొందించబడిందన్నారు.రాష్ట్ర విభజనకు ముందు ఈ రెండు ప్రాజెక్టులపై సుమారు రూ.2,000 కోట్ల వరకు వ్యయం జరిగిందని, మిగిలిన పనులకు సుమారు రూ.1,505 కోట్లు అవసరమయ్యే పరిస్థితి ఉండేదన్నారు. అనంతర కాలంలో ప్రాజెక్టు పునఃరూపకల్పనతో అంచనా వ్యయం సుమారు రూ.24 వేల కోట్లకు పెరిగిందని, ఇప్పటికే రూ.7,500?8,000 కోట్ల వరకు వ్యయం జరిగినట్లు వివరించారు.ప్రతి నెలా పనుల పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన నిధులు విడుదల చేసి ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు . మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ…ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోకుండా పంపింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి నీటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని పనులను వేగవంతం చేస్తున్నామని, అవసరమైన చోట అదనపు నిధులు కూడా విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని అన్నారు .అనంతరం మంత్రులు మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, శాసనసభ్యులు రామదాసు నాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, నీటిపారుదల శాఖ అధికారులు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, మణుగూరు, అశ్వాపురం మండల సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఆషాఢ బోనాల సందడి

పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. త్సవాల నిర్వహణలో భాగంగా దేవాలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, నిరంతర తాగునీటి సరఫరా, నిరంతరాయ విద్యుత్, వైద్య సేవలతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, కట్టుదిట్టమైన భద్రత, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని వేలాది ఆలయాల్లో భక్తుల రద్దీని తట్టుకునేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ అధికారిక పర్యవేక్షణలో నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ బోనాల జాతరను విజయవంతం చేసేందుకు సర్వం సిద్ధమైంది.

## 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

కోసం సరికొత్త మార్గదర్శకాల ను జారీ చేస్తూ అధికారిక బులిటెన్ విడుదల చేసింది. ముఖ్యంగా సభలో ప్రజాప్రతినిధుల వ్యక్తిగత గోప్యతను కాపాడటంతో పాటు పార్లమెంటు అంతర్గత భద్రతను మరింత బలోపేతం చేయడంపై ఈసారి ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా.. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలపై సచివాలయం పూర్తిస్థాయి ఆంక్షలు విధించింది. సభా రికార్డులకు భిన్నంగా రహస్యంగా చిత్రాలు తీయడం, వీడియోలు రికార్డ్ చేయడం వంటి అనధికారిక చర్యలకు ఆస్కారం లేకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. డిజిటల్ భద్రతా ప్రమాణాల దృష్ట్యా సభలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.నూతన ఆదేశాల ప్రకారం.. సభలోకి స్మార్ట్ వాచీలు, స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాల వంటి ఎలాంటి నిఘా ఆధారిత గ్యా÷–జడెట్లనూ అనుమతించరు. కేవలం సాంకేతిక ఆంక్షలకే పరిమితం కాకుండా పార్లమెంట్ ప్రాంగణంలో ప్రజాస్వామ్యయుతమైన గౌరవాన్ని కాపాడేందుకు మరికొన్ని కఠిన నిబంధనలనూ ఈ బులిటెన్‌లో చేర్చారు. పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, రాజకీయ నిరసనలు చేపట్టడంపై పూర్తి నిషేధం విధించారు. అలాగే సభా సమయాన్ని, వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు తీసుకురావడం వంటి చర్యలను పూర్తిగా నిరాకరించారు. వీటితో పాటు పార్లమెంటు పరిధిలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు లేదా పూజలు నిర్వహించకూడదని స్పష్టం చేస్తూ, సభా మర్యాదలను, శాంతిభద్రతలను కాపాడేందుకు ఎంపీలందరూ సహకరించాలని లోక్‌సభ సచివాలయం ఈ విస్తృతమైన మార్గదర్శకాల ద్వారా కోరింది.

## టీఎంసీ,రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ రాజీనామా

**కోల్‌కతా,జూలై16(జనంసాక్షి):**తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీ రుక్మిణి మల్లిక్ (కోయెల్ మల్లిక్) షాక్ ఇచ్చారు. టీఎంసీకి, రాజ్యసభ సభ్యత్వానికి రుక్మిణి మల్లిక్ గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆమె సమర్పించారు. దీంతో రాజ్యసభ నుంచి వైదొలిగిన నాలుగో టీఎంసీ ఎంపీగా రుక్మిణి నిలిచారు. ఇప్పటికే ఆ పార్టీ నుంచి సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరైక్, సుష్మితా దేబ్ తమతమ రాజ్యసభ ఎంపీ పదవులకు రాజీనామా చేశారు. ఈ ఏడాది ఆరంభంలోనే రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ ఎన్నికయ్యారు. టీఎంసీ 2026 ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలకు ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికై ఏప్రిల్ 6న రాజ్యసభ ఎంపీగా రుక్మిణి ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన వెంటనే టీఎంసీ, మమతా బెనర్జీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

## అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై దాడి

హైదరాబాద్(జనంసాక్షి):అమెరికా యుటా రాష్ట్రంలో ఓ భారతీయుడిపై దాడి జరగడం ప్రవాసులను మరోసారి కలవరపాటుకు గురిచేసింది. బాధితుడు సోహైల్ హైదరాబాద్‌లోని టోలిచౌకి వాసిగా వెల్లడైంది. దుండగుడి దాడిలో గాయాలపాలైన సోహైల్ స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు సమాచారం. అయితే, దాడిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన బాధిత కుటుంబం.. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనను మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. మైనారిటీలపై ఎక్కడపడితే అక్కడ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ భారత విదేశాంగ మంత్రికి ఎంబీటీ లేఖ రాసింది.కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. టోలిచౌకికి చెందిన సయ్యద్ సోహైలుద్దీన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు. కుటుంబంతో కలిసి రెండేళ్ల నుంచి యుటా రాష్ట్రంలోని సాల్ట్‌లేక్ కౌంటీలో నివాసముంటున్న ఆయన.. వెస్ట్‌వ్యాలీ సిటీలోని ఓ మాల్‌లో పనిచేస్తున్నాడు. సోహైల్ విధుల్లో ఉన్న సమయంలో మాల్‌కు వచ్చిన ఓ దుండగుడు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు సోహైల్‌ను రక్షించి, ఆసుపత్రికి తరలించారు. నిందితుడికి దేహశుద్ధి చేశారు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. నిందితుడిని అరెస్టు చేయడం తోపాటు ఓ ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు

## ఆగని దురాగతాలు

**సనత్‌నగర్‌లో మైనర్ బాలికపై అత్యాచారం**

హైదరాబాద్(జనంసాక్షి):సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. మైనర్ బాలికపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. బుధవారం ఉదయం బాలిక పాఠశాలకు వెళ్తుండగా.. షాబాజ్ అనే వ్యక్తి ఆమెను వెంబడించి బైక్ ఎక్కించుకు న్నాడు. అనంతరం సనత్‌నగర్‌లోని ఓ పార్క్‌లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫి ర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు పోక్సో కేసు నమో దు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

# టీజీ20 లీగ్‌కు విశేషాదరణ



ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఈటీవీ ఎండీ బాపినీడు ముఖ్యమంత్రిని కలిశారు. ఇలాంటి లీగ్‌ల ద్వారా దేశ ప్రతిష్ఠ పెంచే క్రీడాకారులు వెలుగులోకి రావాలని ఆశిస్తున్నామన్నారు. ఈ ఛాంపియన్స్ విజయం అనంతరం టీమ్ మేనేజ్?మెంట్ ఆటగాళ్లకు భారీ ప్రైజ్?మనీ ప్రకటించింది. కెప్టెన్‌కు రూ.5 లక్షలు, వైస్ కెప్టెన్‌కు రూ.4 లక్షలు, మిగిలిన ఆటగాళ్లకు రూ.3 లక్షల చొప్పున యాజమాన్యం తరఫున ప్రోత్సాహకంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అయితే ఈ ప్రైజ్?మనీకి సంబంధించిన చెక్కులను ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్లేయర్లకు అందజేశారు.ఈ టీజీ 20 లీగ్‌కు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చిందని ఈ భేటీ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌ల స్థాయిలో ఈ టోర్నీకి ఆదరణ వచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో యువత ఎదిగేందుకు ఈ టీజీ20 లీగ్ చక్కగా ఉపయోగపడుతుందని అన్నారు. ఆటపై చూపిన కమిట్‌మెంట్ వల్లే సచిన్ ఆ స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. గతంలో ఎదిగిన క్రికెటర్లకు ఇలాంటి సంస్థల అండ లభించలేదని, కానీ ఇప్పుడు 'ఈనాడు– ఈటీవీ' సంస్థలు తమ వెనకాల నిలబడ్డాయని సీఎం ఆటగాళ్లతో చెప్పారు.'క్రీడా రంగంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక స్పష్టత ఉంది. గతంలో జాతీయస్థాయి క్రీడలకు హైదరాబాద్ వేదికైంది. ప్రజా ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించింది. తెలంగాణ రాష్ట్రానికి ఒక స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు క్యాష్ రివార్డ్‌తో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. క్రీడలకు సంబంధించి మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేశాం. గచ్చిబౌలి స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దబోతున్నాం. ఏ రంగంలోనైనా ఫోకస్ లేకపోతే రాణించలేం. ఏ రంగాన్ని ఎంచుకున్నా ఆ రంగంపై గౌరవం ఉండాలి. ఆసక్తితో ముందుకు వెళ్లాలి. గ్రామీణ క్రీడాకారులకు టీజీ20 ఒక మంచి అవకాశం. టీజీ20లో విజయం సాధించిన మీ అందరినీ అభినందిస్తున్నా. మీరు దేశ ప్రతిష్ఠను పెంచే క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నా' అని ఆటగాళ్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడారు.కాగా, ఇటీవల ముగిసిన టీజీ 20 లీగ్ 2026 టోర్నమెంట్‌లో రామోజీ గ్రూపునకు చెందిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ టైటిల్ సాధించింది. ఫైనల్‌లో ఖమ్మంపై హైదరాబాద్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది.

## యూకేకు ఎగుమతులు పెంచుతాం

వీటిని వినియోగించు కోవాలని కోరారు. రాష్ట్రం నుంచి యుకెకు ప్రస్తు తం రూ.3,553 కోట్ల విలువైన ఎగుమతులు మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. కొత్త ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాల వల్ల ఎగు మతులను భారీగా పెంచుకునే అవకాశం ఏర్ప డిందని వివరించారు. దేశంలోని ఫార్మా ఉత్పత్తు ల్లో 40 శాతం తెలంగాణాలోనే జరుగుతున్నా యని, వ్యాక్సిన్ ఎగుమతుల్లో 30 శాతం రాష్ట్రా నిదేనని శ్రీధర్ బాబు తెలిపారు. విమానయాన రంగానికి అవసరమైన ప్రిసిషన్ విడిభాగాల ఉత్పత్తిలో తెలంగాణా అగ్రస్థానంలో ఉందని గుర్తు చేసారు. ప్రపంచ ప్రఖ్యాత ఏవియేషన్ సంస్థలు ఎయిర్ బస్, బోయింగ్, రోల్స్ రాయిస్, విమాన ఇంజన్ల తయారీ సంస్థ ప్రాట్ అండ్ విట్నీస్, దసో ఏవియేషన్ ఉత్పత్తి చేసే రఫేల్ విమానాల విడిభాగాల తయారీ, ఓవర్ హాలింగ్ సదుపాయాలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. టాటా అడ్వాన్సుడ్ సిస్టమ్స్, సఫ్రాన్ ఏవియేషన్ సంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేసిన విషయా న్ని గుర్తు చేసారు. హైదరాబాద్ లో ఫార్చ్యూన్ 500 కంపెనీలతో సహా పలు ప్రఖ్యాత సంస్థలు 350 జిసిసి కేంద్రాలను ఏర్పాటు చేసాయని చె ప్పారు. యుకెకు ఎగుమతి చేయగలిగే వస్తువుల తయారీపై స్థానిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి సిఇటిఏ ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఇండస్ట్రీస్ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్యకు శ్రీధర్ బాబు సూచించారు. యుకె నుంచి భారత్ పర్యటించే మేయర్ల బృందాన్ని హైదరాబాద్ ను కూడా సందర్శించేలా చూడాలని చంద్రు కె అయర్ ను మంత్రి కోరారు. అధికారులతో కలిసి యుకెను సందర్శించి అక్కడ పారిశ్రామిక, వాణిజ్య ఎకోసిస్టంను పరిశీలించాలని చంద్రు అయర్ శ్రీధర్ బాబును ఆహ్వానించారు. యుకె ప్రతినిధి బృందంలో సిద్దార్థ విశ్వనాథన్, నళిని రఘురామన్, ప్రవీణ్ పద్మనాభన్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## సోనమ్ వాంగ్‌చుక్ వెంటనే చికిత్స అందించండి




వద్ద నిరాహార దీక్ష చేస్తున్నారు. ప్రవేశ పరీక్షల నిర్వ హణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. దాంతో దిల్లీ హైకోర్టు జోక్యం చేసుకుంది. ఆయన ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వ వైద్యుడి పర్యవేక్షణలో ఎటువంటి వైద్య చికిత్సలైనా అందించాలని గురువారం కేంద్రాన్ని ఆదేశించింది. ప్రతిపౌరుడి ప్రాణం అమూల్యమైంది. అలాంటి ప్రాణాలు కాపాడటానికి ప్రభుత్వాలు అన్ని ప్రయత్నాలు చేయాలని న్యాయస్థానం పేర్కొంది. మరో 48 గంటలు ఈ నిరాహారదీక్ష ఇలాగే కొనసాగితే 59 ఏళ్ల వాంగ్‌చుక్ ప్రాణాలకు ప్రమాదం వాటిల్లొచ్చంటూ బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. వాంగ్‌చుక్ గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేసిన పిటిషనర్.. ఆయనకు బలవం తంగా ఆహారం అందిం చేలా ఆదేశాలు ఇవ్వాలని న్యా యస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. తాజా ఆదేశాలు జారీ చేసింది. 19 రోజులుగా వాంగ్‌చుక్ దీక్ష చేస్తున్నా రు. ఇన్ని రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన 9 కేజీల వరకు బరువు తగ్గారని వైద్యనిపుణులు చెప్తున్నారు. తాజాగా తన మద్దతుదారులను ఉద్దేశించి ఆయన ఒక వీడియో విడు దల చేశారు. నా ఆరోగ్యం క్షీణించిన మాట వాస్తవమే. కానీ అత్యంత ప్రమాదకర స్థితికేం దిగజారలేదు. నిరాహార దీక్ష విరమించాలని నన్ను అడగడానికి బదులు జులై 20న 'చలో సంసద్' మార్చ్‌లో భాగం కావాలని మద్దతుదారులను ఆయన కోరారు.

## 'ఖర్గ్'పై అమెరికా కన్ను

కూడా స్వాధీనం చేసుకోవాలని అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. సురక్షిత నౌకాయానం, ఇరాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునేందుకు వీటిపై దృష్టి సారించినట్లు సమాచారం. కానీ ఖర్గ్‌ను సీజ్ చేయాలంటే.. అగ్రరాజ్య సైన్యం భూతల దాడులు చేయాల్సి ఉంటుంది. దాంతో అమెరికాకు ప్రాణనష్టం భారీగానే ఉండొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది ..ఇదిలా ఉండగా.. తమతో ఇరాన్ చర్చలు కోరుకుంటోందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను టెహ్రాన్ తోసిపుచ్చింది. "ప్రస్తుతం చర్చల గురించి ఎలాంటి ఆలోచనా లేదు. మా దేశ రక్షణపైనే పూర్తిగా దృష్టి సారించాం" అని ఇరాన్ విదేశాంగ శాఖ వెల్లడించింది.

### హర్మూజ్ గుండా వెళ్లే నౌకల్లో భారతీయుల్ని నియమించుకోవద్దు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమాసియాలో మరోసారి తీవ్రస్థాయిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తోన్న నౌకలపై వరుసగా దాడులు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. హర్మూజ్ దాటే నౌకల్లో భారతీయులను నియమించుకోవద్దని షిప్ యజమానులను ఆదేశించింది. ఈ మేరకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ ఎక్స్ వేదికగా అడ్వైజరీ జారీ చేసింది. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న భద్రతాపరమైన ఆందోళనల దృష్ట్యా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని వెల్లడించింది.నేవిగేషన్ హెచ్చరికలు, భద్రతాపరమైన సూచనలను ఎప్పటికప్పుడు గమనించుకోవాలని షిప్పింగ్ కంపెనీలకు మారిటైమ్ రెగ్యులేటర్ సూచించింది. నౌకాయానానికి సంబంధించిన అంతర్జాతీయ నియమావళిని కచ్చితంగా పాటించాలని చెప్పింది. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన వివరాలను షేర్ చేసింది. గల్ఫ్ ప్రాంతంలో మారుతోన్న పరిస్థితులను తాము ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, భారత నావికుల భద్రతకు కట్టుబడి ఉన్నామని వెల్లడించింది.ఇటీవల యూఏఈ జెండాతో ఉన్న రెండు నౌకలపై ఇరాన్ దాడి చేయడంతో భారత సిబ్బంది ఒకరు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ రెండు నౌకలు నేవిగేషన్ హెచ్చరికలను విస్మరించినట్లు తెలుస్తోంది. ఒమన్ తీరంలో వాణిజ్య నౌక జీఎఫ్ఎస్ గెలాక్సీపై జరిగిన దాడిలో భారత మెరైన్ ఇంజినీర్ హేరంభ కర్మర్కర్ గల్లంతయ్యారు. అతడిని కాపాడేందుకు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. అతడు మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఇవేగాకుండా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచి పలువురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడులను భారత ప్రభుత్వం ఇప్పటికే ఖండించింది. ఇరాన్ ఉప దౌత్యవేత్తకు సమన్లు అందజేసింది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా హర్మూజ్‌లో స్వేచ్ఛాయుత నౌకాయానాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని సూచించింది.

## అమెరికా స్థావరాలను ఆక్రమించండి

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా– ఇరాన్ తమ మధ్య కుదుర్చుకున్న ఒప్పందాన్ని సైతం పక్కన పెట్టేసి మరీ మరోసారి భీకరదాడులు చేసుకుంటున్నాయి దీనికితోడు ఇరు దేశాల నేతలు చేస్తున్న వ్యాఖ్యలతో ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఈ క్రమంలో 100 మంది అమెరికా సైనికులను కిడ్నాప్ చేయాలని ఇరాన్ మాజీ విదేశాంగ మంత్రి, పార్లమెంట్ సభ్యుడు మనుచెహర్ మొత్తకి పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలోని అమెరికా మిలిటరీ స్థావరాలను ఆక్రమించి.. బంధించిన సైనికుల్ని ఇరాన్ తీసుకురావాలని సైన్యానికి సూచించారు. ఇందుకోసం భూతల దాడులు చేయాలని వ్యాఖ్యానించినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి.గతంలోనూ మనుచెహర్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. అయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికాతో అవగాహన ఒప్పందం ఒక మోసపూరిత ప్రణాళికగా అభివర్ణించారు. "ఇస్లామాబాద్‌లో చర్చలు అంతా ఒక పథకం ప్రకారం అమెరికా పన్నిన కుట్ర. రెండు మూడు రోజుల్లో తమ ప్రణాళికను పూర్తిచేసి, ఇస్లామిక్ రిపబ్లిక్‌కు ముగింపు పలికేస్తామని భావించారు. కానీ పూర్తిగా విఫలమయ్యారు" అని విమర్శలు చేశారు. ఇరాన్‌పై దాడి చేసినందుకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇరాన్ డ్రోన్, క్షిపణి నిల్వలు, హర్మూజ్‌కు సమీపంలోని సైనిక స్థావరాలు లక్ష్యంగా అమెరికా దాడులు చేస్తోంది.

# నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**సిఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ రైతు ఐక్యవేదిక విజ్ఞప్తి**



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో మూసివేసిన నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సిఎం రేవంత్ రెడ్డి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పాలకుల తప్పుడు విధానాల కారణంగా పన్నెండు సంవత్సరాల క్రితం బోధన్ (నిజామాబాద్ జిల్లా), ముత్యంపేట(జగిత్యాల జిల్లా), ముంభోజిపల్లి (మెదక్ జిల్లా) లలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీలను మూసివేసిన కారణంగా చెరుకు రైతులతో పాటు షుగర్ ఫ్యాక్టరీలపై ఆధారపడ్డ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయనీ, ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం మేరకు షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించేందుకు జరుగుతున్న జాప్యాన్ని నివారించి వెంటనే తగు చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మూసివేసిన వ్యవసాయ ఆధారిత పరిశ్రమలైన నిజాం షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించాలని కోరుతూ ధర్నాలు, రాస్తారోకోలు, పాదయాత్ర, అసెంబ్లీ ముట్టడి వంటి ఆందోళన కార్యక్రమాలను రైతులు చేపట్టినప్పటికీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో మూసి వేసిన షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ మేరకు సిఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ సిఫార్సుల కమిటీని నియమించిందనీ, ఈమేరకు కమిటీ నిజాం షుగర్ ఫ్యాక్టరీలను సందర్శించగా చెరుకు రైతులు, కార్మికుల నుంచి అభిప్రాయాలు, సలహాలను స్వీకరించి సమగ్ర నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిందనీ పేర్కొన్నారు. ఈమేరకు షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ సిఫార్సుల కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు గత పెండింగ్ బకాయిలను చెల్లించేందుకు బడ్జెట్ లో రూ.173 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడంతో చెరుకు రైతుల్లో ఆనందోత్సహాలను కలిగించిందన్నారు. షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తే చెరుకు పంటను సాగు చేసే రైతులకు గిట్టుబాటు కావడంతో పాటు రవాణా భారం తగ్గి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకొని ఇచ్చిన వాగ్దానం మేరకు నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు జాప్యం చేయకుండా సిఎం రేవంత్ రెడ్డి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- ఆగస్టు 15 నుంచి ఒంటరి మహిళలకు నూతన పింఛన్ల మంజూరు
- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క



ములుగు,జూలై16(జనం సాక్షి): ఏజెన్సీ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వేగం పెంచాలని, ఆగస్టు 15వ తేదీ నుంచి ఒంటరి మహిళలకు నూతన పెన్షన్ లను అందించడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.ఏటూరు నాగారం ఐటిడిఏ కార్యాలయంలో గురువారం కన్నాయిగూడెం, మంగపేట, ఏటూరు నాగారం ఏజెన్సీ మండలాలకు సంబంధించిన వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,దరఖాస్తుల స్థితిగతులపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శాఖల వారీగా అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ పథకాల పంపిణీ, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కార స్థితిగతులను సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకుని అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ఏజెన్సీ గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల అవసరాలు, ప్రజల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహం అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల వారీగా పేదవారి జాబితాలను సిద్ధం చేసి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఆగస్టు 15వ తేదీ నుంచి ఒంటరి మహిళలకు నూతన పింఛన్లను అందించడం జరుగుతుందని, అర్హుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు మరణించినట్లయితే వారి పేర్లను వెంటనే జాబితా నుంచి తొలగించి పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు. పలు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు అందుబాటులో లేని కారణంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేయకుండా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.స్థానిక ప్రజాప్రతి నిధులు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని కోరారు.ఏజెన్సీ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రజలు గ్రామాల్లో ఉన్న సమయాల్లోనే వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ఆరోగ్య సేవలు అందించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం,ఆహారం,భద్రతతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా బాధ్యతా యుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంట మార్పిడిపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు, నకిలీ పురుగు మందుల విక్రయాలను కట్టడి చేస్తూ యూరియా సరఫరా సక్రమంగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించడం హర్షణీయమైన విషయమని మంత్రి పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు స్థానికంగా లభించే వనరులను వినియోగించుకుని వినూత్న జీవనోపాధి అవకాశాలను సృష్టించుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి,ఆర్డీవో కృష్ణవేణి, సర్పంచులు,గ్రామ కార్యదర్శులు,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బంజారా సాహిత్యానికి కొత్త అడుగు

- 'యాడిర్ ఘుంగ్టో' ఆవిష్కరణ



హైదరాబాద్ (జనంసాక్షి) : ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. తెలుగు అభ్యసిస్తున్న యువ రచయిత ఇంద్రావత్ రాహుల్ నాయక్ రచించిన "యాడిర్ ఘుంగ్టో" బంజారా కవిత్వ సంపుటి కల్వకుంట్ల కవిత కార్యాలయంలో ప్రముఖ బంజారా నాయకుల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. బంజారా సంస్కృతి, భాష, సంప్రదాయాలను సాహిత్య రూపంలో భావితరాలకు అందించేందుకు యువ రచయితలు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి విలువైన రచనలు మరింతగా వెలువడాలని ఆకాంక్షిస్తూ యువ రచయిత ఇంద్రావత్ రాహుల్ నాయక్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. 172 పేజీలతో రూపొందిన "యాడిర్ ఘుంగ్టో" బంజారా కవిత్వ సంపుటిలో బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, ఆచార వ్యవహారాలు, కుటుంబ విలువలు, ప్రకృతి అనుబంధం, సామాజిక జీవితం వంటి అంశాలు కవిత్వ రూపంలో ఆవిష్కరించ బడ్డాయి. బంజారా సాహిత్యాన్ని విస్తృత పాఠకలోకానికి చేరవేయాలనే లక్ష్యంతో ఈ కృతి రూపొందించబడింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ బంజారా నాయకులు, సాహిత్యాభిమానులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని రచయితను అభినందించారు.

# బీఆర్ఎస్ హయాంలోనే ఎయిర్‌పోర్ట్ అనుమతులు

- మంత్రిగా కెటిఆర్ పలుమార్లు ఢిల్లీ వెళ్లి చర్చలు
- స్పష్టం చేసిన వరంగల్ జిల్లా బిఆర్ఎస్ నాయకులు



వరంగల్, జూలై16 (జనంసాక్షి) : మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి సంబంధించిన అనుమతులు, భూసేకరణ ప్రక్రియ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, నన్నపునేని నరేందర్ పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. నిజాం కాలంలో నిర్మితమైన మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం మాజీ మంత్రి కేటీఆర్ పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారని తెలిపారు. ఉడాన్ పథకం కింద కూడా కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించామని, 1.8 కిలోమీటర్ల రన్‌వేను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 3.8 కిలోమీటర్లకు విస్తరించేందుకు రైతులను ఒప్పించి భూసేకరణ చేపట్టామని చెప్పారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ, మామునూరు ఎయిర్‌పోర్టు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 253 ఎకరాల భూసేకరణకు కేబినెట్ ఆమోదం లభించిందని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేసి పరీక్షలు నిర్వహించామని, ఎన్నికల కోడ్ కారణంగా నియామకాలు నిలిచిపోయాయని అన్నారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం కూడా రూ.500 కోట్లతో భూసేకరణ చేపట్టామని పేర్కొంటూ, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకోవడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ, భూసేకరణకు అనుమతి ఇచ్చింది ఎవరో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. దేశంలో అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ మామునూరు ఎయిర్‌పోర్టును ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు తమ ఘనతగా చెప్పుకోవడం సరికాదని, మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వమే పునాది వేసిందని పేర్కొన్నారు.

## వానల కోసం కప్ప పూజలు

నల్లగొండ, జూలై16 (జనంసాక్షి) : చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం ఆధ్వర్యంలో గురువారం మహిళలు సంప్రదాయబద్ధంగా కప్ప కాముడు నిర్వహించి, సకాలంలో వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు బిందెలతో ఆలయానికి చేరుకుని సామూహికంగా జలాభిషేకం నిర్వహించారు.

# ఏసీబీకి చిక్కిన మరో ఇద్దరు అధికారులు



హైదరాబాద్, జూలై16 (జనంసాక్షి) : రాష్ట్రంలో మరో ఇద్దరు ప్రభుత్వ అధికారులు ఏసీబీ వలకు చిక్కారు. ఆదిలాబాద్‌లో నీటిపారుదల శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాథోడ్ విట్టల్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రకాష్ లను ఏసీబీ ఆదిలాబాద్ రేంజ్ ట్రాప్ బృందం గురువారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. సుమారు రూ.60 వేలు ఫిర్యాదుదారుడి నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్‌లో ఉన్న ఈఈ నివాసంలో సోదాలు నిర్వహిస్తోంది.

# ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక

- రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలు అందించే లక్ష్యం
- కార్యాచరణ ప్రణాళికపై పుస్తక రూపంలో వివరాలు
- సచివాలయంలో ఆవిష్కరించిన మంత్రి తుమ్మల




హైదరాబాద్, జూలై16 (జనంసాక్షి) : వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎల్‌నినోపై రాష్ట్ర తొలి శాస్త్రీయ కంటింజెన్సీ ప్లాన్ విడుదల చేస్తామని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఆయా మండలాలు, జిల్లాల వారీగా వర్షపాతం లోటు వివరాలు అందజేయాలని అధికారులకు సూచించారు. రెండు నెలల వాతావరణ అంచనాల ఆధారంగా కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి తుమ్మల చెప్పుకొచ్చారు. ఐఎండీ సమాచారంతో రోజువారీ వాతావరణ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. రైతులకు పంటల ఎంపిక, నీటి వినియోగంపై శాస్త్రీయ సూచనలు అందజేస్తామని చెప్పారు. ఆయా పంట నష్టాల నివారణకు అన్ని శాఖల సమన్వయం చేసుకుంటామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం వంటి ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులకు శాస్త్రీయ మార్గదర్శకాలు అందించే లక్ష్యంతో వ్యవసాయ శాఖ రూపొందించిన 'తెలంగాణ వ్యవసాయ అత్యవసర / ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక వానాకాలం-2026' పుస్తకాన్ని తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకోవడానికి, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి, ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడానికి, పంటల సంరక్షణ చర్యలను చేపట్టడానికి ఈ పుస్తకం సమగ్ర మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. శాస్త్రీయ సమాచారం, వాతావరణ అంచనాలు, జిల్లా వారీ కార్యాచరణ ప్రణాళికలు, పంటల నిర్వహణ సూచనలను సమన్వయం చేస్తూ రూపొందించిన ఈ పుస్తకం రైతులకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి,ఉద్యాన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు సమయానుకూలంగా పంటల ఎంపిక, సాగు నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను అమలు చేయడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ పుస్తకం రాష్ట్రంలోని రైతులకు, వ్యవసాయ అధికారులకు, అనుబంధ శాఖలకు ఒక ప్రామాణిక మార్గదర్శక గ్రంథంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# షరతుల్లేకుండా తక్షణమే మహిళా రిజర్వేషన్లు

- జనగణన, డీలిమిటేషన్‌తో ముడిపెట్టరాదు
- మహిళా రిజర్వేషన్ జెఎసి డిమాండ్

హైదరాబాద్, జూలై16 (జనంసాక్షి) : పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే అమలు చేయాలని మహిళా రిజర్వేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. మహిళా రిజర్వేషన్ల అమలును జనగణన, నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్)తో అనుసంధానం చేయడాన్ని జేఏసీ వ్యతిరేకించింది. ఈ నిబంధనలను తొలగించేలా రాజ్యాంగ సవరణకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరింది. జేఏసీ తరఫున అందజేసిన వినతిపత్రంపై ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణ జ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. జ్యోతి, పీఓడబ్ల్యూ-2 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వరూప, సీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. జ్యోతి సంతకాలు చేశారు.

# వివాదాలకు కేరాఫ్ ట్రైబల్ వేల్ఫేర్ గురుకులం

- పీఎం-శ్రీ నిధుల్లో గోల్‌మాల్!
- గురుకులంలో చుక్క నీరు లేక విద్యార్థినుల ధర్నా...!
- బాత్రూంల కోసం నీరు లేక నరకం చూస్తున్న విద్యార్థినులు
- మోటార్ , బాత్రూం రిపేర్ కోసం తలా రూ. 10 వసూలు....!
- కోట్ల రూపాయల కేంద్ర నిధులు ఏమయ్యాయంటూ విద్యార్థి సంఘాల ఆగ్రహం...




కొత్తగూడ జూలై 16 (జనంసాక్షి) : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాంధీనగర్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల తీవ్ర వివాదాలకు, అవినీతి ఆరోపణలకు కేంద్రబిందువుగా మారింది. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'పీఎం-శ్రీ' పథకం కింద ఈ మోడల్ పాఠశాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరైనప్పటికీ, క్షేత్రస్థాయిలో విద్యార్థినులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కాగితాల్లో లక్షల రూపాయల నిధులు కనిపిస్తున్నా, పాఠశాల బాత్రూంలలో మాత్రం వాడుకోవడానికి చుక్క నీరు లేకపోవడం ఇక్కడి దయనీయ స్థితికి అద్దం పడుతోంది.

**రోడ్డెక్కిన విద్యార్థినులు.. కన్నీటి ఆవేదన!**

గత నెల రోజులుగా నీటి సమస్యతో నరకయాతన అనుభవిస్తున్న విద్యార్థినులు, గురువారం నాడు ఓపిక నశించి పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి ధర్నాకు దిగారు. ఉదయం లేచినప్పటి నుండి వాష్ రూమ్‌లకు వెళ్లడానికి కూడా నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు కన్నీరుమున్నీరయ్యారు. తాగేనీటి కోసం, రోజువారీ అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**విద్యార్థుల నుంచే చందాలు.. తీవ్ర దుమారం!**

ఈ గురుకులంలో అసలైన దారుణం ఏమిటంటే, పాఠశాల నీటి మోటార్, బాత్రూం పాడైతే దానిని బాగు చేయించడానికి తమ వద్ద నిధులు లేవంటూ విద్యార్థినుల నుండి తలకొక రూ. 10 చొప్పున వసూలు చేయడానికి ప్రధానోపాధ్యాయులు ప్రయత్నించడం తీవ్ర దుమారానికి దారితీసింది. పీఎం-శ్రీ కింద ఆధునికీకరణ, నీటి వసతి, పారిశుధ్యం కోసం కేంద్రం భారీగా గ్రాంట్లు విడుదల చేస్తుంటే, కనీసం ఒక మోటార్ రిపేర్ చేయించలేక విద్యార్థుల వద్ద డబ్బులు వసూలు చేయడమేంటని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

**నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి...!**

లక్షలాది రూపాయల నిధులు వస్తున్నా పాఠశాల ఇలాంటి దుస్థితిలో ఉండటం వెనుక పెద్ద ఆర్థిక స్కామ్ దాగి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చిన నిధులను దారిమళ్లించి, ఉన్నతాధికారులు, పాఠశాల యాజమాన్యం తమ జేబులు నింపుకున్నారా...! అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ప్రశ్నించిన విద్యార్థినులను కొందరు ఉపాధ్యా యులు బెదిరించడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడుతుండడం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది.

**విజిలెన్స్ విచారణకు డిమాండ్...**

విద్యార్థినుల జీవితాలతో ఆడుకుంటున్న ఈ గురుకుల పాఠశాల వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.పీఎం-శ్రీ నిధుల ఖర్చులపై తక్షణమే విజిలెన్స్ విచారణ జరిపించాలి. అవినీతికి పాల్పడిన హెచ్‌ఎం, అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, తక్షణమే గురుకులానికి శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలి.బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకులు

**మంత్రి సితక్క తక్షణ స్పందన...**

ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెంటనే స్పందించి విద్యార్థినులతో ఫోన్లో మాట్లాడారు. "మీకు నేను అండగా ఉంటాను, భయపడకండి" అని భరోసా ఇచ్చారు. సమస్యలను 12 గంటల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించడంతో పాటు, విద్యార్థినుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి హామీతో విద్యార్థినులు తమ ఆందోళనను విరమించారు.

## హిందీ పెత్తనం వద్దు..

# దేశాన్ని భాషతో విభజించొద్దు

భారతదేశాన్ని ఏకం చేసేది ఒకే భాష కాదని, రాజ్యాంగ విలువలని, పరస్పర గౌరవమని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా గ్రహించాలి. దేశంలోని కోట్లాది విద్యార్థులపై ఒక భాషను బలవంతంగా రుద్దాలనే ఆలోచన ప్రజాస్వామ్యానికీ, సమాఖ్య వ్యవస్థకూ విరుద్ధం. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు ఈ విషయాన్ని మరోసారి స్పష్టంగా గుర్తు చేశాయి.

హిందీ గొప్ప భాషే. కానీ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, మరాఠీ, ఒడియా, అస్సామీ, పంజాబీ వంటి భాషలు తక్కువ కావు. వేల ఏళ్ల చరిత్ర, సాహిత్యం, సంస్కృతి కలిగిన భాషలను పక్కన పెట్టి, ఒక భాషకే ప్రత్యేక హోదా కల్పించే ప్రయత్నం దేశ సమైక్యతకు మేలు చేయదు. గౌరవం సంపాదించేది భాషే గానీ, అధికార బలంతో సాధించే ఆధిపత్యం కాదు. హిందీ నేర్చుకోకపోతే దేశభక్తి లేదన్న భావనను పరోక్షంగా సృష్టించడం, పాఠ్యప్రణాళికల ద్వారా నిర్బంధించడం ప్రమాదకర ధోరణి. భాషల మధ్య స్నేహాన్ని పెంచాల్సిన ప్రభుత్వం, భాషల మధ్య అనుమానాలను పెంచే పరిస్థితి తీసుకురావడం దురదృష్టకరం.

సంపాదకీయం

దక్షిణ భారత రాష్ట్రాలు భాషా స్వాభిమానాన్ని కాపాడుకోవడానికి దశాబ్దాలుగా పోరాడుతున్నాయి. ఆ చరిత్రను విస్మరించి మళ్లీ అదే గాయాన్ని రేపడం తెలివైన పాలన కాదు. ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవడం పరిపాలన. వాటిని పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం పెత్తనం. ఇప్పటికే విద్యార్థులు పరీక్షలు, పోటీలు, భవిష్యత్ ఆందోళనలతో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అలాంటి సమయంలో తొమ్మిదో తరగతిలో మరో భాషను తప్పనిసరి చేయడం విద్యను సులభతరం చేయదు. మార్కుల కోసం భాషను బట్టీ పట్టించే వ్యవస్థ మాత్రమే పెరుగుతుంది. జ్ఞానం కాదు, భారమే పెరుగుతుంది. భాషలను అభివృద్ధి చేయాలంటే ప్రేమను పెంచాలి, భయాన్ని కాదు. ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించాలి, నిర్బంధాలు కాదు. హిందీ నేర్చుకోవాలనుకునే వారికి వంద అవకాశాలు ఇవ్వండి. కానీ నేర్చుకోవద్దనుకునే వారిపై ప్రభుత్వ అధికారాన్ని ప్రయోగించవద్దు. ప్రజాస్వామ్యంలో ఎంపిక హక్కు కూడా ఒక ప్రాథమిక విలువ.

భారత రాజ్యాంగం దేశానికి ఒక "జాతీయ భాష"ను ప్రకటించలేదు. అన్ని భారతీయ భాషలకు గౌరవం కల్పించే వ్యవస్థను నిర్మించింది. అలాంటి రాజ్యాంగ ఆత్మను పక్కన పెట్టి ఒకే భాషకు ప్రాధాన్యం కల్పించే విధానాలు దేశాన్ని దగ్గర చేయవు; దూరం చేస్తాయి.

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు కేవలం విద్యా విధానంపై సూచనలు కావు. అవి అధికారానికి ఒక హెచ్చరిక. ప్రజల భావోద్వేగాలు, ప్రాంతీయ ఆత్మగౌరవం, సమాఖ్య స్ఫూర్తి.. వీటిని విస్మరించి తీసుకునే నిర్ణయాలు చివరికి జాతీయ ఐక్యతకే ముప్పుగా మారతాయని చెప్పిన సందేశం. దేశానికి కావాల్సింది భాషా ఆధిపత్యం కాదు; భాషా సామరస్యం. ఒక భాషను పైకి తీసుకురావడానికి మరో భాషను కిందకు నెట్టాల్సిన అవసరం లేదు. భాషలు అధికారంతో కాదు, ఆదరణతో బతుకుతాయి. బలవంతంతో కాదు, అభిమానంతో విస్తరిస్తాయి. హిందీని గౌరవించండి... కానీ హిందీ పేరుతో పెత్తనం చేయవద్దు. అదే ప్రజాస్వామ్యానికి, అదే భారత సమాఖ్య స్ఫూర్తికి నిజమైన గౌరవం.

**ప్రభుతేదీడ దళారి దందే..!!**

ఏ ఏటి కాయేదు
ఎగదోసు కొచ్చేటి
పుష్కర పావన
సకల సౌకర్యాల
స్నానాల ఘట్టాల..
కందూర్లు ద్వారర్లు
బోనాలు గ్యార్లలు
సివాలూ సిగాలూ
యాటకుదుపులూ
దాసంగ బలిగాన్లు..
బతుకుల్ని పెనవేసి
వెన్నంటి తరిమేటి
ఎనలేని పర్వాలను
ననీటు జేయుదులే
సర్కార్ల పనైపాయె..
నేలతడుపు చినుకు
రాల్చేటి మబ్బులెంట
తేమ జాడల కోసం
గొంతెండిన పక్షయ్య
అల్లాడే మూగ రైతు..
మృగశిర ఎన్నటెళ్లె
ఆద్రేతే దక్కిన జనం
మొక్కల్లే దాటిపాయె
ఏసినిత్తులు ఏసినట్లే
సొల్లల గుడ్డెల దీసిస్తే
శోకాల పాలాయె పల్లె..
ఏలె టొల్లెది ఏం నొచ్చె
కల్ల ఎన్నల్లోతెంబాయె
అలిపిల్లల మొదకు ఉరే
దిక్కుయ్య గుడ్డెల్లెసేసి
యుద్దంల ఒరిగె సేద్యం..
వానవాసోయిన గోదాడి
నదుల నీటి హక్కులు
మా వాట మా కిస్మంటే
ఎనబై ఏండ్లాయె కేసుల్ల
పోరులో పానాల్నాయె..
క్రతువులు కన్న పెల్లిళ్లు
పాలిమేరంచు ప్రార్థనలు
ఖాళీ కుండల మొలలు
వానదేవుని పాటలెత్తిరి..
నాదింత నీదెంతంటూ
దొంగ నీవంటే నీవంటు
వాగన్ని మింది వాగదు
వార్డులే నరిపోయే గానీ
పార్టీలన్ని సుఖ్ఖన తేలె..
పాలక ప్రతిపక్ష తేడేదా
గుంటనక్కలు విక్కంత
పంటకు పట్టిన పుర్రులు
మందను మింగే తోడేళ్లు
ప్రభుతేదీడ దళారి దందే!!

డా. ఇక్బాల్ పాషా
9440775732

# నిరుద్యోగ సెగలతో రగులుతున్న తెలంగాణ

*తెలంగాణలో నేడు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురవుతున్న అతిపెద్ద రాజకీయ సవాలు నిరుద్యోగ ఉద్యమం. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలలో నిరుద్యోగులు ఇంత పెద్ద ఎత్తున రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేయడం నిరుద్యోగుల ఆవేదనకు ఆక్రోశానికి నిదర్శనం.ఇది రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుతుంది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు ఆచరణకు నోచుకోక పోవడం, ప్రభుత్వం మీద విశ్వాసం సన్నగిల్లడం*



ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పింది. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించింది. యూత్ డిక్లరేషన్ ప్రకటించింది.హా ఈ హామీలను నమ్మి లక్షలాది మంది యువత ఆశలు పెట్టుకున్నారు. కానీ రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీలు ఆచరణకు పూర్తిగా నోచుకోలేదు . దీంతో యువతలో నిరాశ, ఆవేదన, ఆగ్రహం పెరిగాయి.

ప్రస్తుతంపోలీసు ఉద్యోగాల అంశం నిరుద్యోగ ఉద్యమానికి కేంద్ర బిందువు అయింది. గతంలో20 వేలకుపైగా పోలీసు పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు మాత్రం , ఐదు వేల, ఎవి వేల పోస్టుల గురించి మాత్రమే మాట్లాడుతోంది. దీంతో ప్రభుత్వం మాట మార్చిందనే అభిప్రాయం పోలీసు ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగుల్లో పెరిగింది. 20వేల పైగా ఖాళీలు ఉన్న ఎందుకు తగ్గిస్తూ నోటిఫికేషన్ ఇవ్వడం, ఇప్పటికే లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కోచింగ్ తీసుకుంటూ నానా ఇబ్బందులు పడుతున్నామని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు

తెలంగాణ ఏర్పడిన తర్వాత పోలీసు శాఖలో పెద్ద సంఖ్యలో నియామకాలు జరిగాయి. చాలా నోటిఫికేషన్లలో పదివేలకుపైగా పోస్టులు ఉండేవి. అందుకే నేడు ఇంజనీరింగ్, పీజీ చదివిన యువత కూడా పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు కోచింగ్ సెంటర్లు వేలాది మంది అభ్యర్థులతో నిండిపోయాయి. పెద్ద హాళ్లలో ఒకేసారి వెయ్యికి పైగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఇది పోలీసు ఉద్యోగాలపై యువతలో ఉన్న ఆశలకు నిదర్శనం


గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారు. ఆ ఉద్యమాలు రాజకీయంగా ఎంత ప్రభావం చూపాయో అందరికీ తెలుసు. అలాంటి పరిస్థితి ఇప్పుడు మళ్లీ తక్కువ రోజులలో నే కనిపిస్తోంది. నిరుద్యోగ భృతి అమలు కాలేదు. జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదు. విశ్వవిద్యాలయాల్లో టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. దీంతో ఉన్నత విద్య కూడా ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

ఇప్పటికే నిరుద్యోగ జేఏసీ, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద భారీ నిరుద్యోగ మహాధర్నా జరిగింది. ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా నిరుద్యోగ సమస్యపై ఉద్యమాలకు సిద్ధమవుతున్నాయి. దీంతో ఈ సమస్య రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన అంశంగా మారింది. ఉద్యమం చేస్తున్న నిరుద్యోగులను అరెస్టు చేయడం లేదా బెదిరించడం పరిష్కారం కాదు. ప్రజాస్వామ్యంలో సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలి. ఉద్యమాలకు కారణమైన సమస్యలను తొలగించాలి. ప్రభుత్వం వెంటనే ఖాళీ పోస్టుల భర్తీకి స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలి. పోలీసు నియామకాలపై స్పష్టత ఇవ్వాలి. విశ్వవిద్యా లయాల్లో ఖాళీలను భర్తీ చేయాలి. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ హామీలను అమలు చేయాలి.

ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు పెంచాలి. ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. స్థానిక యువతకు ఎక్కువ ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగ జేఏసీలు, విద్యార్థి సంఘాలు, మేధావులు, పారిశ్రామిక వేత్తలు, ప్రతిపక్షాలతో చర్చించి సమగ్ర ఉపాధి విధానాన్ని రూపొందించాలి.

ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం నిరుద్యోగులకు స్పష్టమైన హామీ ఇవ్వడం లేదు. భరోసా కల్పించే ప్రకటన కూడా చేయడం లేదు. అందుకే ఉద్యమం మరింత బలపడుతోంది. నిరుద్యోగులకు ఉద్యోగాలతో పాటు ప్రభుత్వం తమ పట్ల చిత్తశుద్ధితో ఉందనే నమ్మకం కూడా అవసరం.


నిరుద్యోగ సమస్య కేవలం ఉద్యోగాల సమస్య కాదు. అది తెలంగాణ యువత భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న. ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తే యువతకు విశ్వాసం పెరుగుతుంది. లేకపోతే నిరుద్యోగ ఉద్యమం మరింత బలపడే అవకాశం ఉంది. ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత.



డా.ఆర్ ఎల్ మూర్తి
నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్
8247672658

# భారత రాజ్యసభ సంపన్నులకే సొంతమా..?

భారత రాజ్యాంగం రాజ్యసభను కేవలం రెండో సభగా కాకుండా, రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడే శాశ్వత సభగా రూపొందించింది. లోక్‌సభలో ప్రజల ప్రత్యక్ష స్వరం వినిపిస్తే, రాజ్యసభలో రాష్ట్రాల హక్కులు, జాతీయ ప్రయోజనాలు, దీర్ఘకాలిక విధానాలు, మేధోపరమైన చర్చలు ప్రతిబింబించాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. అయితే నేటి పరిస్థితిని పరిశీలిస్తే రాజ్యసభలో ప్రజాసేవకుల కంటే సంపన్నుల సంఖ్య పెరుగుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ూంంశీషఱaఞఱశీఅ టశీతీ ణవఎశీషతీaఞఱష =వటశీతీఎం - =aణ) అనే స్వచ్ఛంద సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, 226 మంది రాజ్యసభ సభ్యుల ఆస్తుల విలువ సుమారు రూ.26,047 కోట్లుగా ఉంది. అందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన సభ్యులే అత్యధిక సంపద కలిగిన వారిలో ముందంజలో ఉన్నారు. అందులో తొలి ముగ్గురిలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రం నుండి రాజ్యసభ ప్రతినిధులుగా ఉండడం గమనార్హం. వారిలో ప్రథమ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ నుండి బండి పార్థసారథి 5,300 కోట్లు కలిగి ఉండగా, రెండవ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నుండి అభిషేక్ మను సింఘ్వీ 2,558 కోట్లు కలిగి ఉండగా, మూడవ స్థానంలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన బీజేపీ పార్టీ నుండి రాజేందర్ గుప్తా 5,053 కోట్లు కలిగి ఉండడం గమనార్హం. తెలంగాణ తర్వాత మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, బీహార్, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుండి అత్యధిక ధనవంతులు రాజ్యసభ ప్రతినిధులుగా ఉండడం గమనార్హం. రాష్ట్రం ఏదైనా పార్టీ ఏదైనా కోట్ల ఆస్తి ఉన్న, క్రిమినల్ కేసులు ఉన్న వారిని కూడా ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తూ రాజ్యసభ ప్రతినిధులుగా ఆయా పార్టీలు ప్రోత్సహిస్తున్నాయి. రాజ్యసభలో సంపన్నులు ఉండడం రాజ్యాంగ విరుద్ధం కాదు.కానీ భారత రాజ్యాంగం ప్రకారం అర్హతలు ఉన్న ఎవరైనా రాజ్యసభకు ఎన్నిక కావచ్చు. వ్యాపారవేత్తలు, పారిశ్రామిక రంగానికి చెందిన వారు కూడా దేశ ఆర్థికాభివృద్ధిపై అనుభవంతో చర్చలకు ఉపయోగపడవచ్చు. అయితే ప్రజల్లో ఉత్పన్నమవుతున్న ప్రధాన




ప్రశ్న ఏమిటంటే సామాన్య ప్రజల, రైతుల, కార్మికుల, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల జీవిత అనుభవాలను ప్రతిబింబించే నాయకులకు కూడా సమాన అవకాశాలు లభిస్తున్నాయా.? రాజ్యసభ రాష్ట్రాల హక్కులను కాపాడే వేదిక. నీటి పంపిణీ, కేంద్ర నిధులు, విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల సంక్షేమం వంటి అంశాలపై గంభీరమైన చర్చ జరగాలి. సభ్యులు తమ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం నిరంతరం స్వరం వినిపించాలి.

భారతదేశంలో కోట్లాది మంది బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, పేద వర్గాలు ఇప్పటికీ విద్య, ఉపాధి, భూమి, ఆర్థిక అవకాశాల్లో వెనుకబడి ఉన్నారు. ఇలాంటి పరిస్థితిలో రాజ్యసభలో వీరి సామాజిక అనుభవం కలిగిన నాయకుల ప్రాతినిధ్యం పెరిగినప్పుడే ప్రజాస్వామ్యానికి మరింత బలం చేకూరుతుంది.సంపద కలిగి ఉండడం తప్పు కాదు. కానీ ప్రజాస్వామ్యంలో సంపద ఒక్కటే నాయకత్వానికి ప్రమాణంగా మారితే అది అసమాన అవకాశాలపై చర్చకు దారితీస్తుంది. ఒక సాధారణ ఉపాధ్యాయుడు, రైతు, సామాజిక ఉద్యమకారుడు, శాస్త్రవేత్త లేదా ప్రజాహితానికి జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి కూడా రాజ్యసభలోకి రావడానికి రాజకీయ వ్యవస్థ అనుకూలంగా ఉండాలి.రాజకీయ పార్టీలు రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో కేవలం ఆర్థిక సామర్థ్యాన్ని కాకుండా ప్రజాసేవ, సామాజిక నిబద్ధత, రాజ్యాంగ విలువల పట్ల అంకితభావం, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడే సామర్థ్యాన్ని ప్రధాన ప్రమాణాలుగా పరిగణిస్తే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు కేవలం ధనవంతుల వల్లనే ఎదగలేదు. పారదర్శక రాజకీయ వ్యవస్థ, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, ప్రతిభకు గౌరవం, బలమైన ప్రజాస్వామ్య సంస్థల వల్లే ఎదిగాయి. భారతదేశం కూడా ప్రపంచంలో అగ్రస్థానానికి చేరాలంటే ప్రతి వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే సంస్కరణలు అవసరం.

రాజ్యసభ నిజంగా "మేధావుల సభ"గా నిలవాలంటే సంపద కంటే సేవ, అధికారం కంటే రాజ్యాంగ నిబద్ధత, వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్రాల హక్కులు, సామాజిక న్యాయం, పేదల అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలపై నిరంతరం పోరాడే నాయకులు రాజ్యసభలో ఎక్కువగా ఉండడం భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది.


సామాన్యుడికి కూడా రాజ్యసభ ద్వారాలు సమానంగా తెరుచుకున్న రోజే భారత ప్రజాస్వామ్యం మరింత సమగ్రంగా, సమానత్వంతో కూడిన వ్యవస్థగా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది. అప్పుడు మాత్రమే భారత రాజ్యాంగ నిర్మాతలు కలలుగన్న స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య గణతంత్ర విలువలతో కూడిన పార్లమెంటరీ తరహా ప్రభుత్వ రాజకీయ వ్యవస్థకు అర్థం వస్తుంది.



పుల్లెంల గణేష్
(సోషల్, పొలిటికల్ ఎనలిస్ట్)
9553041549

# సామాజిక తత్వశాస్త్రం.. ప్రేమ సామాజిక చట్రాలు

ప్రేమ, పెళ్లి మరియు కుటుంబ వ్యవస్థల యొక్క పరిణామ క్రమాన్ని, వాటి వెనుక ఉన్న సామాజిక-రాజకీయ కోణాలను ఈ వ్యాసం విశ్లేషిస్తుంది. . సాంప్రదాయ సంస్థలు ప్రేమ యొక్క సహజత్వాన్ని ఎలా హరించి, పితృస్వామ్య మరియు భూస్వామ్య-పెట్టుబడిదారీ దృక్పథాలతో కూడిన కేవలం ఒక వ్యాపార లావాదేవీగా మారుస్తున్నాయో ఈ వ్యాసం విమర్శనాత్మకంగా చర్చిస్తుంది. 'జీవన యానం' నవలలోని తాత్విక మూలాలను (Core Philosophy) ఆధారంగా చేసుకుని, సృజనాత్మక సాహిత్య చట్రంలో సామాజిక సిద్ధాంతాలను మిళితం చేస్తూ... మానవ భావోద్వేగాలు, ఆధునిక బంధాలు ఏ విధంగా వ్యవస్థీకృత కొలమానాలకు, అధికార శ్రేణులకు మరియు సాంస్కృతిక విలువల ముసుగులో జరిగే ఆర్థిక లావాదేవీలకు బలిపోతున్నాయో ఈ అధ్యయనం నిరూపిస్తుంది.



**1. ఒక సామాజిక-సాంస్కృతిక చైతన్యంగా ప్రేమ**

మానవ వికాసానికి, చైతన్యానికి తోడ్పడే శక్తులలో సృజన, ప్రేమ, కరుణ, ధ్యానం మరియు స్నేహం అత్యంత శక్తివంతమైన సాధనాలు. వీటిలో ప్రేమ, స్నేహం ప్రతి ఒక్కరికీ సులువుగా సాధ్యమయ్యే అత్యున్నత మానవీయ గుణాలు. ప్రేమ అనేది కేవలం ఒక స్థిరమైన ఆలోచన కాదు; అది ఒక సజీవ సంస్కృతి. అది స్పందన, స్వేచ్ఛ, కరుణ, సత్యం మరియు సుందరమైన ఆచరణల యొక్క అద్భుత సమాహారం. అది మానవ హృదయం నుండి వికసించే ఒక దివ్యమైన పుష్పం వంటిది.

అయితే, ప్రేమ యొక్క ప్రాథమిక స్పందనకు, ప్రేమ ఆలోచనకు మధ్య బంధాల రూపంలో సాగే దాని ఆచరణకు మధ్య ఒక సహజమైన వైరుధ్యం ఎప్పుడూ ఉంటుంది. ఈ విభిన్న కోణాల పరస్పర సంబంధాల నుండే సరికొత్త మానవీయ సంబంధాలు శాశ్వతత్వాలుగా వికసిస్తాయి, విశ్వవ్యాప్త మవుతాయి. ప్రేమ అనేది వ్యక్త రూపంలోనూ, అవ్యక్త రూపంలోనూ ఏకకాలంలో పనిచేస్తుంది. అవ్యక్త ప్రేమ లోపల ఒక గొప్ప ఉత్తేజంగా, నిశ్శబ్ద శక్తిగా నిలిచిపోతే, వ్యక్తం చేసే ప్రేమ ఒక గొప్ప చైతన్య ప్రసారంలా అవతలివారిని చేరుకుంటుంది. పందిసార్లో మళ్లీ మళ్లీ ఊరే అమృతం ప్రేమ. దీనిని పూర్తిగా వ్యక్తంచేయడం ఎవరికీ సాధ్యం కాదు, అలాగని అసలు వ్యక్తంచేయకుండానూ మానవాళి మనుగడ సాగించలేదు.

**2. భావ వ్యక్తీకరణ - అంతర్గత పరిణామ మార్గం**

మానసిక కోణంలో చూస్తే, వ్యక్తం చేయని ప్రేమ ఒక అంతర్గత భావన అయితే, వ్యక్తం చేసే ప్రేమ ఒక సజీవమైన ఆచరణ అవుతుంది. భావన నుండి ఆచరణకు మారే ఈ క్రమమే మానవ చైతన్యంలో సరికొత్త స్థితులను సృష్టిస్తుంది. ఎదుటివారి స్పందన లేదా సమాజం చూపే నిరోధాన్ని బట్టి ఈ ప్రేమ పెరగవచ్చు లేదా తునిగిపోవచ్చు. మన అంతరంగంలో ఉండే ప్రేమకు, మనం సమాజంలో ఆచరించే ప్రేమకు మధ్య నిరంతర మానసిక సంబంధం (Psychological Bridge) ఉంటుంది.

వ్యక్తం చేయని ప్రేమ లోపల రగిలే శక్తి జ్వాల అయితే, వ్యక్తం చేసే ప్రేమ వెలుగునిచ్చే దీపం లాంటిది. ప్రేమ బాహ్య ప్రపంచంలో అనంతశక్తిని రగిల్చి, ఆ శక్తిని తిరిగి తనలోకే మార్చుకునే ఒక అద్భుతమైన క్రమం. మనుషుల అవగాహనను బట్టి ప్రేమ వివిధ రూపాలు (వాత్సల్యం, కరుణ, శృంగారం లేదా శారీరక ఆకర్షణ) తీసుకున్నప్పటికీ, దాని అత్యున్నత పరిణామ కోణం ప్రేమను స్వేచ్ఛ, సమానత్వం మరియు సహోదరత్వాల యొక్క పరమావధిగా చూస్తుంది.

**3. సామాజిక చట్రాలు - కుటుంబ వ్యవస్థపై విమర్శనాత్మక దృక్పథం**

పెళ్లి, కుటుంబం, కులం (సామాజిక వర్గీకరణ), మతం, ప్రభుత్వం మరియు సమాజం అనేవన్నీ మానవ ప్రవర్తనను క్రమబద్ధం చేయడానికి మనుషులే ఏర్పరుచుకున్న వివిధ 'నిర్మాణ రూపాలు'. ప్రేమ అనేది తన సహజ స్వభావం ప్రకారం ఒక్క సామాజిక చట్రానికి పరిమితం కాని ఒక నిరంతర ప్రవాహం. అయితే, చారిత్రక అధికార కేంద్రాలు ఈ ప్రేమను వ్యవస్థీకరించి... శృంగారం/ప్రేమ బంధాన్ని పెళ్లి అనే చట్రంలోకి, వాత్సల్యాన్ని కుటుంబం అనే పరిధిలోకి బంధించాయి. ఈ నిర్మాణ రూపాలు సమాజంలో ఒక బిగుతుగా ఉండే కొలత పాత్రల వంటివి:

**రక్షణ పాత్ర:** కుటుంబం అనేది ఎదుగుతున్న పిల్లలను పొదువుకొని ఎదిగించే ఒక ముఖ్యమైన పాత్ర/incubator.

**నిర్బంధాత్మక ఘర్షణ:** ఒక వయస్సు దాటాక వ్యక్తిత్వం ఎదగడంతో, ఆ పాత్ర చిన్నదైపోతుంది. వ్యక్తిగత స్వేచ్ఛ అనే ఆకాంక్ష కుటుంబ పరిధిని దాటి సమాజానికి విస్తరించాలని చూస్తుంది.

**తరాల తిరుగుబాటు:** కుటుంబంలో పెద్దల పెత్తనం, పితృస్వామ్య అణచివేత మరియు నియంతృత్వం ఎక్కువైనప్పుడు వ్యక్తిగత ఆకాంక్షలు దెబ్బతిని సభ్యులు వేరుపడిపోతారు. ప్రతి తర్వాతి తరంలో కుటుంబ బంధాన్ని విచ్ఛిన్నం కావడం అనేది సామాజిక వైఫల్యం కాదు; అది వ్యవస్థీకృత అణచివేతకు ప్రకృతి పరంగా జరిగే ఒక సహజ తిరుగుబాటు.

ఆచరణలో ఏ మానవ సమూహమూ ఎలాంటి ఘర్షణ లేకుండా ఒకే ఉమ్మడి కుటుంబంగా శాశ్వతంగా నిలబడలేకపోయింది.

**4. మూల కేంద్రం: బంధాల వెనుక ఉన్న సామాజిక-రాజకీయ, ఆర్థిక నిజాలు**

సాహిత్య విశ్లేషణ: 'జీవన యానం' నవల యొక్క తాత్విక పునాది భావోద్వేగాలు, రాజకీయాలకు ఉన్న సంబంధాన్ని పరిశీలిస్తే... ప్రేమ, పెళ్లి, కుటుంబ వ్యవస్థ, సామాజిక సంబంధాలు మరియు సాంస్కృతిక సంప్రదాయాలన్నీ నిజానికి ఒక రాజకీయ యుద్ధభూమి అని అర్థమవుతుంది. ప్రతి వ్యక్తిగత విషయమూ సామాజిక-రాజకీయమైనదే. సామాజిక ఉద్యమాలు, రాజకీయ పార్టీలు, అధికార భావజాలాలు, సాంస్కృతిక పవర్ సెంటర్లు అన్నీ సామాజిక పెట్టుబడి (Social Capital) సంచయాలే. ఇవన్నీ సామాజిక ఆర్థికశాస్త్రానికి (Social Economics) సంబంధించిన వివిధ రూపాలు.

**ఈ సామాజిక-ఆర్థిక విశ్లేషణ ద్వారా తేలే నిజాలు:**

**పెట్టుబడి లేని ప్రేమ దోపిడీ:** ప్రేమ, పెళ్లి, కుటుంబం వంటి బంధాల రూపాల్లో పైకి పెట్టుబడి పెట్టకుండా, కేవలం పితృస్వామిక సామాజిక విలువల ముసుగులో అవతలివారి శ్రమను, భక్తిని అదుపు చేస్తూ పురుషాధిక్యతను చలాయించడం సాధ్యపడుతున్నది.

**ప్రేమ విలువ హరించబడటం:** నేడు సమాజంలో 'ప్రేమ' అని చలామణి అవుతున్న దాంట్లో పూర్వల పెట్టుబడిదారీ దోపిడీ వర్గాల, పురుషాధిపత్య వ్యాపార దృక్పథమే దాగి ఉంది.

**పెళ్లిళ్ల వ్యాపారీకరణ:** నేడు పెళ్లిళ్లు రెండు హృదయాల మధ్య కాకుండా.. రెండు హోదాల మధ్య, రెండు ఉద్యోగాల మధ్య, రెండు వ్యాపారాల మధ్య జరిగే ఒప్పందాలుగా మారిపోయాయి. తల్లిదండ్రులు సంబంధాలు చూసేటప్పుడు కూడా ఈ ఆర్థిక కొలమానాలనే చూస్తున్నారు. పెద్ద హోదా కోసం కట్నాలు ఇవ్వడం, ఉద్యోగ-ర్యాంకును బట్టి మార్కెట్ విలువలా కట్నాలు లాగడం జరుగుతోంది. దీని ఫలితంగా, మనిషి ఇష్టాయిష్టాలను మనసులు స్వయంగా నిర్ణయించుకోవడం లేదు; వ్యవస్థలు, అధికార హోదాలు, స్థలకాలాలు, భావాలు మరియు అర్హతలే వాటిని నిర్దేశిస్తున్నాయి.

**5. ఆధునిక బంధాలు - ప్రత్యామ్నాయ ప్రయోగాలు**

ఈ సామాజిక సంక్షోభాలకు పరిష్కారం చట్రాల పరిణామ క్రమంలోనే ఉంది. సాంప్రదాయ పెళ్లి, కుటుంబ వ్యవస్థలలో అంతర్గతంగా ఉన్న ఆధిపత్య స్వభావం, యాజమాన్య కాంక్ష, అణచివేత పూర్తిగా తొలగిపోయినప్పుడే నిజమైన మానవ విముక్తి సాధ్యమవుతుంది. ఆధునిక ప్రపంచ సమాజంలో, సాంప్రదాయేతర బంధాలైన పరస్పర అంగీకారంతో కూడిన 'లివ్-ఇన్ రిలేషన్‌షిప్స్' (Live-in Relationships), చట్రాలు లేని స్వేచ్ఛా ప్రణయాలు విస్తరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేమవాదులు, ప్రగతిశీల శ్రేయోభిలాషులు ఈ సరికొత్త సామాజిక ప్రయోగాలను ముందుకు తెస్తున్నారు. ఈ ఆధునిక ప్రయోగాలు రెండు విధాలుగా సాగుతున్నాయి:

**అంతర్గత ప్రజాస్వామీకరణ:** సాంప్రదాయ బంధాల నుండి పురుషాధిక్యతను, పెత్తనాలు, అసమానతలను తొలగించడం.

**బాహ్య విముక్తి:** పాత నిర్బంధ చట్రాలతో నిమిత్తం లేకుండా ప్రేమను, సామాజిక అనుబంధాలను మరింత ఉన్నతమైన, షరతులు లేని మానవీయ తలంపై కొనసాగించడం.

**6. పరిమితులకు అతీతంగా ప్రేమ మరియు ధ్యాన స్థితి**

పాత సామాజిక చట్రాలను దాటి ఎదగగలిగే ఏకైక పరిణామ శక్తి ప్రేమకు మాత్రమే ఉంది. సంకుచిత కట్టుబాట్లను, కుల మతాల శృంఖలాలను తెంచివేసే ధైర్యాన్ని ఇచ్చేది ప్రేమే. ద్వేషం, కుల పాత భావాలను ధ్వంసం చేయవచ్చు, కానీ అందులోని ప్రతికూల దృష్టి ఏది చెడో చెప్పగలదు తప్ప ఏది మంచో నిర్మించలేదు. ప్రేమ ఆచరణాత్మకంగా మానవత్వాన్ని కుల, మత, దేశ సరిహద్దులు లేని స్వేచ్ఛాయుతమైన సమాజం వికసిస్తుంది. అప్పుడే సమస్త కృత్రిమ సరిహద్దులను దాటిన విశ్వమానవీయత రూపుదిద్దుకుంటుంది.

**ఈ విముక్తి మానసిక ధ్యాన స్థితులతో ముడిపడి ఉంది:**

**సృజనాత్మక లయ:** సృజనాత్మక ప్రక్రియలో మనస్సును ఒకే అంశంపై కేంద్రీకరించి ఏకాగ్రంగా ఇస్తాయి. ఆటపాటల్లో మునిగిపోయే పిల్లలు, ఆ నిష్కల్మషత్వాన్ని కాపాడుకునే పెద్దలు నిరంతరం ధ్యాన స్థితిలోనే ఉంటారు. మనస్సులో శ్వాస సమస్థితికి చేరినప్పుడు ఆలోచనల అలజడి లేని ప్రశాంతత ఏర్పడుతుంది.


**ఆలోచనల వర్గీకరణ:** మన ఆలోచనలు రెండు రకాలు. ఒకటి 'ఫంక్షనల్ థింకింగ్' (కూడు, గుడ్డ, నీడ లాంటి భౌతిక అవసరాల ఆలోచన), రెండు 'సైకలాజికల్ థింకింగ్' (భావోద్వేగాలు, అహము, పక్షపాత విశ్లేషణ).

**శూన్య స్థితి:** ఈ సైకలాజికల్ ఆలోచనల కోలాహలం పూర్తిగా ఆగిపోయి, మనస్సు కేవలం ఒక ప్రశాంత సాక్షిగా మిగిలే శూన్యస్థితే నిజమైన ధ్యానం. రెండు ఆలోచనల మధ్య ఏర్పడే నిశ్శబ్ద స్థలం (Space) నిర్మల హృదయానికి దారితీస్తుంది.

ధ్యానం అంటే తన పాత పట్టింపుల నుండి, సిద్ధాంతాల నుండి విముక్తుడు కావడం (De-idealize). 'నేను', 'నాది' అనే అహాన్ని, అహంకారాన్ని జయించలేని వారికి నిజమైన ప్రేమ, ధ్యానం, కరుణ సాధ్యం కాదు. ఈ భేషజాలకు నిజమైన ప్రేమ ఆమడ దూరంలో ఉంటుంది; అహాన్ని వదులుకున్న వారికే అది లభిస్తుంది.

**7. పరిణామ క్రమ పరిపక్వత**

శృంగారం వ్యక్తిగత ఆనందానికి పరిమితమైతే, కరుణ ఇతరుల బాధ పట్ల స్పందించేలా చేస్తుంది. ప్రేమ, కరుణ రెండూ సామాజికమైనవి. వ్యక్తిగత ప్రేమ ఆకర్షణతో ప్రారంభమైనప్పటికీ, సమాజం మరియు కుటుంబం పట్ల ఉండే ప్రేమ కరుణతో, నిస్వార్థమైన స్నేహంతో కూడి ఉంటుంది. ప్రేమ అనేది కేవలం ఒక తాత్కాలిక సెంటిమెంట్ కాదు; అది ఒక ఉన్నతమైన సామాజిక బాధ్యత, జీవితాంతం సాగే కర్తవ్యం. అది సాటి మనిషి పట్ల, సామాజిక ఆకర్షణతో మొదలైనప్పటికీ... పరస్పర గౌరవం, లోతైన అవగాహన మరియు మానవ స్వేచ్ఛ పట్ల ఉన్న అచంచలమైన నిబద్ధతతో ముందుకు సాగినప్పుడే అది తన నిజమైన పరిణామ రూపాన్ని (True Evolutionary Form) సంతరించుకుంటుంది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# సిద్దాపూర్ డంపింగ్ యార్డును వెంటనే రద్దు చేయాలి

- ప్రజలు జీవించే హక్కును కాపాడాలి
- పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ రావు



**షాద్‌నగర్, జూలై 16 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డును వెంటనే రద్దు చేయాలని ప్రజలు జీవించే హక్కును కాపాడాలని డిమాండ్ చేస్తు సిద్దాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డు స్థలంలో గ్రామస్తులతో పాటు గిరిజనులతో తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నేతలు సమావేశమయ్యారు సిద్దాపూర్ పరిసర గ్రామాలను తండాలను సందర్శించి నిజ నిర్ధారణ జరిపారు గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఐటి పరిశ్రమల కోసం రైతుల నుండి దాదాపు 300 ఎకరాల భూమిని సేకరించడం జరిగిందని కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములలో ఐటీ పార్క్ మరియు ఇతర ఉపాధి పరిశ్రమలు కాకుండా ప్రజల జీవితాలను హరించే డంపింగ్ యార్డును ఏకో టౌన్షిప్ పేరుతో ఏర్పాటు చేయాలని జీవో 641 విడుదల చేయడం జరిగిందని ఈ డంపింగ్ ఏర్పాటు చేయడం వల్లనా దాదాపు 7 మండలాలలోని 50 గ్రామాలకు చెందిన ఆరు లక్షల మంది ప్రజలు ప్రత్యక్ష మరియు పరోక్ష ప్రభావానికి గురవుతున్నారని అంతేకాకుండా సిద్దాపూర్ గ్రామంలో ఉండే చెరువులు కలుషితమవుతూ ప్రజలకు వన్య ప్రాణులకు మరియు ప్రకృతి వనరులు మొత్తం కలుషితమయ్యే అవకాశం ఉందని ఈ ప్రాంతం నుండి వ్యవసాయం చేసి హైదరాబాద్ కు కూరగాయలు పాలు ఎగుమతి చేయడం జరుగుతుందని ఈ డంపింగ్ యార్డ్ వల్ల ఆహార పదార్థాలు కూడా పూర్తిగా విషపూరితమయ్యే అవకాశం ఉందని ఇప్పటికే కొత్తూరు ఇండస్ట్రియల్‌గా ప్రకటించినందున ఎన్నో కాలుష్యకారక పరిశ్రమలు ఏర్పాటుతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని భూగర్భ జలాలు ఇప్పటికే కలుషితమయ్యాయని డంపింగ్ యార్డ్ వల్ల గాలి కాలుష్యంతో పాటు భూగర్భ జలాలు విషపూరితమైయై ఆందోళనలో ప్రజలు ఉన్నారని అత్యంత ప్రమాదమైన క్యాన్సర్ లాంటి వ్యాధులు మరింత విస్తరించే అవకాశం ఉందని కాబట్టి వెంటనే జీవో 641 ను రద్దు చేసి డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ రావు సహాయ కార్యదర్శి తిరుమలయ్య సుభాన్ బాలయ్య రాములు వెంకటేష్ బాలయ్య బస్వరాజ్ ఎల్ ఎచ్ పి రాష్ట్ర అధ్యక్షులు రాంబాలాల్ నాయక్ మిట్టు నాయక్. తదితరులు పాల్గొన్నారు.

## హిమాయత్ నగర్‌లో 60 గజాల స్థలం కోసం బీజేపీ ధర్నా



**మొయినాబాద్, జూలై 16 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ హిమాయత్ నగర్ గ్రామ ప్రజలు 60 గజాల స్థలం కోసం చేస్తున్న పోరాటానికి మద్దతుగా గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. హిమాయత్ నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 151లో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు కంజర్ల ప్రకాష్, శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు షాబాద్ కిషన్, బేగంబీ, మమత, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, రవియాదవ్, మాధవరెడ్డి, బతుకు ప్రభాకర్ యాదవ్, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ బూత్ అధ్యక్షులు మరియు కార్యకర్తలు, హిమాయత్ నగర్ గ్రామ యువజన సంఘాల అధ్యక్షులు, గ్రామస్తులు, బాధితులు, తదితరులు ఎత్తున పాల్గొన్నారు. పేదలకు వెంటనే 60 గజాల స్థలాలు కేటాయించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## యువ సంగ్రామ సదస్సు విజయవంతం చేయాలి



**చేవెళ్ల, జూలై 16 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి నిరుద్యోగ యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగేదంర్ గౌడ్, క్యామ మల్లేష్, చేవెళ్ల నియోజకవర్గం మాజీ ఇన్చార్జ్ దేశమోళ్ల ఆంజనేయులు తెలిపారు. గురువారం చేవెళ్ల పట్టణకేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు యువ సంగ్రామం సదస్సు పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఓట్ల కోసం లబ్దిపొందేందుకు నిరుద్యోగ యువతకు ఏడాది రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని సరూర్ నగర్ లో ప్రియాంక గాంధీతో కలిసి నిరుద్యోగ డిక్లరేషన్ చేసి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు 5 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటన సరూర్ నగర్ లో చేసిన నిరుద్యోగ డిక్లరేషన్ ప్రకటన చేసిన చోటనే ఈనెల 18వ తేదిన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో భారీ యువ సంగ్రామ సదస్సు ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఈ సదస్సుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి నిరుద్యోగులు, యువకులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిపులునిచ్చారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ఇచ్చి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంట్లను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్, వెంకట్ రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షులు హన్మంత్ రెడ్డి, రామగౌడ్, కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, దూత మల్లేష్, సువర్ణచందు, సీనియర్ నాయకులు వెంకటేశ్, గోనే కరుణాకర్ రెడ్డి, నిఖిల్ రావ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

## హకీంపేట ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులను వెంటనే నియమించాలి

- అధ్యాపకులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు
- వారం రోజుల్లో అధ్యాపకులను నియమించకపోతే ఆందోళన
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా
- ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్



**దుద్యాల, జూలై 16 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని హకింపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సి.అనిల్ అన్నారు. గురువారం హకింపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అధ్యాపకులను నియమించాలని విద్యార్థులు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన జూనియర్ కళాశాలను మంజూరు చేసి కళాశాలను ప్రారంభించారన్నారు. కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎం ఎల్ టి, ఎం పి హెచ్ డబ్ల్యు గ్రూప్‌లలో 150 మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలిపారు. అధ్యాపకులు లేకపోవడంతో చదువు ముందుకు సాగక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల చదువు ముందుకు కొనసాగాలంటే అధ్యాపకులను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నియోజకవర్గంలో విద్యార్థులు అధ్యాపకుల కొరత ఉందని రోడ్డు ఎక్కడం విచారకరమన్నారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోడంగల్ ను ఎడ్యుకేషన్ హబ్ చేస్తామని చెప్పి ఈ ప్రాంతంలో ప్రతి ఒక్కరికి అన్ని విద్యాసంస్థలు ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాల నుండి విద్యార్థులు కొడంగల్ కు వచ్చి చదువుకునే విధంగా చేస్తామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు లేకపోవడం చూస్తుంటే ఏ స్థాయిలో విద్యార్థులపై ప్రభుత్వానికి ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి చంద్రయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ ఎత్తిపోతల కేవలం కమిషన్ల కోసమే..



**మక్తల్, జూలై 16 (జనంసాక్షి) :** కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు మసిపూసి మారేడు కాయ చేస్తున్నారని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారులు సైతం ముఖ్యమంత్రిని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. మక్తల్ మండలం చిన్న గోపులపూర్ గ్రామం వద్ద ఉన్న భీమా ఫేజ్-1 లోని స్టేజ్-1 పంప్ హౌస్‌ను గురువారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రతిపాదించిన డిజైన్ ప్రకారం కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడం ఎంతమాత్రం సరికాదని అన్నారు. కేవలం కమిషన్ల కోసమే ఈ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చిత్తశుద్ధితో పనిచేస్తూ రైతుల పట్ల న్యాయంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో అన్నదాతల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలి

- ఈఆర్వో, ఆర్డీవో ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం
- గణన ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి
- తాండూరు ఆర్డీవో అనిత



**తాండూరు, జూలై 16 (జనంసాక్షి) :** తాండూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల సన్నాహాల్లో భాగంగా గురువారం ఈఆర్వో మరియు ఆర్డీవో మేడమ్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాండూరు ఏసీ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, తాండూరు మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో అనిత మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రక్రియలో భాగంగా గణన ఫారాల సేకరణ మరియు డిజిటలైజేషన్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎఎస్ డి జాబితాను సిద్ధం చేయడంతో పాటు పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు, సలహాలు కూడా అధికారులకు తెలియజేశారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సిబ్బంది సమయపాలన పాటించాలి
- జిల్లా కలెక్టర్ కె హేమావతి



**నంగునూర్, జూలై 16 (జనం సాక్షి) :** సీజనల్ వ్యాధులకు సంబంధించి మెడిసిన్, పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రజలు వీటి బారిన పడకుండా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి డాక్టర్లను ఆదేశించారు. గురువారం నంగునూరు మండలం రాజగోపాల్ పేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. మండలంలో సీజనల్ వ్యాధులకు ప్రబలకుండా మెడిసిన్స్, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, పిఎచ్ సి పరిధిలోని యుపిహెచ్ సి లో ఏఎన్ఎం, సూపర్వైజర్ ల ద్వారా ప్రజల్లో సీజనల్ వ్యాధులకు సంబంధించి అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ను ఆదేశించారు .ఓపి ఎంత, ఆసుపత్రి సిబ్బంది అందరూ వచ్చారా ఆరా తీస్తూ అటెండెన్స్ లీవ్ లీటర్లు, ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. రోజు 50నుండి 60 ఓపీ ఉంటుందని అందరూ వచ్చారని ఏంఓ కలెక్టర్‌కి తెలిపారు. మెడికల్ ఆఫీసర్ నుండి సిబ్బంది సమయపాలన పాటించాలని రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. పిహెచ్‌సి వచ్చిన రోగులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలని సూచించారు. వైద్యులు అందించిన మందులు, మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

# జగన్నాథ రథయాత్రను ప్రారంభించిన జగ్గారెడ్డి

- సంగారెడ్డి పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో వైభవంగా జగన్నాథ రథయాత్ర
- భజనలు, కోలాటాలతో భక్తిపారవశ్యంలో మునిగిన సంగారెడ్డి పురవీధులు



**సంగారెడ్డి, జూలై 16 (జనం సాక్షి) :** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పూజలు నిర్వహించి రథయాత్రను ఘనంగా ప్రారంభించారు. ఈ రథయాత్ర సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుండి ప్రారంభమై, పట్టణ పురవీధుల గుండా పిఎస్సార్ గార్డెన్ వరకు సాగింది. రథం కదిలిన వెంబడి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'జగన్నాథ్ కీ జై' అంటూ హరినామ స్మరణ చేశారు. యాత్ర పొడవునా భక్తులు చేసిన భజనలు, ఆధ్యాత్మిక నాట్యాలు, సంకీర్తనలతో పట్టణ వీధులన్నీ భక్తిపారవశ్యంతో మారుమోగాయి. ముఖ్యంగా మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తులలో ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, వీక్షకులను అలరించాయి. భక్తులకు ఎక్కడికక్కడ ఇస్కాన్ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సంగారెడ్డి పట్టణంలో జగన్నాథ రథయాత్రను నిరంతరాయంగా నిర్వహిస్తూ, ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్న ఇస్కాన్ స్థానిక శాఖ ప్రతినిధులను జగ్గారెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన స్వయంగా భక్తి పాటలు పాడుతూ భక్తులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, ప్రముఖ నాయకులు కూన సంతోష్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, ఇస్కాన్ ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిన పాలకులు



**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 16 (జనం సాక్షి) :** గిరిజనులను పాలకులు కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటూ, వారి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి విమర్శించారు. గురువారం రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్--2లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ గిరిజన సమాఖ్య అబ్దుల్లాపూర్ మెట్ మండల మహాసభ సిపిఐ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్రంలోని షెడ్యూల్డ్ తెగల హక్కుల సాధన, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజా సంఘమని తెలిపారు. తెలంగాణ గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రమావత్ సక్రు నాయక్ మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రకటించిన నిధులను వెంటనే విడుదల చేయాలని, యువతకు ప్రత్యేక ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రమావత్ సక్రు నాయక్, నాయకులు లోక్య నాయక్, లావుడియా శంకర్, వినోద్, వెంకటేష్, దేవా, వర్త్య శంకర్, క్రాంతి, శ్రీదేవి, వంశీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో దోషులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి

- ఎంపీ మల్లు రవి



**వనపర్తి బ్యూరో, జూలై 16 (జనంసాక్షి) :** ఎస్సీ, ఎస్టీలపై జరిగే అత్యాచారాలు, దౌర్జన్యాల కేసుల్లో వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, సత్వరమే దర్యాప్తు పూర్తి చేసి పటిష్ట ఆధారాలతో చార్జిషీట్లు దాఖలు చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి అధికారులను ఆదేశించారు. గత ఆరు సంవత్సరాలుగా ఒక్క ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కూడా నేరారోపణలు నమోదు కాకపోవడం ఆందోళనకరమని ఆయన అన్నారు. గురువారం వనపర్తి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో 2018 నుంచి నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి, విచారణ స్థితి, బాధితులకు అందించిన పరిహారం తదితర అంశాలపై కేసుల వారీగా సమీక్షించారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ 2020 నుంచి 2026 వరకు నమోదైన కేసుల్లో ఒక్కదానికీ నేరారోపణలు నమోదు కాకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. అట్రాసిటీ కేసుల్లో ఆలస్యం లేకుండా విచారణ పూర్తి చేసి దోషులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ సమస్యలు, ఎస్సీ, ఎస్టీల భూముల ఆక్రమణలకు సంబంధించిన కేసులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి నెల పౌర హక్కుల దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించి ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు తాను అందించిన సహకారం వల్ల ఈ ఏడాది విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగిందన్నారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు వసతి గృహాలు మంజూరు చేయాలని ఎంపీని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో దోషులకు శిక్షలు పడేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. బాధితులకు అందించాల్సిన సుమారు రూ.75 లక్షల పరిహారం నిధుల లభ్యత లేక పెండింగ్‌లో ఉందని, వాటి మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈవో యాదయ్య, జిల్లా ఎస్పీ డి. సునీతారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజాక్షేత్రంలో బహిరంగ చర్చకు రావాలి

- బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ సవాల్



బెజ్జంకి, జూలై 16 (జనం సాక్షి) : మండలంలో కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొంకటి రాములు మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీకి అనుమతులు ఇచ్చి ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు.ప్రజాక్షేత్రంలో బహిరంగ చర్చకు వస్తాను అనీ మాటలు చెప్పడం కాదు రావాలి అనీ అన్నారు.అనంతరం మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీకి అనుమతులు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని,ఇప్పుడు అదే అంశంపై రాజకీయాలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.బీఆర్ఎస్ నాయకులు అధికారంలోకి రాకముందు ఉన్న ఆస్తులు ఎంత,ప్రస్తుతం ఉన్న ఆస్తులు ఎంత అనే విషయంపై ప్రజాక్షేత్రంలో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు.అక్రమ కబ్జాలకు పాల్పడిన నాయకులకు ప్రజా సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు లేదు అని అన్నారు.దాచారం గ్రామంలో 14 ఎకరాల వ్యవహారంలో అక్రమంగా డబ్బులు తీసుకున్న విషయం తమ వద్ద ఆధారాలతో ఉందని ఆరోపించారు.అలాగే బెజ్జంకి గ్రామంలోని అక్రమ పట్టాల వ్యవహారాన్ని కూడా త్వరలో ప్రజల ముందుకు తీసుకొస్తామని పేర్కొన్నారు.ఇథనాల్ కంపెనీ మూసివేత కోసం కాంగ్రెస్ పార్టీ,ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులతో నిరంతరం చర్చలు జరుపుతున్నారు అనీ అన్నారు.ఇకపై ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య,ముత్తన్నపేట ఉప సర్పంచ్ మచ్చ కుమార్,బెజ్జంకి వార్డు మెంబర్లు ఎలిగే సతీష్,బొనగాం రమేష్,బెజ్జంకి మాజీ ఉపసర్పంచ్ బండి వేణు యాదవ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రవుల సందీప్,చీలాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు అమర్రాజు నవీన్,పుర్మ నారాయణరెడ్డి,జంగిలి తిరుపతి,జంగిలి సంపత్,కార్యకర్తలు పాల్గొన్నారు.

### గ్రామీణాభివృద్ధి పనులు

# వేగవంతంగా పూర్తి చేయాలి

- వివో భవన నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూజ చేయాలి
- సురక్షిత తాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి
- గ్రామీణాభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర కీలకం
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి బ్యూరో, జూలై 16 (జనం సాక్షి) : జిల్లాలో చేపడుతున్న గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని, ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎల్పీవోలు, డీపీఎంలు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఏపీఎంలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు తదితరులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివో భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల మరుగుదొడ్లు, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌లు (సీఎస్‌సీలు), వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పాఠశాల కాంపౌండ్ వాల్స్, కల్వర్టులు, డ్రైనేజీ పనులు, ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్ భవనాలు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై మండలాల వారీగా సమగ్రంగా సమీక్షించారు. ఈ



సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వివో భవనాల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో వినియోగానికి అనుకూలంగా తీర్చిదిద్దాలని, అవసరమైన పాఠశాలలకు కొత్త మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన అంచనా ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. అలాగే కాంపౌండ్ వాల్ అవసరమైన పాఠశాలలకు అంచనా ప్రణాళికలు రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. గ్రామీణాభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న కలెక్టర్, మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. డివిజన్ స్థాయిలో డివిజనల్ పంచాయతీ అధికారులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రతి పనిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, డీఆర్‌డీఓ జ్యోతి, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, ఇన్‌చార్జి సీపీఓ జగదీష్, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంత్రుల హడావిడి తప్ప అభివృద్ధికి నిధులు శూన్యం

గద్వాల నడిగడ్డ, జూలై 16 (జనం సాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లాలో మంత్రులు వచ్చిపోతున్నారే తప్పా అభివృద్ధికి మాత్రం నిధులు విడుదల చేయడం లేదని బాసు హనుమంతు నాయుడు ఆరోపించారు. గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంత్రుల పర్యటనపై పార్టీ నాయకులతో కలిసి,బాసు హనుమంతు నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి మంత్రులు వచ్చినప్పుడు బిఆర్ఎస్ పార్టీ నుండి అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ లోకి వెళ్లిన స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హడావుడి తప్ప నియోజకవర్గానికి ఎలాంటి నిధులు తేలేదని, కాంగ్రెసులో వర్గాల హడావుడి,ఆధిపత్యాల పోరు తప్పా గద్వాలకు ఒరిగిందేమీ లేదని బాసు హనుమంతు నాయుడు ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కనీసం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మంత్రులు నియోజకవర్గంలో పర్యటించడం సిగ్గుచేటు అని అన్నారు.గద్వాల నియోజకవర్గ ప్రజలను రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనూ తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు.ట్రాన్స్ఫర్ల ఓపెనింగ్ కి వచ్చిన ఉపముఖ్యమంత్రి కనీసం మా నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులపై ఎందుకు మాట్లాడలేదని అని



ప్రశ్నించారు. ట్రాన్స్ఫార్మర్లు సబ్ స్టేషన్ ఓపెనింగ్ వచ్చిన ఉపముఖ్యమంత్రి గాలి మోటర్లు లో పోవడానికి టైం అయితుందని, చెప్పి,కనీసం నియోజకవర్గ అభివృద్ధి నిధులపై, ప్రజల సమస్యల గురించి మాట్లాడకుండా వెళ్లిపోవడం పై నియోజకవర్గ ప్రజలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పనులే కానీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కనీసం పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయకుండా, కాలయాపన చేస్తున్నారని అన్నారు.ప్రస్తుతం మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క ట్రాన్స్ఫార్మర్ మంజూరు కావడానికి నెలలు పడుతున్నాయని రైతులు పంటలు ఎండిపోతున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక్క కిలోమీటర్ దూరంలో ఉన్న ర్యాలంపాడు రిజర్వాయర్ లో 4 టీఎంసీల సామర్థ్య ఉన్న ప్రాజెక్ట్ లీకేజీ ప్రాబ్లం ఉన్నది అని 2 టీఎంసీల కు కుదించిన విషయం తెలిసికూడా సందర్శించకపోవడం పై మండిపడ్డారు.మొన్న ధరూర్ మండల కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సభలో మీ మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పై సభకు వచ్చిన మహిళలు తిరుగుబాటే మీ ప్రభుత్వ పాలన యొక్క నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ మాజీ చైర్మన్ బి . ఎస్.కేశవ్,జి.రాఘవేంద్ర రెడ్డి, కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్, చంటన్న, గువ్వల గోపాల్, మోహన్ యాదవ్, చిత్తరి కిరణ్, కమ్మరి రాము,చక్రీధర్ రెడ్డి, బీచుపల్లి,వెంకటేష్ యాదవ్, తిమ్మప్ప గౌడ్,శ్రీరాములు, పూడూరు రఘు నాయుడు, గంజిపేట అరవింద్, మాలిక్, రాము,లోకేష్,భాస్కర్, జగదీష్, నరసింహులు, గోవిందు, వీరేష్, రాజు, మహేష్, కృష్ణ, మహేందర్, నరేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి

- అదనపు కలెక్టర్ ఆర్. పాండు



కంది, జూలై 16 (జనం సాక్షి) : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ ఆర్. పాండు సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కంది మండలంలో ఆకస్మికంగా పర్యటించి ఆయా గ్రామాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ), ఇందిరమ్మ ఇండ్లు కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కంది ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ, ఏఈ (పంచాయతీ రాజ్), మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ), ఏపీఎం (సెర్ప్)లతో సమావేశమై అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కంది గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను పరిశీలించారు. పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, ప్రజా సౌకర్యాల నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కంది గ్రామ సర్పంచ్‌తో సమావేశమైన అదనపు కలెక్టర్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నాలుగు మహిళా సంఘాల (వీఓ) భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో అదనపు డీఆర్‌డీఓ బాల్‌రాజ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పంచాయతీ రాజ్) దీపక్, తహసీల్దార్ హసీనా బేగం, ఎంపీడీఓ పి. శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్ రెడ్డి, ఏపీఎం శివలక్ష్మి, ఏఈ (పంచాయతీ రాజ్) శ్రీనాథ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవితతో, అధికారులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం కావాలి



ఉప్పునుంతల, జూలై 16 (జనం సాక్షి) : ఉప్పునుంతల మండలంలోని రాయిచేడ్ గ్రామంలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సహాయం, నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, నిధుల వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులోగా లబ్ధిదారులకు అందజేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకొని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని స్పష్టం చేసిన కలెక్టర్, పునాది నుంచి పైకప్పు వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. నిర్మాణానికి ఉపయోగించే సామగ్రి నాణ్యంగా ఉండేలా చూసి, పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు అధికారులు తరచూ గ్రామాలను సందర్శిస్తూ పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, గ్రామ సర్పంచ్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతం చేస్తాం

సంగారెడ్డి, జూలై 16 (జనం సాక్షి) : తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతం చేస్తామని, ఉచిత విద్యా వైద్యమే లక్ష్యంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలంగాణ రక్షణ సేన పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి కలబుగూర్ దయాకర్ రెడ్డి, అన్నారు తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకరాలు కల్వకుంట్ల కవిత సంగారెడ్డి నియోజకవర్గం తెలంగాణ రక్షణ సేన పార్టీ ఇన్చార్జిగా నియమించిన సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ప్రజల్లోకి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకొని ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తానని అన్నారు 'తెలంగాణ రక్షణ సేన పార్టీ 'పాంచజన్య' సిద్ధాంతంతో ప్రజల్లోకి దూసుకెళ్తోందని స్పష్టం చేశారు. సమాజంలో ప్రతి రంగంలోనూ సామాజిక న్యాయం జరగాలని, అందరికీ సమానత్వం అందించడమే పార్టీ ముఖ్య ఉద్దేశమని అన్నారు.ఉచిత విద్య, ఉచిత వైద్యం పేద, మధ్యతరగతి వర్గాలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే ముఖ్య అంశాలుగా ఈ పార్టీ ఏర్పాటైందని ఆయన



వివరించారు.. రైతులకు అండగా.. నిరుద్యోగులకు స్వయం ఉపాధి ప్రస్తుత ప్రభుత్వాల వైఫల్యాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ల పేరిట హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక యువతకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, రైతులకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు శంకర్ నాయక్, గోపాల్ రెడ్డి, మనోజ్ రెడ్డి, నితిన్, ధనుష్, గోపాల్.యాదవ్, ప్రదీప్ రజినీకాంత్,అనూప్ రెడ్డి, వేణు, శివ ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

## బాలల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ బ్యూరో, జూలై 16 (జనం సాక్షి) : జిల్లాలో బాలల పరిరక్షణను మరింత పటిష్టంగా అమలు చేయడంతో పాటు బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సామాజిక రుగ్మతలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి కమిటీలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా బాలల పరిరక్షణ కమిటీ (డీసీపీసీ) సమావేశం అదనపు కలెక్టర్ నగేష్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా పరిషత్, పోలీసు, విద్య, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, కార్మిక శాఖ, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ (డీసీపీయూ), బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, పాఠశాల మానేసిన పిల్లల గుర్తింపు, అనాథలు, అర్ధానాథలకు ప్రభుత్వ పథకాల అమలు, స్పాన్సర్‌షిప్, ఫోస్టర్ కేర్ సేవల పురోగతి, పోక్సో కేసుల సమీక్ష, పీసీపీఎన్‌డీటీ చట్టం అమలు, పిల్లల హక్కులపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యాశాఖ ప్రతి నెల డ్రాప్‌అవుట్ విద్యార్థుల జాబితాను సమర్పించాలని, పాఠశాలలు, ఇంటర్మీడియట్ స్థాయిలో చదువు మానేసిన



విద్యార్థులకు కౌన్సెలింగ్ అందించేందుకు సైకాలజిస్టులు, సైకియాట్రిస్టుల సేవలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులను నియమించాలని, పోక్సో బాధితులు, బాల్య వివాహాలకు గురైన పిల్లలు తిరిగి విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు శాఖ బాల్య వివాహాల హాట్‌స్పాట్ గ్రామాలను గుర్తించి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్ శాఖలు గ్రామ, మండల బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేసి క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ పీసీపీఎన్‌డీటీ చట్టం అమలును కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని, ఆసుపత్రుల్లో అక్రమ దత్తతలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌లలోని పిల్లలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు సైకియాట్రిక్, ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ తదితర వైద్య సేవలు అందించాలని సూచించారు. జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. మండల కేంద్రాల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి బాల్య వివాహాల నిరోధంపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనాథలు, అర్ధానాథలు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అర్హత కార్డులు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలకు సహకరించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో పిల్లల పరిరక్షణకు సంబంధించి అన్ని శాఖలు సమిష్టిగా పనిచేసి, తదుపరి సమావేశానికి తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, జిల్లా విద్యాధికారి రాజు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సురేష్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. జ్ఞానేశ్వర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి, డీఎస్పీ ప్రసన్నకుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- పాఠశాలను తనిఖీ చేసిన మండల విద్యాధికారి



ఉర్కొండ, జూలై 16 (జనం సాక్షి) : ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల విద్యాధికారి అబ్దుల్ రహీం అన్నారు. ఉర్కొండ మండలంలోని బాల్యలోక్యా తండాలోని ప్రాథమిక పాఠశాలనుగురువారం రోజు పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా మండల విద్యాధికారి అబ్దుల్ రహీం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులను, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, పాఠ్యాంశాల బోధనను పరిశీలించారు. పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను కూడా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, ప్రతి రోజు 100% హాజరు ఉండేలా చూడాలని సూచించారు. పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు.

# మరణించిన మా అన్న ఉద్యోగం నాకివ్వండి

- అధికారులకు తమ్ముడి మొర



**మహదేవపూర్, జూలై 16 (జనంసాక్షి) :** అన్నారం గ్రామంనికి చెందిన భోగే సమ్మయ్య అన్నారంలో వీఆర్ఏ గా ఉద్యోగం చేసి మరణించినందున ఇతని తమ్ముడైన భోగే పోచయ్య కు ఉద్యోగము ఇవ్వాలని సంబంధిత అధికారులకు మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా వినతి పత్రం అందించారు. భోగి సమ్మయ్య కొన్ని సంవత్సరాలుగా అన్నారం గ్రామంలో భోగి సమ్మయ్య అనేవ్యక్తి వీఆర్ఏ ఉద్యోగిగా పని చేశాడు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏలను ప్రమోషన్ మీద నీటిపారుదల శాఖ కార్యాలయానికి బదిలీ చేసారు. సమ్మయ్య మేనెల 2026 లో మరణించాడు. ఇతని సోదరుడు భోగేపోషయ్య. తండ్రి జక్కయ్య. గ్రామం అన్నారం 'నేను మా అన్న ఇద్దరం ఒకేతల్లికి జన్మించినావారము అన్న పేరుమీద ఉన్న ఉద్యోగం నాకు ఇవ్వాల'ని వినతి పత్రం అందజేశారు. భోగి సమ్మయ్య, పోశయ్య, తోపుట్టిన సోదరిమణి అరిగెల లక్ష్మి కుమారుడు అరిగెల శ్రీనివాస్ మా మామయ్య ఉద్యోగం నాకు ఇవ్వాలని లీగల్ గా నేను వారసుడని వారసత్వం సర్టిఫికెట్ తీసుకోవడం జరిగినది. గత కొన్ని సంవత్సరాల నుండి వీరిద్దరి అన్నదమ్ములు వీఆర్ఏ ఓటబంధిమీద సమ్మయ్య. పోషయ్యకు. ఇవ్వడం జరిగినది కాబట్టి ఇరిగేషన్అధికారులు కానీ రెవెన్యూ అధికారులు పూర్తి సమగ్ర విచారణ చేపట్టి భోగి పోచ్చయ్యకు ఇట్టి ఉద్యోగాన్ని ఇవ్వాలని పోచయ్య, అన్నారం గ్రామ ప్రజలు పై అధికారులను కోరారు.

# ఎస్ఐఆర్ సర్వేను పరిశీలించిన కలెక్టర్



**నర్సంపేట జూలై 16 (జనం సాక్షి) :** ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డా. సత్యశారద గురువారం నర్సంపేట పట్టణంలోని వల్లభ్నగర్, సాయినగర్ కాలనీ 149,156,159 పోలింగ్ కేంద్రాల పరిధిలో పర్యటించి బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓలు) ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి అయిన ఓటర్ల వివరాల నమోదు పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి బీఎల్ఓల పనితీరుపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రతి అర్హుడైన ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారం లో వివరాలను పరిశీలించి చూడాలని, ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి నిర్దేశిత గడువులో లక్ష్యాలను పూర్తి చేయాలని బీఎల్ఓలు, పర్యవేక్షణ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి. తాసిల్దార్ హరిచంద్ర రెడ్డి, 26 కౌన్సిలర్ శ్రీదేవి శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

# హేమాచల క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

- మంత్రి సీతక్క
- 3కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధికి శ్రీకారం..



**మంగపేట జూలై 16(జనంసాక్షి) :** ములుగు జిల్లా మంగపేట మండలంలోని చారిత్రక మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఆమె ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి సీతక్క కీలక సూచనలు చేశారు. ఆలయ పురాతన వైభవం, ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా ప్రత్యేక డిజైన్లతో అభివృద్ధి పనులు చేపట్టాలి అని అన్నారు. ఆలయ రహదారి అభివృద్ధి కోసం ఇప్పటికే రూ. 50 కోట్లు మంజూరయ్యాయని, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆడిటోరియం ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ఒక మొక్కతో ములుగులోకి అడుగుపెట్టండి... ఒక మొక్కతో దేవుణ్ణి దర్శించుకోండి అని మంత్రి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా భక్తులందరూ తప్పనిసరిగా పండ్ల మొక్కలను నాటాలని కోరారు. ముఖ్యంగా ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి వసతిపై ప్రత్యేక దృష్టి సారించాలని, అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా పోలీసులు నిఘా ఉంచాలని ఆదేశించారు. సమ్మక్క-సారలమ్మ వనదేవతల మాదిరిగానే హేమాచల క్షేత్ర మహిమను విస్తృతంగా ప్రచారం చేస్తామని, ముఖ్యమంత్రిని కూడా ఈ క్షేత్ర సందర్శనకు ఆహ్వానిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్, డీఎఫ్వో వికాస్ మీనా తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల అధ్యక్షుడు చెట్టిపల్లి వెంకటేశ్వర్లు, మాజీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసిరెడ్డి వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 16(జనంసాక్షి ):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ త్వరగా పూర్తి అయ్యే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి చేయడంలో రాజకీయ పార్టీలు తమ సహకారం అందించాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 76 శాతం డిజిటలైజ్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, గ్రామీణ ప్రాంతాలలో ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని, పట్టణ ప్రాంతాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ స్థాయి అధికారులకు అందే విధంగా చొరవ తీసుకోవాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని, కానీ ప్రక్రియ ముందే పూర్తి చేసే విధంగా రాజకీయ పార్టీలు కృషి చేయాలని తెలిపారు. ఎ.ఎస్.డి. ఓటర్ల జాబితా, రేషనలైజేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టడం జరుగుతుందని, మ్యాపింగ్ కాని వారిని గుర్తించాలని తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు బూత్ స్థాయి అధికారులకు సహకరించి ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కుక్కలు.. కోతులు.. కరుస్తున్నాయి

- రోజుకు 70 నుంచి 100 మంది ఎంజీఎం హాస్పిటల్ కు బాధితులు
- భయాందోళనలో ప్రజలు
- అందుబాటులో ఏఆర్వి వ్యాక్సిన్లు
- కోతులు కుక్కల బారి నుండి రక్షించాలంటూ మున్సిపల్ అధికారులకు విన్నపాలు



**వరంగల్ బ్యూరో, జూలై 16 (జనం సాక్షి) :** వరంగల్ నగరం తో పాటు జిల్లా మొత్తం ప్రస్తుతం కుక్కలు కోతుల బారిన పడి ప్రజలు భయాందోళనకు గురవుతున్న పరిస్థితి ఏర్పడుతుంది. పొద్దున్నే బడికి వెళ్లే పిల్లలతోపాటు, వృద్ధులు, బాటసారులు, గృహిణులు, వివిధ వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తులు కుక్కలు కోతుల దాడుల్లో తీవ్ర గాయాల పాలు అవుతున్నారు. బయటికి రావాలంటే భయపడుతున్నారు. ఒక్క వరంగల్ నగరంలోని మహాత్మా గాంధీ మెమోరియల్ హాస్పిటల్ కు (ఎంజీఎం) ప్రతిరోజు 70 నుంచి 100 మంది కుక్కలు కోతుల బారిన పడిన బాధితులు వచ్చి వ్యాక్సినేషన్ వేసుకుని వెళ్తున్న పరిస్థితి. ఇక జిల్లాని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా వందలాదిమంది ఆయా ప్రాంతాలకు చెందిన బాధితులు వచ్చి కావలసిన వ్యాక్సిన్ వేసుకుని వెళ్తున్నట్లు సమాచారం. ఒక్కొక్క బాధితులు మూడు నుంచి నాలుగు డోసుల వరకు వ్యాక్సిన్ వేసుకుంటున్నట్టు బాధితులు తెలుపుతున్నారు. ఎంజీఎంలో కుక్కలు కోతులకు వేసే ఏ ఆర్ వి వ్యాక్సిన్ నిరంతరం అందుబాటులో ఉన్నట్లు సంబంధిత సిబ్బంది తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు ఓపి ద్వారా వచ్చే బాధితులకు వాక్సినేషన్ వేస్తున్నట్లు సిబ్బంది తెలుపుతున్నారు.

### ఇటీవల పెరిగిన కుక్కలు, కోతుల దాడులు

గత ఏడాదికి పోల్చుకుని చూస్తే ఏడాది కుక్కలు కోతుల దాడులు మరింత ఎక్కువైనట్లు సమాచారం. ప్రధానంగా వరంగల్ నగరం తో పాటు గ్రామీణ ప్రాంతాలలో విచ్చలవిడిగా రోడ్లపైతిరుగుతున్నటువంటి వీధి కుక్కలతో పాటు, అడవుల్లో నుంచి నగరాలు పల్లెల బాట పట్టిన కోతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. దీంతో అభి మనుషుల మీద దాడులు చేసి గాయపరచడమే కాకుండా, భయభ్రాంతులకు కురిచేస్తున్నాయి. వీటిని కట్టడి చేయడానికి మున్సిపల్ అధికారులు శతవిధాల ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో వివిధ టెండర్ల ద్వారా కుక్కలను కోతులను పట్టే వ్యవస్థ ఏర్పాటు చేసిన కూడా పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరించడంలో విఫలం అవ్వక తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు, కుక్కలు కోతుల బారి నుండి తమను రక్షించాలంటూ విన్నవిస్తున్నారు.

### కుక్కలు కోతులను పట్టుకునే ప్రక్రియ నడుస్తుంది : సిఎంహెచ్ఓ రాజారెడ్డి

వరంగల్ నగరంలో కుక్కలను కోతులను పట్టుకునే ప్రక్రియ నడుస్తుందని వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిఎంహెచ్వో రాజారెడ్డి తెలిపారు. కుక్కలను పట్టుకుని చింతగట్టు క్యాంపు వద్ద ఉన్నటువంటి డాగ్ సెంటర్ కి తీసుకెళ్లి అక్కడ రోజుకు 15 నుండి 20 కుక్కలకు ఆపరేషన్ చేసి మూడు రోజుల తర్వాత వాటికి యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేసి తిరిగి వదిలేస్తున్నట్లు తెలిపారు. ఇక కోతుల విషయానికొస్తే గత ఏడాది కంటే ఈ ఏడాది కోతులను తక్కువ పట్టినట్లు తెలిపారు. పోతులను పట్టేందుకు మరో నెల రోజుల్లో కొత్త టెండర్ వేయనున్నట్లు తెలిపారు. పోతులను పట్టుకున్న తర్వాత వ్యాన్లో ఎక్కించి అటవీ ప్రాంతంలో వదిలేసే సమయంలో అక్కడ ఉన్నవంటి ఫారెస్ట్ ఆఫీసర్ సంతకం తీసుకొని జియో టాక్ ఫోటోలతో సంబంధిత కాంట్రాక్టర్ పెడితేనే వారి బిల్లులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈసారి ర్యాండమైజు చేసి కోతులను పూర్తిగా పట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

# సింగరేణిని ముంచిందే బీఆర్ఎస్..

- మాజీ ఎమ్మెల్యే తన వ్యాపార సామ్రాజ్యాన్ని పెంచుకున్నడు..
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తిరెడ్డి




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రాష్ట్రంలో పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ సింగరేణిని ముంచిందని, భూపాలపల్లి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తన వ్యాపార సామ్రాజ్యాన్ని పెంచుకున్నాడని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా.చందుపట్ల కీర్తిరెడ్డి మండిపడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఎంఎస్ కార్యాలయంలో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు అప్పాని శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సింగరేణి భరోసా యాత్రపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సింగరేణి కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి సంస్థను దాదాపు దివాలా తీసే పరిస్థితికి నెట్టారని ఆరోపించారు. గతంలో కేంద్రం సింగరేణికి కేటాయించిన తాడిచెర్ల-1 బొగ్గు బ్లాక్ను తిరస్కరించేలా కేసీఆర్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందన్నారు. ఆ తర్వాత ఆ బ్లాక్ను జెన్కోకు కేటాయించి, ప్రైవేట్ సంస్థ ఏఎమ్మార్ కు అప్పగించి మార్కెట్ విలువ కంటే అధిక ధరకు బొగ్గు కొనుగోలు చేసేలా ఒప్పందాలు చేసి సింగరేణికి భారీ నష్టం కలిగించారని విమర్శించారు. అధికారంలో నుంచి దిగే సమయానికి సింగరేణిపై దాదాపు రూ.30 వేల కోట్ల అప్పుల భారం మోపి ఆర్థికంగా బలహీనపరిచారని చెప్పారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వల్లే సింగరేణి ఇబ్బందుల్లో పడిందని, అందుకే ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రభుత్వం సంస్థను ఆదుకునేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతో వేలం లేకుండానే తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ను సింగరేణికి కేటాయించారని, ఒడిశాలోని నైని కోల్ బ్లాక్కు అనుమతులు తెచ్చి పనులు ప్రారంభించేలా కృషి చేశారని గుర్తు చేశారు.

బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే బీఎంఎస్ లక్ష్యమని అన్నారు. సింగరేణి భరోసా యాత్రకు కార్మికుల నుంచి విశేష స్పందన వస్తుండడంతోనే బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎరుకల గణపతి, బిఎంఎస్ సెంట్రల్ కార్యదర్శి సట్యూరి శ్రీనివాస్, బ్రాంచి కార్యదర్శి రాసకట్ల నర్సింగరావు, బ్రాంచ్ కార్యదర్శి రేణికుంట్ల మల్లేష్, బ్రాంచి నాయకులు పొట్టి శ్రీరాములు, పిట్ కార్యదర్శి పునీత్ రావు, రిటైర్డ్ ఎంప్లాయ్ రాజన్న, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ భాస్కర్, పార్టీ నాయకులు దొంగల రాజేందర్, బట్టు రవి, సామల మధుసూదన్ రెడ్డి, జీఐఎస్ సంపత్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధన అందించాలి

- బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టి
- విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి, జులై 16 (జనంసాక్షి) :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులు ఉత్తమ విద్యా ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని, సులభంగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. గురువారం హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు బ్రేక్ఫాస్ట్లో భాగంగా అందిస్తున్న మైసూర్ బోండాను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. ప్రతిరోజూ అందిస్తున్న బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి, మెనూ గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి, ఆర్వో వాటర్ ప్లాంట్ పనితీరును తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందించే ఆహారం పరిశుభ్రంగా, పోషకాహార ప్రమాణాలతో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

### కలెక్టర్ విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం

ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సుల విద్యార్థినులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో నేరుగా మాట్లాడారు. ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఫిజిక్స్ పాఠ్యాంశానికి సంబంధించిన అంశాలను బోర్డుపై రాసి వాటిపై ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించారు. వివిధ సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి, చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థినికి సులభంగా అర్థమయ్యే విధంగా అధ్యాపకులు పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన సాగించాలన్నారు. ఆన్లైన్లో నిర్వహిస్తున్న ఫిజిక్స్ వాలా తరగతులను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే నీట్, జేఈఈ తదితర జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థినులను తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులు కూడా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అజ్మీర గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ కవిత, అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



**నల్లబెల్లి, జూలై 16 (జనంసాక్షి):** అప్పుల బాధతో రైతు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం శనిగరం గ్రామ జాతీయ రహదారి పక్కన గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం ఖానాపురం మండలం అయోధ్య నగర్ గ్రామానికి చెందిన పుప్పాల దేవేందర్ (35) అనే రైతుకు నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. దీంతోపాటు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పంట సాగు కోసం అప్పులు చేశాడు. వరి నాటు కోసం నారుమడలను ఏర్పాటు చేసుకున్నాడు. వర్షాలు లేకపోవడంతో నారుమడులు పూర్తిగా ఎండిపోయాయి. అనుకున్న స్థాయిలో వర్షాలు లేకపోవడం, తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలోనని మనస్థాపానికి గురై శనిగరం గ్రామ జాతీయ రహదారి పక్కన చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనను గమనించిన బాటసారులు పోలీసులకు సమాచారాన్ని అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపారు.



## రామప్ప, గణపురం చెరువులను సందర్శించిన గండ్ర

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (గణపురం), (జనంసాక్షి):** రామప్ప, గణపురం చెరువుల నీటిమట్టాన్ని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి గురువారం పరిశీలించారు. గణపురం చెరువులో ప్రస్తుతం 15 అడుగుల నీరు మాత్రమే ఉందని, వర్షాలు లేక తాగు, సాగునీటికి ఇబ్బంది ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో దేవాదుల ద్వారా రామప్ప నుంచి గణపురం చెరువుకు గ్రావిటీ కెనాల్ పనులకు నిధులు మంజూరు చేసినా, ప్రభుత్వం మారాక పనులు ఆగిపోయాయని తెలిపారు. రామప్ప ఫుల్ లెవెల్ మెయింటైన్ చేస్తూ గణపురం చెరువుకు నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల తదితర మండలాలకు మిషన్ భగీరథ ద్వారా ఈ చెరువు నుంచే నీరు సరఫరా అవుతుందని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## బాసర అమ్మవారిని దర్శించుకున్న బక్కి వెంకటయ్య

**బాసర, జూలై 16 (జనం సాక్షి) :** విద్యకు నిలయమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో గురువారం భక్తి వాతావరణం నెలకొంది. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య కమిషన్ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి చేరుకున్న వెంటనే వారికి ఆలయ వేద బృందం అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బాలాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రాల నడుమ అమ్మవారికి అర్చన చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దర్శనానంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై దేవస్థాన ఈఓ అంజనీదేవితో చర్చించారు. ఆలయ ప్రాంగణంలోని వివిధ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరమైన చోట నిధులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ హామీ ఇచ్చారు. బాసర ఆలయం తెలంగాణ సంస్కృతికి, విద్యకు ప్రతీక. ఇక్కడికి వచ్చే ప్రతి భక్తుడికి సకల సౌకర్యాలు ఉండేలా చూడాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## సాధారణ ప్రసవాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ



**నాగర్ కర్నూల్, జూలై 16 (జనంసాక్షి) :** ప్రతి గర్భవతి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమయ్యే విధంగా ప్రసవ ప్రణాళిక తయారు చేయాలని, సాధారణప్రసాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వైద్యమంలో వారికి శాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ తెలిపారు. గురువారం నాడు నాగర్ కర్నూల్ మండలంలోని దేశీటికాల బస్తీ దవఖాన, మంతటి ఆరోగ్య ఉప కేంద్రాన్ని మరియు తెలకపల్లి మండలంలోని పెద్దూరు, బొప్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతిరోజు అందిస్తున్న ఓపి సేవలను, స్టోర్ లోని మందుల నిలువలను, టీ డయాగ్నొస్టిక్ పంపిస్తున్న రక్తనమునాల రికార్డుల ను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ, మాతా శిశు సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని గర్భవతులను 12 వారాల్లోపు నమోదు చేసి గర్భవతులను కచ్చితంగా కనీసం రెండుసార్లు గైనకాలజిస్ట్ డాక్టర్స్ ప్రత్యేక పరీక్షలు చేయించాలన్నారు. గర్భవతుల పరీక్షల కోసం 102 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈనెల జూలై చివరి నాటికి 30 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరినీ రక్తపోటు, మధుమేహము, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని తెలియజేశారు. మధుమేహ మరియు రక్త పోటు వ్యాధిగ్రస్తులకు ప్రతినెల పరీక్షించి, ప్రతిరోజు మందులు క్రమం తప్పకుండా వాడే విధంగా వారికి ఫాలోఅప్ చేయాలని, ప్రతిరోజు కనీసం 30 నిమిషాలు నడక, పౌష్టికాహారం గురించి, ధూమపానము మద్యపానము మని వేసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ శివరాజ్, డాక్టర్ నాగేశ్వరి, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలచారి, డిపిఓ రేనయ్య మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, భద్రతపై రాజీ లేదు

- బాధితులకు సత్వర న్యాయం, నష్టపరిహారం అందించాలి
- జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జులై 16 (జనంసాక్షి) :** సమాజంలో అత్యంత వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, భద్రత, సామాజిక న్యాయం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు, హత్యలు, అత్యాచారాలు, సామాజిక వివక్ష ఘటనల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేసిన ఆయన, ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యతతో విచారించి బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం, పునరావాసం, ఇతర సంక్షేమ ప్రయోజనాలను ఆలస్యం లేకుండా అందించాలని సూచించారు.గురువారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసులు, సంక్షేమ కార్యక్రమాల అమలు, నష్టపరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. సమావేశానికి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎల్లపోగు వెంకటస్వామి, చిన్నగళ్ల రమేష్, గమ్మకొండ రాములు, వెల్టూరు రేనయ్య, కే. చంద్రర్, బండ పర్వతాలు,



మహమ్మద్ అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట పోలీసు సబ్‌డివిజన్ల పరిధిలో నమోదైన ప్రతి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల కేసును సమావేశంలో క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ప్రస్తుత దశ, ఎఫ్ఐఆర్ నమోదు, దర్యాప్తు పురోగతి, చార్జిషీట్ దాఖలు, నిందితుల అరెస్టులు, కోర్టు విచారణ, నష్టపరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు వంటి అంశాలపై సంబంధిత డీఎస్పీల నుంచి వివరాలు తీసుకున్నారు.

నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్) -- పీసీఆర్), అట్రాసిటీ నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ -- పీవోఏ) చట్టాలను ఖచ్చితంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ కమిటీకి సమగ్ర నివేదిక సమర్పించిన అనంతరం జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు, అత్యాచారాలు, వివక్షకు సంబంధించిన కేసుల పరిష్కారానికి జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి కేసును సున్నితంగా, పారదర్శకంగా విచారిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం--1989 నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, కేసు నమోదు నుంచి దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు, నిందితుల అరెస్టు వరకు ప్రతి దశను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయంలో కేసులు నమోదైన వెంటనే త్వరితగతిన దర్యాప్తు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు.

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల భద్రత విషయంలో రాజీ ఉండదన్నారు. కేసుల పురోగతి, నష్టపరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నమోదైన కేసులకు సంబంధించిన నష్టపరిహారం చెల్లింపుల్లో జాప్యం, విచారణ ఆలస్యం, బాధిత కుటుంబాలకు అందాల్సిన సహాయంపై పలు అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. పెండింగ్ కేసులను ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి త్వరగా పరిష్కరించాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అరుణారెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ కార్యదర్శి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి, జిల్లా కార్మిక శాఖ అధికారి రాజ్‌కుమార్, డీఆర్‌డీఓ చిన్న ఓబులేసు, డిప్యూటీ సీఎంఓ గోపాల్ నాయక్, ఆర్డీవోలు, డీఎస్పీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే రోజుల్లో బీజేపీదే అధికారం

- బిజెపి రాష్ట్ర నాయకులు బూరుగు సురేష్ గౌడ్
- చేర్యాల పట్టణ బిజెపి కార్యవర్గ సమావేశం



**చేర్యాల, జూలై 16 (జనంసాక్షి) :** రాబోయే రోజుల్లో బీజేపీదే అధికారమని బిజెపి రాష్ట్ర నాయకులు బూరుగు సురేష్ గౌడ్ అన్నారు. చేర్యాల పట్టణ కేంద్రంలో గురువారం బిజెపి పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు బూరుగు సురేష్ గౌడ్ హాజరై మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేని దీనస్థితిలో ఉందనే విషయం తెలంగాణ ప్రజలకు అర్థమైంది. కేవలం ఎన్నికలలో గెలవడం కోసమే నెరవేర్చలేని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయాలి. తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలలో 14, 15 ఫైనాన్స్ కింద వచ్చే నిధులతో ఈరోజు కొద్దిపాటి అభివృద్ధి గ్రామాలలో జరుగుతుంది అంతేగాని ఈ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఇచ్చిన దాఖలాలు లేవు. చేర్యాల పట్టణ కేంద్రంలో 12 వార్డులలో ఎక్కడ అభివృద్ధి నోచుకోకుండా ఇక్కడున్న పాలకవర్గం చోద్యం చూస్తుంది. ఇప్పటివరకు జరిగిన చేర్యాల పట్టణ కేంద్రంలో మునిసిపాలిటీకి కేంద్రం నుంచి వచ్చిన నిధుల తోనే సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేశారు తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి వచ్చిన దాఖలాలు లేవు. పట్టణ ప్రగతి, స్మార్ట్ సిటీ కింద కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వస్తే ఇక్కడున్న కొంతమంది కాంగ్రెస్ నాయకులు తామే ఆ నిధులు తెచ్చామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరం. రానున్న రోజుల్లో చేర్యాల పట్టణ కేంద్రంలో 12 వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేసే విధంగా పాలకవర్గంపై, అధికార పార్టీపై ఒత్తిడి తెచ్చే విధంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ బిజెపి సీనియర్ నాయకులు పోతుగంటి రామదాసు, బిజెపి సీనియర్ నాయకులు పూర్మ సంజీవరెడ్డి, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శుల పంగ సిద్ధులు, బిజెపి ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి ఒకరు కాటం సురేందర్, ఎండి షాదుల్లా బాబా, మన్నె సత్య వర్ధన్, ఉట్లపల్లి సురేష్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి మానిష్, బిజెపి సీనియర్ నాయకులు కొట్టే చంద్రమౌళి, ఆకుల శివయ్య, హరి తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత లక్ష్యం మేరకు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 16 (జనం సాక్షి) :** జాతీయ ఆహార నూనెల మిషన్ -ఆయిల్ పామ్ పథకం కింద జిల్లాకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకుని ఆయా మండలాలలో రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. దీంతో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు రైతులు ఉత్సాహంతో ముందుకు వస్తున్నారని అన్నారు. ఇప్పటికే 134.50 ఎకరాలలో 6725 ఆయిల్ పామ్ మొక్కలను నాటడం పూర్తయ్యిందని వివరించారు. 2027 మార్చి నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో లక్ష్యం మేరకు ఆయిల్ పామ్ సాగు జరిగేలా ప్రణాళికాబద్దంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆయిల్ పామ్ వల్ల సమకూరే లాభాలను గుర్తించి, అనేక మంది ఔత్సాహిక రైతులు ఈ పంట సాగుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తూ డీ.డీలు చెల్లిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు మొత్తంగా జిల్లాలో 6500 ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగులో ఉందని, అదనంగా ఈ ఏడాది 2వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు కోసం సరిపడా రెండు లక్షల ఆయిల్ పామ్ మొక్కలను నర్సరీలో సిద్ధంగా ఉంచామని కలెక్టర్ తెలిపారు. సంప్రదాయ వరి పంటతో పోలిస్తే ఆయిల్ పామ్ సాగు వల్ల అధిక లాభాలు సమకూరుతాయని, వరికి ఇది మంచి ప్రత్యామ్నాయం అని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు గాను ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోందని, జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని అన్నారు.

## కేజీబీవీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 16 (జనం సాక్షి) :** నందిపేట మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. పాఠశాల ఆవరణను, డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, తరగతి గదులను పరిశీలించారు. బియ్యం బస్తాలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడ కూడా నీరు నిలువ ఉండకూడదని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. చిన్నచిన్న లోపాలను గమనించిన కలెక్టర్, వాటిని సరి చేసుకోవాలని సూచించారు. బాలికలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. అనంతరం 7వ తరగతి గదికి వెళ్లి విద్యార్థినులతో భేటీ అయ్యారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పలు ప్రశ్నలు వేసి, విద్యార్థినుల అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. వ్యక్తిగత భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లిదండ్రులు, సంరక్షకులు తప్ప ఇతరులు ఎవరు వచ్చినా వారితో వెళ్లకూడదని జాగ్రత్తలు సూచించారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు, బహుమతులను విద్యార్థినులకు అందించారు. ఇష్టపడి చదువుకోవాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని ఉద్బోధించారు.

వారిలో స్ఫూర్తిని పెంపొందింపజేశారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని నిర్వాహకులను ఆదేశించారు. కాగా, పాఠశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయం పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ శ్రీనివాస్ రావు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శాంతికుమారి తదితరులు ఉన్నారు.

# మెదక్ పర్యాటక రంగం అభివృద్ధికి అన్ని రకాల ఏర్పాట్లు

- టూరిజం కన్సల్టెంట్ శవంతి గుప్తా, భువన్



**మెదక్, జులై 16, (జనం సాక్షి) :** జిల్లా కలెక్టర్ మెదక్ జిల్లా ఆదేశానుసారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పర్యాటక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాల అభివృద్ధి చేయడంలో భాగంగా గురువారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ప్రముఖ టూరిజం, పర్యాటక విభాగం కన్సల్టెంట్ శవంతి గుప్తా, భువన్ సందర్శించారు. మెదక్ జిల్లాను టూరిస్ట్ హబ్‌గా అభివృద్ధి చేయడం, జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, మూడు రోజుల పర్యటనలో భాగంగా మొదటిరోజు జిల్లాలోని నర్సాపూర్ అర్బన్ పార్క్, పార్క్ కాటేజీలు, వెంకట్రావుపేట కోట, మెదక్ ఖిల్లా ప్రాంతాలను సందర్శించడం జరిగింది. జిల్లాలోగల అనేక చారిత్రక ప్రదేశాలను పర్యాటక కేంద్రాలుగా (టూరిస్ట్ హబ్‌లుగా) తీర్చిదిద్దేందుకు టూరిజం కన్సల్టెంట్ అధికారులు శవంతి గుప్తా, భువన్ లు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులు, చారిత్రక విశిష్టత, పర్యాటకులకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులతో పాటు మరింత అభివృద్ధి చేయాల్సిన అంశాలను వారు పరిశీలించారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా పర్యాటక ప్రదేశాల సుందరీకరణ, వాకింగ్ ట్రాక్‌లు, వీక్షణ స్థలాలు, పార్కింగ్ సదుపాయాలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, దిశా సూచిక బోర్డులు, విద్యుత్ వెలుగులు, పిల్లల వినోద సదుపాయాలు, భద్రతా చర్యలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. నర్సాపూర్ అర్బన్ పార్క్, పార్క్ కాటేజీలను కుటుంబ పర్యాటకానికి, వివాహ, వినోద కార్యక్రమాలకు అనువుగా అభివృద్ధి చేయడంతో పాటు, వెంకట్రావుపేట కోట, మెదక్ ఖిల్లా చారిత్రక ప్రాధాన్యతను దేశ విదేశాల పర్యాటకులకు చేరువ చేసే విధంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జిల్లా టూరిజం శాఖ వారికి సూచించడం జరిగింది. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, స్థానిక కళలు, సంస్కృతి, హస్తకళలు, చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, మెదక్ జిల్లాను తెలంగాణలో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రమేష్ గంగాల, ఇ.డి.యం. సందీప్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్. అధికారులు, పర్యాటక శాఖ ప్రతినిధులు, అటవీ శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలో అవినీతి - కేసీఆర్ హయాంలో ప్రగతి

- సీతారామ ప్రాజెక్టును సాకారం చేసిన దార్శనికుడు కేసీఆర్
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 16 (జనం సాక్షి) :** ఆనాడు కాంగ్రెస్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అవినీతి, దోపిడీకి గురై కునారిల్లిన ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులకు కేసీఆర్ సీతారామ ప్రాజెక్టుగా పునర్జీవం పోసి ప్రగతి పథంలో నడిపించారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుని జలయజ్ఞం అని ధనయజ్ఞంగా మార్చి మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరిట దోపిడీ చేసి ప్రాజెక్టులను అవినీతి, అక్రమాలకు నిలయాలుగా మార్చిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి గోదావరి జలాలను ఒడిసిపట్టి 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో వేగంగా పనులు చేపట్టిందని తెలిపారు.



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.9 వేల కోట్లు వెచ్చించి, 100 కిలోమీటర్లకు పైగా ప్రధాన కాలువలు, పంప్ హౌస్‌లు, పైప్‌లైన్లు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలను నిర్మించామని, అధిక సామర్థ్యం గల మోటార్లు, ఆధునిక యాంత్రిక పరికరాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రాజెక్టు పనుల్లో గణనీయమైన పురోగతి సాధించామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వివరించారు. భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతులు వంటి క్లిష్టమైన అంశాలను పరిష్కరించి, ప్రాజెక్టు నిర్మాణాన్ని 90 శాతం వరకు పూర్తి చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతాంగానికి సాగర్ ఆయకట్టుకు శాశ్వత సాగునీటి భరోసా కల్పించడం, వ్యవసాయాభివృద్ధి, భూగర్భ జలాల పెంపు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా కేసీఆర్ సీతారామ ప్రాజెక్టును రూపుదిద్దారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు సీతారామ ప్రాజెక్టుకు తాము ఎంత మేర నిధులు ఖర్చు చేశారో చేసిన కృషి ఏమీ లేక ప్రజలకు చెప్పుకునే విషయాలు లేకపోవడంతో కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టినపనులనే తమ ఘనతగా చెప్పుకునేప్రయత్నం కాంగ్రెస్ మంత్రులు చేయడం ప్రజలను మోసం చేయడమేనని ఎవరి కృషి ఏమిటో వాస్తవాలు ప్రజలకు స్పష్టంగా తెలుసని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేద వారి సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




**మిర్యాలగూడ, జూలై 16 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్లతోనే పేద వారి సొంత ఇంటి కల సాకారం అవుతుంది అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం నాడు మిర్యాలగూడ మండలం జాలుబాయి తండా గ్రామానికి చెందిన లబ్దిదారులు భూక్యా కోటేష్, దీరావత్ మోహన్, భూక్యా లచ్చు,భూక్యా రమేష్ ఆడోత్ నాగు,భూక్యా సక్కుబాయ్ లు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి నూతన గృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన సొంత నివాసం కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.




## లేఆఫ్‌లకు ఏఐ వినియోగమా?

- వైద్య, కుటుంబ సెలవుల్లో ఉన్నవారే లక్ష్యం
- మెటాపై 26 మంది ఉద్యోగుల దావా




**శాన్‌ఫ్రాన్సిస్కో:** ఉద్యోగుల్లో ఎవరిని తొలగించాలో (లేఆఫ్ చేయాలో) ఎంపిక చేయడానికి కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించిందంటూ మెటా సంస్థపై 26 మంది ఉద్యోగులు కలిసి దావా వేశారు. వైద్య, మాతృత్వ/కుటుంబ సెలవుల్లో ఉన్న వారినే లేఆఫ్ చేసేందుకు ఎక్కువగా లక్ష్యంగా చేసుకున్నట్లు వారు ఆరోపించారు. మే నెలలో కంపెనీ 8,000 మంది (మొత్తం సిబ్బందిలో 10%) ఉద్యోగులకు లేఆఫ్ ఇచ్చిన విషయం తెలిసిందే. వారిలో ఈ 26 మంది కూడా ఉన్నారు. ఎవరిని లేఆఫ్ చేయాలన్న దాని కోసం కంపెనీ తన అంతర్గత ఏఐ వ్యవస్థలు, కీస్ట్రోక్-యాక్టివిటీ మానిటరింగ్ డేటా, ఏఐ టోకెన్ వినియోగిత డ్యాష్‌బోర్డులు, అల్గారితమ్ ఆధారిత పనితీరు ర్యాంకింగ్‌లు వంటి పద్ధతులను వినియోగించిందని వివరిస్తూ, కాలిఫోర్నియాలోని ఫెడరల్ కోర్టులో వీరు దావా వేశారు. వైద్య, కుటుంబ సెలవుల్లో ఉన్న వారి ఉత్పాదకత సాధారణంగానే తగ్గినట్లు కనిపిస్తుంది. అది వారి అసమర్థత కింద జమకట్టడం అన్యాయమని పేర్కొన్నారు.

## అమెరికాలో క్రిమినల్ కేసు కొట్టివేతకు చాటుమాటు ఒప్పందమేమీ లేదు

### గౌతమ్ అదానీ అఫిడవిట్

**దిల్లీ:** తనపై క్రిమినల్ అభియోగాలు కొట్టివేస్తూ, అమెరికా న్యాయ శాఖ నిర్ణయం తీసుకునేందుకు తమవైపు నుంచి చాటుమాటు హామీ/ఒప్పందం లేదా బేరసారాలు జరగలేదని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ వెల్లడించారు. ఆ నిర్ణయానికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు చోటుచేసుకోలేదని పేర్కొంటూ అఫిడవిట్ సమర్పించారు. 'అభియోగాలు కొట్టివేసేందుకు ఏదైనా హామీ, ప్రతిపాదన లేదా ఒప్పందం కుదుర్చుకున్నారా.. ఆ లావాదేవీల గురించి గౌతమ్ అదానీకి తెలుసా లేదా అన్నది అఫిడవిట్‌లో తెలిపాలని' న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్‌కు చెందిన అమెరికా జిల్లా కోర్టు ఈనెల 8న జారీ చేసిన ఆదేశాలకు ప్రతిస్పందనగా దాన్ని దాఖలు చేశారు. 'కేసు తొలగింపునకు సంబంధించి ఎవరైనా ఏదైనా వాగ్దానం చేసినా, ప్రతిపాదించినా, కోరినా, స్వీకరించినా, అంగీకరించినా లేదా ఆమోదించినా' దాని గురించి తనకు తెలియదని అదానీ పేర్కొన్నారు.

# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం సెషన్‌లో ఊగిసలాడాయి. పశ్చిమాసియా ఉద్రిక్తత పరిస్థితులు, చమురు ధరలు పెరగడం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి ఘర్షణలు ప్రాంతీయ యుద్ధానికి దారితీయొచ్చనే భయాలు నెలకొన్నాయి. దీంతో ప్రపంచ మార్కెట్లపై ప్రభావం పడింది. ఈ క్రమంలోనే దేశీయ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. చివరికి సెన్సెక్స్ 1.44 పాయింట్ల లాభంతో 77,186.87 వద్ద ముగిసింది. నిఫ్టీ 5.75 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్‌టెక్, ఇండిగో, బజాజ్‌ఫైనాన్స్, మారుతీ,మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ కంపెనీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నల్, బీఈఎల్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీబ్యాంక్, ఎన్‌టీపీసీ, ట్రెంట్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 96.34 వద్ద ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ చమురు ధర 84.76 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,033 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మరోవైపు ఆసియా మార్కెట్లలో దక్షిణకొరియా కోస్పి, జపాన్ నిక్కీ వంటి మార్కెట్లు కూడా నష్టాలను చవిచూశాయి. అంతకుముందు బ్యాంకింగ్ షేర్లు రాణించడంతో దేశీయ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తక్కువగా నమోదుకావడంతో, రాబోయే రోజుల్లో రేట్ల పెంపుపై ఫెడరల్ రిజర్వ్ దూకుడుగా వెళ్లకపోవచ్చన్న అంచనాలు పెరిగాయి. ఫలితంగా ఉదయం మన సూచీలు భారీలాభాల్లో కదలాడాయి. అయితే అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలు పెరగడంతో, మదుపర్లు లాభాలు స్వీకరించడం ప్రభావం చూపింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 9 పైసలు తగ్గి 96.25 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు ధర 0.90% పెరిగి 85.50 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో షాంఘై నష్టపోగా, మిగతావి లాభపడ్డాయి. ఐరోపా సూచీలు బలహీనంగా ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.55 లక్షల కోట్లు పెరిగి రూ.481.02 లక్షల కోట్ల (5 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 138 పాయింట్ల (క్రితం



ముగింపు 77,054.94) లాభంతో 77,192.76 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ, 77,646.27 వద్ద గరిష్ఠాన్ని తాకింది. అక్కడ లాభాల స్వీకరణ ఎదురవడంతో, నష్టాల్లోకి జారుకున్న సూచీ, 76,982.82 పాయింట్లకు పడిపోయింది. చివరకు మళ్లీ కోలుకుని, 130.49 పాయింట్ల లాభంతో 77,185.43 వద్ద ముగిసింది. నిఫ్టీ 26.45 పాయింట్లు పెరిగి 24,078.50 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,010.55-24,220.35 పాయింట్ల మధ్య కదలాడింది. ఆకర్షణీయ త్రైమాసిక ఫలితాలతో బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ (గ్రో) షేరు 6.16% లాభంతో రూ.216.40 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.7,873.37 కోట్లు పెరిగి రూ.1.35 లక్షల కోట్లకు చేరింది.సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభపడ్డాయి. ఎటర్నల్ 3.08%, అల్ట్రాటెక్ 2.77%, ఎస్‌బీఐ 1.50%, బజాజ్ ఫైనాన్స్ 1.49%, ఇండిగో 1.20%, ఏషియన్ పెయింట్స్ 1.12%, టెక్ మహీంద్రా 1.01% రాణించాయి. పవర్‌గ్రిడ్ 1.80%, ఎల్ అండ్ టీ 1.69%, టాటా స్టీల్ 1.65%, ఇన్ఫోసిస్ 1.41%, ఎన్‌టీపీసీ 1.06%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.97% నీరసపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. యంత్ర పరికరాలు 1.27%, పీఎస్‌యూ బ్యాంక్ 0.92%, మన్నికైన వినిమయ వస్తువులు 0.76%, వినియోగ 0.66%, చమురు-గ్యాస్ 0.63% పెరిగాయి. యుటిలిటీస్, ఎఫ్ఎమ్‌సీజీ, ఐటీ, లోహ, స్థిరాస్తి, ఫోకస్డ్ ఐటీ నిరాశపరిచాయి. బీఎస్ఈలో 2207 షేర్లు లాభపడగా, 2081 స్క్రిప్‌లు నష్టపోయాయి. 161 షేర్లలో ఎటువంటి మార్పులేదు. కుసుమ్‌గర్ లిమిటెడ్ షేరు ఇష్యూ ధర రూ.419తో పోలిస్తే బీఎస్ఈలో 36.99% లాభంతో రూ.574 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.631.65 వద్ద గరిష్ఠాన్ని తాకిన షేరు, చివరకు 44.26% లాభంతో రూ.604.45 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,346.20 కోట్లుగా నమోదైంది. క్యూబ్ హైవేస్ ట్రస్ట్ రూ.5000 కోట్ల ఇన్విట్ ఇష్యూ ఈ నెల 22న ప్రారంభమై 24న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణి రూ.151-152.ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓ రెండో రోజుకే 2.77 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 12,45,63,536 షేర్లను ఆఫర్ చేయగా, 34,54,27,290 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. ఎన్ఐఐ విభాగంలో 6.58 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 1.61 రెట్లు, క్యూఐబీ విభాగంలో 1.50 రెట్ల స్పందన దక్కింది.

## ఆక్సిజన్ ఓఎస్‌కు వన్‌ప్లస్ గుడ్‌బై.. ఇకపై కలర్‌ఓఎస్ అప్‌డేట్స్

ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ అంటేనే గుర్తొచ్చేది ఆక్సిజన్ ఓఎస్. క్లీన్ ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పీరియన్స్ వల్ల చాలా మందికి ఇది ఫేవరెట్ యూఐ. ఈ యూఐ కారణంగానే వన్‌ప్లస్ ఫోన్‌లను ఎక్కువగా ఇష్టపడతారంటే అతిశయోక్తి కాదు. అలాంటి వారికి చేదువార్త. ఆక్సిజన్ ఓఎస్‌కు వన్‌ప్లస్ గుడ్‌బై చెప్పేసింది. ఇకపై వన్‌ప్లస్ ఫోన్లకు కలర్‌ఓఎస్ అప్‌డేట్‌లను అందిస్తామని కంపెనీ ప్రకటించింది. మెరుగైన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లను అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కంపెనీ తెలిపింది. "సాఫ్ట్‌వేర్ వ్యూహంలో భాగంగా వన్‌ప్లస్ డివైజ్‌లు ఆక్సిజన్ ఓఎస్‌కు బదులు కలర్ ఓఎస్‌కు అప్‌డేట్ అవుతాయి. సాఫ్ట్‌వేర్ నాణ్యతను పెంచడం, అప్‌డేట్‌లను వేగవంతం చేయడం, మెరుగైన సాఫ్ట్‌వేర్ సేవలను అందించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. ఇంతకు ముందు వన్‌ప్లస్ ఫోన్‌లకు ఇచ్చిన హామీ మేరకు ఓఎస్ అప్‌డేట్స్, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ యథావిధిగా అందిస్తాం. భవిష్యత్తులో రానున్న ఫోన్లలో ఆక్సిజన్ ఓఎస్ అప్‌డేట్లు మాత్రమే దర్శనమిస్తాయి" అని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది.

## డీజిల్ ఎగుమతులపై విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్ పెంపు..

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ.. కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ ్ఫాల్ గెయిన్స్ ట్యాక్స్‌ను పెంచింది. అయితే, పెట్రోల్‌పై సుంకాన్ని మాత్రం తగ్గించింది. జులై 16 నుంచి రెండు వా రాల పాటు ఈ నిర్ణయాలు అమల్లో ఉంటాయని తెలిపింది. తాజా నిర్ణయంతో లీటర్ డీజిల్‌పై విండ్ ఫాల్ ట్యాక్స్ రూ.8.5 నుంచి రూ.15.5కు పెరిగింది. విమాన ఇంధనం లీటర్‌పై ఈ పన్నును రూ.7.5 నుంచి రూ.14.5కు పెంచింది. ఇక, లీటర్ పెట్రోల్‌పై ఎగుమతి సుంకాన్ని రూ.4 నుంచి రూ.2.5కి తగ్గించింది.అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు అకస్మాత్తుగా పెరిగినప్పుడు, చమురు కంపెనీలకు భారీ లాభాలు వస్తాయి. ఇలాంటి అదనపు లాభాలపై ప్రభుత్వం పన్ను రూపంలో కొంత మొత్తాన్ని వసూలు చేస్తోంది. ఈ నిధులను దేశీయ అవసరాలకు, సంక్షేమ పథకాలకు ఉపయోగిస్తోంది.ఇదిలా ఉండగా.. హర్మూజ్ అంతరాయాల నేపథ్యంలో వరుసగా నాలుగోరోజు ముడిచమురు ధరలు పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర 85డాలర్లు దాటగా.. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ ధర 80 డాలర్లు దాటింది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,53,140 | ₹ 1,67,064 |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్


₹ 2,60,000

# ఏఐలో ధరల యుద్ధం




**న్యూఢిల్లీ:**న్యూఢిల్లీ:కృత్రిమ మేధ (ఏఐ) విపణిలో టెక్ దిగ్గజాల మధ్య వాణిజ్య సమరం మొదలైంది. ఇప్పటిదాకా సాంకేతిక సామర్థ్యాల్లో పోటీపడిన అంతర్జాతీయ కంపెనీలు.. ఇప్పుడు తక్కువ ధరలకే ఆయా సేవలను దేశీయ విపణిలో అందించేందుకు ధరల రూపేణ పోటీకి దిగాయి. ప్రపంచంలోనే అత్యధిక ఏఐ వినియోగదారులు, డెవలపర్లు మనదేశంలో ఉండటమే ఇందుకు కారణం. అమెరికా ఏఐ అంకురం ఆంత్రోపిక్.. తమ క్లాడ్ సేవలు పొందేందుకు మన రూపాయల్లోనే చెల్లించే పథకాలను ఆవిష్కరించగా; మరో సంస్థ ఓపెన్‌ఏఐ భారత మేనేజింగ్ డైరెక్టర్‌గా ప్రభ్జీత్ సింగ్‌ను నియమించుకుని, పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తోంది.ఆంత్రోపిక్ క్లాడ్ ప్రో లేదా బిజినెస్ పథకాలు ఉపయోగించేందుకు ఇప్పటివరకు వినియోగదారులు అమెరికన్ డాలర్లలో చెల్లించాల్సి వచ్చేది. దీనివల్ల ప్రతినెలా మారకపు ఖర్చులు, క్రెడిట్ కార్డు ఛార్జీలు, అదనపు పన్నుల భారం పడేది. చెల్లింపుల ప్రక్రియా క్లిష్టంగా ఉండేది. ఇప్పుడు క్లాడ్ ప్రో ఏడాది సభ్యత్వం కోసం నెలకు రూ.2,000 ధరను సంస్థ నిర్ణయించింది. నెలవారీ ప్లాన్ కోసం రూ.2,399, వ్యాపార సంస్థల కోసం క్లాడ్ టీమ్ ప్లాన్‌ను ప్రతి యూజర్‌కు రూ.2,399 చొప్పున అందుబాటులోకి తెచ్చింది. అత్యధిక రద్దీ సమయాలో,?ల ప్రాధాన్య సేవలు అందించే క్లాడ్ మ్యాక్స్ ప్లాన్ ధర నెలకు రూ.11,999 ప్రారంభ ధరతో ప్రవేశపెట్టింది. వీటిపై 18% జీఎస్‌టీ పడుతుంది. దీనివల్ల కార్పొరేట్ కంపెనీలు, అంకురాలు తమ ఏఐ బడ్జెట్‌ను సులభంగా అంచనా వేసుకోవచ్చు. వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల ద్వారా కార్డులతో ఈ చెల్లింపులు చేయొచ్చు. యూపీఐ చెల్లింపులకు ఇంకా వీలు కల్పించలేదు. ఆంత్రోపిక్ అంతర్జాతీయ ఏఐ ట్రాఫిక్‌లో దాదాపు 6% వాటాతో, మనదేశం ఆ సంస్థకు రెండో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించింది. మెరుగైన సేవలు చూపుతూ, ఉచిత వినియోగదారులను 'పెయిడ్ సబ్‌స్క్రైబర్స్'గా మార్చేందుకు.. రూపాయి బిల్లింగ్ కీలకమైన వ్యూహంగా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఆసియాలోనే తమ రెండో ప్రాంతీయ కార్యాలయాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలో బెంగళూరులో సంస్థ ప్రారంభించడంతో పాటు, పలు భారతీయ సంస్థలతో కీలక భాగస్వామ్యాలను ప్రకటించింది. గత అక్టోబరు నుంచి మనదేశ ఆదాయం ఈ సంస్థకు రెట్టింపు అయ్యింది. ఓపెన్‌ఏఐ చాట్‌జీపీటీ ప్లస్ నెలకు రూ.1,999 వసూలు చేస్తోంది. సాధారణ వినియోగదారుల కోసం, చాట్‌జీపీటీ గో.. నెలకు రూ.399 కే అందుబాటులో ఉంది. చాట్‌జీపీటీ ప్రొ కోసం నెలకు రూ.19,900 ఛార్జీ తీసుకుంటోంది.గూగుల్ జెమినై.. గూగుల్ ఏఐ ప్లస్ కోసం నెలకు రూ.399 తీసుకుంటోంది. గూగుల్ ఏఐ ప్రో రూ.1,950, గూగుల్ ఏఐ అల్ట్రా రూ.6,500లకు అందిస్తోంది. వినియోగదారుల సబ్‌స్క్రిప్షన్ మార్కెట్లోనే కాకుండా, కొత్త అప్లికేషన్లు తయారు చేయడానికి డెవలపర్లు, స్టార్టప్‌లు ఉపయోగించే ఏపీఐ మార్కెట్లో కూడా ధరల పోటీ తీవ్రమవుతోంది. ఓపెన్‌ఏఐ (జీపీటీ-5.6 సిరీస్), మెటా (మ్యూజ్ స్పార్క్ మోడల్స్), స్పేస్‌ఎక్స్‌ఏఐ (గ్రోక్ 4.5) వంటి దిగ్గజాలు తమ ఏఐ టోకెన్ల ధరలను భారీగా తగ్గిస్తున్నాయి. ఏఐ బిల్లు భారీగా పెరగడంతో, ఈ వ్యయాలపై దేశీయ కంపెనీలు పునరాలోచన చేస్తున్నాయి. దీనివల్ల ఎంతవరకు ప్రయోజనం ఉందో పరిశీలిస్తూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ పని పూర్తి చేసే ఏఐ ఏజెంట్ల వైపు మొగ్గు చూపిస్తున్నాయి. ఒక టాస్క్ పూర్తి కావడానికి అయ్యే సగటు ఖర్చు ఆధారంగానే ఇప్పుడు ఒప్పందాలు కుదురుతున్నాయి. దీనికి తోడు చైనా డీప్‌సీక్ వంటి కంపెనీలు ఉచితంగా/తక్కువ ధరలకే ఓపెన్ సోర్స్ మోడళ్లను అందించడంతో, అంతర్జాతీయ టెక్ కంపెనీలు తమ ధరలను తగ్గించక తప్పని పరిస్థితి ఏర్పడింది. తన ఇంజినీరింగ్ ప్రక్రియల్లో క్లాడ్ ఏఐ మోడళ్లను అనుసంధానించేందుకు ఆంత్రోపిక్‌తో ఎల్అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందువల్ల సాధారణ పనులను ఆటోమేట్ చేయడమే కాకుండా, ఇంజినీరింగ్ విధానాలనే సరికొత్తగా మార్చేందుకు వీలవుతుందని ఎల్అండ్‌టీ టెక్నాలజీ తెలిపింది.

# చిప్‌ల తయారీకి కేంద్రం దన్ను



**న్యూఢిల్లీ:**దేశంలో సెమీకండక్టర్లు.. మొబైల్ డిజైన్, తయారీ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్రప్రభుత్వం భారీ కేటాయింపులు చేసింది. భారత సెమీకండక్టర్ మిషన్ రెండో ఎడిషన్‌కు రూ.1.27 లక్షల కోట్లు, మొబైల్ ఫోన్ల తయారీని మరింత ప్రోత్సహించేందుకు మరో రూ.62,500 కోట్లు.. కలిపి మొత్తం రూ.1.89 లక్షల కోట్లు (22 బి. డాలర్లు) కేటాయించేందుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశ నిర్ణయాలను ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. సెమీకాన్ 2.0 ద్వారా రూ.4 లక్షల కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించొచ్చని, రూ.2 లక్షల కోట్ల విలువైన సెమీకండక్టర్ చిప్‌సెట్లు ఉత్పత్తి చేయొచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ రెండు పథకాలకు మార్గదర్శకాలను 20 రోజుల్లోగా వెలువరిస్తారు.చిప్‌సెట్ తయారీ పరిశ్రమలో ఖనిజాలు సహా ముడి పదార్థాలు సరఫరా చేసే వారికీ ప్రోత్సాహకాలిచ్చేలా కొత్త పథకం ఉంది. మొత్తం సెమీకండక్టర్ వ్యవస్థలోని విభాగాలన్నిటినీ దీని కిందకు వచ్చేలా చూశామని వైష్ణవ్ పేర్కొన్నారు. సెమీకాన్ 2.0 పథకం, 6 కీలక విభాగాలపై దృష్టి సారిస్తుంది. అందులో చిప్ డిజైన్, సెమీకండక్టర్ సామగ్రి-మెటీరియల్స్, ఫ్యాబ్రికేషన్ ప్లాంట్లు, అధునాతన ప్యాకేజింగ్-టెస్టింగ్, పరిశోధన-అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి ఉన్నాయన్నారు. ఈ పథకం అమలు ముగిసేసరికి, మన దేశం చిప్ సెట్ల తయారీలో స్వావలంబన సాధిస్తుందని.. రూ.లక్ష కోట్ల విలువైన చిప్‌లను ఎగుమతి చేయగలమని కేంద్రం భావిస్తోంది. సెమీకాన్ 1.0 కింద రూ.76,000 కోట్లు కేటాయించగా, రూ.1.64 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చే 12 ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపింది. టాటా ఎలక్ట్రానిక్స్ నుంచే ఎక్కువ పెట్టుబడులు వచ్చాయి. కొత్త చిప్ ప్లాంట్లకు ప్రోత్సాహకాలను తగ్గించింది. సిలికాన్ ఫ్యాబ్‌లకు 50% నుంచి 40 శాతానికి; ఇతర ఫ్యాబ్‌లకు 30 శాతానికి ఇన్సెంటివ్‌లను పరిమితం చేసింది.దేశంలో 8-9 గ్యాస్ ఆధారిత యూరియా ప్లాంట్లను 10 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మించడానికి సరికొత్త 'నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ ఫర్ యూరియా'(ఎన్ఐపీయూ-2026)ను కేంద్రం ప్రకటించింది. తద్వారా యూరియా ఉత్పత్తి విషయంలో స్వావలంబన సాధించాలన్న ఉద్దేశంతో ఉంది. 2012 నాటి న్యూ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ(ఎన్ఐపీ)కి ఇది కొనసాగింపుగా ఉంటుంది. దేశీయంగా యూరియా కొరత కారణంగా ఏటా 10 మి. టన్నుల మేర దిగుమతులు చేసుకుంటున్నట్లు వైష్ణవ్ పేర్కొన్నారు. ప్రస్తుత దేశీయ అవసరాలు 40 మి. టన్నులు కాగా, వార్షిక తయారీ సామర్థ్యం 30 మి. టన్నులే ఉన్నందున, కొత్త పథకాన్ని ప్రకటించారు.దేశీయ బ్రాండ్లు సైతం సాంకేతికత విషయంలో ముందడుగు వేయడానికి, స్థానికంగా మొబైల్ తయారీ మరింత పెంచేలా.. 'మొబైల్ ఫోన్ తయారీ స్కీమ్'కు రూ.62,500 కోట్లు కేటాయించనున్నారు. తయారీ ప్రోత్సాహక అనుసంధానిత పథకం ద్వారా రూ.39 లక్షల కోట్ల ఉత్పత్తి (ఇందులో రూ.15 లక్షల కోట్ల ఎగుమతులు); 60,000 కొత్త, ప్రత్యక్ష ఉద్యోగాల సృష్టి జరుగుతుందని మంత్రి వైష్ణవ్ పేర్కొన్నారు. మొబైల్ తయారీ పథకానికి ప్రోత్సాహకాలను 2030-31 వరకు ఇస్తారు.ఇవీ ప్రోత్సాహకాలు: అర్హత గల మొబైల్ ఫోన్ విక్రయాలపై 2.25-5% వరకు ప్రోత్సాహకాలు ఇస్తారు. ఉత్పత్తి డిజైన్, పరిశోధనలో పెట్టుబడులు పెట్టే దేశీయ కంపెనీలు.. దేశీయంగా కీలక విడిభాగాలను సమకూర్చుకోవడానికి అదనపు మద్దతూ లభిస్తుంది. అధునాతన కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు అంతర్జాతీయ టెండర్ ద్వారా భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ బిడ్లకు ఆహ్వానం పలుకుతోంది. పీఎల్ఐ ఏసీసీ పథకం కింద మొత్తం 10 గిగావాట్‌అవర్ (జీడబ్ల్యూహెచ్) సామర్థ్యంతో తయారీ ప్లాంట్లు నిర్మించడానికి బిడ్డింగ్ ఏర్పాటు చేసింది. మొత్తం 50 జీడబ్ల్యూహెచ్‌లో దేశీయ తయారీదార్లకు 40 జీడబ్ల్యూహెచ్ సామర్థ్యం గల ప్లాంట్లను కేటాయిస్తారు. జులై 15 నుంచే టెండర్‌పత్రాలు అందుబాటులో ఉంటాయి. ప్రీ బిడ్ సదస్సు ఈనెల 29న జరుగుతుంది. బిడ్ల సమర్పణకు తుది తేదీ అక్టోబరు 13. సాంకేతిక బిడ్‌లను అక్టోబరు 14న తెరుస్తారు.

## జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి

మరోవైపు, రద్దీ ఎక్కువైన ప్రాంతంలోని మిగిలిన వారిని సహాయక సిబ్బమది తక్షణం తరలించారు. సుమారు 120 మందిని ఆసుపత్రిలో చేర్చినట్టు తెలుస్తోంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటన నేపథ్యంలో రద్దీ నియంత్రణకు అధికారులు మరింత కట్టు దిట్టమైన చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇలాంటివి పునరావృతం కాకుం డా చర్యలు చేపట్టినట్టు సమాచారం. ప్రపంచప్రఖ్యాతి గాంచిన పూరీ జగన్నాథుడి రథయాత్ర లక్షల మంది భక్తుల మధ్య గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే.

## 9వ తరగతిలో మూడో భాష వద్దు

విషయం తెలిసిందే. అయితే, ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న తమిళనాడు ప్రభుత్వం.. వీటిని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు నిరాకరిస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో ప్రతి జిల్లాలో జేఎన్‌వీ ఏర్పాటును సమర్థిస్తూ మద్రాస్ హైకోర్టు ఇటీవల తీర్పు ఇవ్వగా.. దీనిని సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, సీబీఎస్ఈలో త్రిభాషా విధానంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ప్రత్యేకంగా విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

## అద్దె ఇంటి యజమానుల వద్ద రూ.లక్ష కోట్లు పైనే!

**ముంబై:**సొంతిల్లు కొనుగోలు చేసే స్థోమత లేనివారు, తరచూ ఉద్యోగ బదిలీ ఉండే వారికి అద్దె ఇల్లే దిక్కు. సాధారణంగా అద్దె ఇంట్లో దిగే వారు నెలవారీ చెల్లిం చే రెంట్ గురించి ఎక్కువగా చర్చిస్తుంటారు. కానీ, పెద్దగా చర్చించుకోని మరో అంశం ఉందంటోంది నో బ్రోకర్ సంస్థ. అదే ఇంట్లో అద్దెకు దిగే ముం దు ఇంటి యజమానికి చెల్లించే సెక్యూరిటీ డిపాజిట్. సుమారు రూ.1.26 లక్షల కోట్లు అద్దె ఇంటి యజమానుల వద్ద పేరుకుపోయినట్లు పేర్కొంది. ఈ మేరకు రెంట్ రిపోర్ట్ 2026ను విడుదల చేసింది. దేశంలోని ఆరు మెట్రో నగరాల్లో అధ్యయనం చేసి ఈ నివేదికను వెలువరించింది. నెలవారీ అద్దె కంటే ముందస్తుగా చెల్లించే ఈ సెక్యూరిటీ డిపాజిట్లే అద్దెదారులకు అతిపెద్ద సవాలుగా మారుతున్నాయని అభిప్రాయపడింది.యజమానుల వద్ద పేరుకుపోయిన మొత్తాల విషయంలో ఆర్థిక రాజధాని ముంబయి అగ్రస్థానంలో ఉంది. ఈ నగరంలో ఇంటి యజమానుల వద్ద రూ.41,156 కోట్లు ఉన్నట్లు నో బ్రోకర్ సంస్థ పేర్కొంది.



రూ.31,628 కోట్లతో బెంగళూరు నగరం రెండో స్థానంలో ఉంది. దిల్లీ (24,054 కోట్లు), చెన్నై (రూ.17,346 కోట్లు), హైదరాబాద్ (రూ.6,843 కోట్లు), పుణె (రూ.5,015 కోట్లు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

**సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించలేక:**సెక్యూరిటీ డిపాజిట్ల వల్ల నచ్చిన ఇంటినీ వదులుకోవాల్సి వచ్చినట్లు పలువు రు అద్దెదారులు పేర్కొంటున్నారు. బెంగళూరు నగరంలో 75 శాతం మంది అద్దెదారులు తాము ఇష్టపడిన ఇంటిని కేవలం అధిక సెక్యూరిటీ డిపాజిట్లు చెల్లించలేక వదులుకోవాల్సి వచ్చిందని పేర్కొనడం సెక్యూరిటీ డిపాజిట్ సమస్యకు అద్దం పడుతోంది. మరోవైపు, చెల్లించిన సెక్యూరిటీ డిపాజిట్‌ను తిరిగి పొందే విషయంలో అద్దెదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు నివేదిక తెలిపింది. చెన్నై ఈ విషయంలో అధ్వాన్న స్థితిలో ఉంది. ఇల్లు ఖాళీ చేసినప్పుడు పెయింటింగ్, మరమ్మతులు పేరుతో సెక్యూరిటీ డిపాజిట్‌లో పెద్ద మొత్తంలో కోతలు పెట్టినట్లు 11 శాతం మంది అద్దెదారులు చెప్పుకొచ్చారు.

**ఇదే పరిష్కారం**

దీన్ని అద్దె ఇల్లు, సెక్యూరిటీ డిపాజిట్ల కోణంలోనే చూడకూడదని నో బ్రోకర్ నివేదిక అభిప్రాయపడింది. ఈ మొత్తం మ్యూచువల్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఈక్విటీలు వంటి పెట్టుబడి సాధనాలకు గానీ, ఆర్థిక కార్యకలాపాల్లో గానీ నోచుకోవడం లేదని తెలిపింది. రెంటల్ డిపాజిట్ కాకుండా ఇతర దేశాల తరహాలో రెంటల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ లేదా బ్యాంక్ గ్యారెంటీ వంటి ప్రత్యామ్నాయ డిపాజిట్ మార్గాలు ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

# యాక్షన్ ప్లాన్ ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి

- క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల్లో వేగం పెంచాలి
- మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 16 (జనం సాక్షి);** యాక్షన్ ప్లాన్ ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, నిర్మాణాల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి,పనుల్లో వేగం పెంచాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, వన మహోత్సవంపై గృహనిర్మాణ శాఖ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, అధికారులతో జిల్లా కలెక్టర్ గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు అన్ని మండలాల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా ల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు మంజూరు చేసిన గృహాలు, వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న వివరాలతో పాటు, పూర్తయిన ఇండ్ల వివరాలను గృహ నిర్మాణ శాఖ అధికారులు,ఎంపీడీఓ లు కలెక్టర్ కు తెలిపారు.ఇండ్లు లేని పేదల కలలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేస్తుందని తెలిపారు.గుడిసెలు,రేకుల షెడ్లలో నివసిస్తున్న వారికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని అన్నారు.దశల వారీగా ప్రగతిలో ఉన్న ఇండ్లను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు.

మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఏఈలు ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారులు ఇండ్లను వేగవంతంగా పూర్తి చేసేలా దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు.రోజూ వారీగా ఇండ్లను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు.నిర్మాణాల మంజూరు ప్రక్రియలో అధికారులు అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. నిజమైన అర్హులకే ఇండ్లు మంజూరు అయ్యేలా చూడాలని ఆదేశించారు. రెండవ దశ నిర్మాణాల మంజూరుపై ఆరా తీసిన కలెక్టర్, నిర్మాణానికి ఆసక్తి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని అన్నారు. వన మహోత్స వం కార్యక్రమం లో భాగంగా జిల్లా వ్యాప్తంగా లక్ష్యం మేరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మొక్కలు నాటేందుకు సరిపడా సిద్ధంగా ఉంచాలని, గుంతలు తీసి పెట్టాలని సూచించారు.ఈ టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీపీఓ జయశీల పాల్గొన్నారు.

# బిర్యానీ బాగాలేదని ప్రశ్నించిన యువకులపై దాడి

## న్యాయం చేయాలని ఎంఆర్పీఎస్ నాయకుల డిమాండ్



**నవాబుపేట జూలై 16 ( జనం సాక్షి) :** నవాబుపేట్ మండల పరిధిలోని మై తాప్కాన్ గూడ బిర్యానీ నాణ్యత బాగాలేదని ప్రశ్నించిన యువకుడిపై దాబా రెస్టారెంట్ నిర్వాహకులు దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. నవాబుపేట మండలంలోని మైతాఫ్ ఖాన్ గూడ గ్రామం లో ఉన్న కనకదుర్గ ఫ్యామిలీ రెస్టారెంట్లో బిర్యానీ నాణ్యతపై ప్రశ్నించిన ఇద్దరు యువకులపై దాడి జరిగిందని మండల ఎంఆర్ పీ ఎస్ సంఘం అధ్యక్షులు సుధాకర్, ప్రధాన కార్యదర్శి కిష్టయ్య అన్నారు.గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎల్లకొండ గ్రామానికి చెందిన పర్వేద కుమార్,అదే గ్రామానికి చెందిన గుల్లగూడ సుధాకర్ అనే యువకులు బుధవారం రాత్రి మైతఫ్ ఖాన్ గూడ గ్రామంలో కనక దుర్గ ఫ్యామిలీ రెస్టారెంట్ దాబాలో తినడానికి వెళ్లి బిర్యానీ చల్లగా వుంది వేడిగా చేసి తీసుకోని రావాలని కోరినారు. దీనితో ఇద్దరిమధ్య మాటమాట పెరగడంతో దాబా నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి లు దాబాలో పనిచేస్తున్న తోటివారితో కలిసి యువకులపై దాడిచేసి కట్టేసి కొట్టడం జరిగిందని బాధితులు పర్వేద కుమార్, సుదర్శన్లు ఆరోపించారు.ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన ఎంఆర్పీఎస్ మండల నాయకులు, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం సహా సంబంధిత చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అధికారులు వెంటనే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే మానవ హక్కుల కమిషన్ను ఆశ్రయించి న్యాయం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎంఆర్పీఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్ పీ ఎస్ సీనియర్ నాయకులు జాన్, రత్నం, ప్రకాష్, నర్సిములు, గోపాల్, శ్రీనివాస్, ప్రభాకర్, జగన్,బాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

- సీఎం ఇంటి ముట్టడి అంటున్న కాంగ్రెస్..
- సిద్ధాపూర్ టూ" హైదరాబాద్"పాదయాత్ర అంటున్న బీజేపీ.!
- రాజకీయ రగడలో" సిద్దాపూర్ డంపింగ్ యార్డ్
- ఎంపీ డీకే అరుణ సాక్షిగా ప్రోటోకాల్ రగడ



# బిజెపి, కాంగ్రెస్ కలిసి ప్రజలపై పోరాటం చేస్తున్నాయా?

## డంపింగ్ యార్డు సమస్యను ఎవరు పరిష్కరించాలి

## జీవో"ను ఎవరు రద్దు చేయాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :** ఓ మహా సంక్షోభం ముందు లేగలు, లేగలు,కలిసి ఆవుల కాళ్లు విరగొట్టినట్టుంది పరిస్థితి... సమస్యకు పరిష్కార మార్గం కోసం ప్రజలు పోరాడుతుంటే, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, పార్టీలు మాత్రం పోరాటానికి దిగాయి. శాంతియుత వాతావరణం లో సమస్యను పరిష్కరించాల్సిన పార్టీలే రాజకీయ రగడ సృష్టిస్తున్నాయి... రంగారెడ్డి జిల్లా సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ఓవైపు అధికార కాంగ్రెస్ పార్టీ ఏకంగా ఇప్పటికే ధర్నాలు ,రాస్తారోకోలు, నిర్వహిస్తూ ఏకంగా సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరికలు జారీ చేస్తే షాద్ నగర్ బీజేపీ నేతలు దీక్షలు ,ఆందోళనలు చేపట్టారు మహబూబ్ నగర్ జిల్లా బిజెపి ఎంపీ డీకే.అరుణ గురువారం నాడు సిద్దాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ జీవోను రద్దు చేయకపోతే సిద్దాపూర్ నుండి హైదరాబాదు,ఇందిరా పార్క్ ,వరకు పాదయాత్ర చేయాలని దానికి తమ మద్దతు ఉంటుందని బహిరంగ సభలో ప్రసంగించారు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు మరి ప్రజలపై పోరాటం చేస్తున్నాయా? అనే విమర్శలు వెల్లువెత్తుతున్నయి ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీవోలను నిర్ణయాలను వెనక్కి తీసుకునేదెవరు, ప్రజలా ?లేక అధికారంలో ఉన్న ప్రభుత్వాలా అనేది ప్రశ్నార్థకంగా మారింది ఇప్పటికే డంపింగ్ యార్డ్ జీవో 641 రద్దు చేయాలని స్థానికంగా ఉన్న గ్రామాల ప్రజలు ప్రజా సంఘాల నాయకులు పౌర హక్కుల సంఘుల నాయకులు గిరిజనులు పెద్ద ఎత్తున పోరాటానికి దిగుతున్నారు తమ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పడితే ప్రకృతి సర్వనాశనం అవుతుందని పంటలు పండక రోగాల బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజలు ఈ సమస్యను శాంతియుతంగా పరిష్కరించి డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి కానీ బిజెపిపై ,కాంగ్రెస్ , కాంగ్రెస్ పై బిజెపి, ఇలా రాజకీయ పార్టీల రగడలో సిద్దాపూర్ సమస్య మరింత జటిలమవుతుంది అసలు ఏ పార్టీ ప్రతిపక్షం ఏ పార్టీ ప్రజల పక్షం ఎవరు అధికారంలో ఉన్నారు ఎవరు ప్రతిపక్షంలో ఉన్నారు.

అనే ప్రశ్నలు ప్రజల నుండి సంధిస్తున్నాయి కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల పెద్దలకు అధికార యంత్రాంగానికి తెలియకుండానే ఈ జీవో వచ్చిందా అనేది మరో ప్రశ్న ఇదే క్రమంలో గురువారం నాడు సిద్దాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో బిజెపి ఎంపీ డీకే.అరుణ మాట్లాడుతుంటే కొందరు బిఆర్ఎస్ నేతల నుండి ప్రోటోకాల్ రగడ మొదలైంది అది కొంతమేరకు ఘర్షణకు దారితీసింది. వెంటనే మేల్కొన్న పోలీసులు స్థానికంగా అక్కడికి చేరుకొని సముదాయించారు. ఎవరి రాజకీయ స్వార్థం కోసం వారు ఇలా ప్రవర్తిస్తే ఉద్యమం ప్రక్కదారి పడుతుందనే అనుమానాలు కూడా మొదలయ్యాయి ,రాను, రాను, సిద్దాపూర్ డంపింగ్ ఇష్యూ ఎక్కడికి దారితీస్తుందో అనే చర్చ మొదలైంది...



# ఈశ్వరమ్మ యాదవ్ అండగా మేముంటాం


## బిఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హయత్ నగర్/ఎల్బీనగర్, (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల బోర్డు డైరెక్టర్గా నియమితులైన సీనియర్ రాజకీయ నాయకురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ను వారి నివాసంలో కలిసి, మద్దతుగా మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ప్రెస్మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈశ్వరమ్మ యాదవ్ ఏర్పాటు చేసిన అభినందన ఫ్లెక్సీలో తన తండ్రి జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఫోటో లేదనే కారణంతో ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలను ప్రస్తావిస్తూ, ఈ ఘటనపై సంబం ధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈశ్వరమ్మ యాదవ్కు మద్దతుగా పలువురు బీసీ సంఘాల నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు పరస్పర గౌరవాన్ని పాటించాలని, వ్యక్తిగత దూషణలకు తావివ్వకూడదని వారు అభిప్రాయపడ్డారు.

# డిసెంబర్ నాటికి కొత్త రూపులో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

- రూ.714.73 కోట్లతో ప్రపంచ స్థాయి ప్రమాణాల పునరాభివృద్ధి
- 70 శాతం పనులు పూర్తి.. రోజుకు 1.5 లక్షల మంది ప్రయాణికులకు అత్యాధునిక వసతులు
- మెట్రో అనుసంధానం, మల్టీలెవల్ పార్కింగ్, ఎయిర్ కాన్కోర్స్తో కొత్త అనుభూతి





**సికింద్రాబాద్, జూలై 16 (జనంసాక్షి):** దేశంలోని అత్యంత రద్దీ రైల్వే స్టేషన్లలో ఒకటైన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అత్యాధునిక సౌకర్యాలతో ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటోంది. రూ.714.73 కోట్ల వ్యయంతో చేపట్టిన పునరాభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతుండగా, ఇప్పటికే 70 శాతం నిర్మాణం పూర్తయింది. రోజుకు సగటున 180 రైళ్లు, దాదాపు 1.5 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే ఈ స్టేషన్ను 2026 డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నారు.

స్టేషన్ను ఆధునిక రవాణా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉత్తర, దక్షిణ వైపుల జీ3 అంతస్తులతో ఐకానిక్ టెర్మినల్ భవనాలను నిర్మిస్తున్నారు. ఉత్తర భాగంలో 22,516 చదరపు మీటర్లు, దక్షిణ భాగంలో 14,792 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారు. ఈ రెండు భవనాలను అనుసంధానించేలా 108 మీటర్లు x 120 మీటర్ల పరిమాణంలో రెండు అంతస్తుల భారీ ఎయిర్ కాన్కోర్స్ను నిర్మిస్తున్నారు. మొదటి అంతస్తులో విశాలమైన వెయిటింగ్ హాల్స్, రెండో అంతస్తులో రిటైల్ షాపులు, కాఫెటేరియాలు, వినోద కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికుల వాహనాల పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఉత్తర భాగంలో బేస్మెంట్తో పాటు నాలుగు అంతస్తుల సామర్థ్యం గల 400 వాహనాల మల్టీలెవల్ పార్కింగ్, దక్షిణ భాగంలో మరో 200 వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సముదాయాన్ని నిర్మిస్తున్నారు. స్టేషన్లో సులభ రాకపోకల కోసం 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు, రెండు ట్రావెలేటర్లు, నాలుగు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేస్తున్నారు.పునరాభివృద్ధి పనుల్లో భాగంగా ఉత్తర భాగంలో తాత్కాలిక బుకింగ్ కార్యాలయం, కొత్త ఆర్పీఎఫ్ భవనం, కాజీపేట వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యాయి. ప్లాట్ఫాం షెల్టర్లు, పార్కింగ్ షెడ్ల నిర్మాణం తుది దశకు చేరుకుంది.

దక్షిణ భాగంలో బేస్మెంట్-1, బేస్మెంట్-2 సివిల్ పనులు 98 శాతం పూర్తికాగా, లిఫ్టులు, ఎస్కలేటర్ల ఏర్పాటు పూర్తయింది. ప్రధాన భవనం నిర్మాణం ముగింపు దశలో ఉండగా రూఫ్ షీటింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఉత్తర భాగంలోని ప్రధాన భవనానికి సంబంధించిన సివిల్ నిర్మాణం పూర్తికాగా, మిగిలిన ఫినిషింగ్ పనులు 65 శాతం పూర్తయ్యాయి. మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణం కూడా పూర్తయింది.

ఎయిర్ కాన్కోర్స్లో 9 మీటర్ల ఎత్తులో కాలమ్స్, స్లాబ్ కాస్టింగ్ పనులు పూర్తై సుమారు 70 శాతం పనులు ముగిశాయి. మెట్రో అనుసంధాన స్కైవాక్కు సంబంధించిన పునాది పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ను ప్రపంచ స్థాయి రవాణా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు వేగవంతం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రయాణికులకు అత్యాధునిక వసతులతో కూడిన కొత్త తరహా ప్రయాణ అనుభవం అందుబాటులోకి రానుంది.

# 9వ తరగతి విద్యార్థినిపై అత్యాచారం.. నిందితుడిపై పోక్సో కేసు

## నిందితుడు షాబాజ్ను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలింపు

**హైదరాబాద్, జనంసాక్షి:** సనత్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫతేనగర్ ఐజీ పురానికి చెందిన షాబాజ్ (25) 9వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వివరాల ప్రకారం, నిందితుడు షాబాజ్పై పోక్సో చట్టంతో పాటు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అనంతరం నిందితుడిని న్యాయ స్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్కు తరలించినట్లు వెల్లడించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు

# అమీర్పేటలో శివ టిఫిన్ సెంటర్పై లేబర్ అధికారుల దాడులు

## ఇద్దరు బాల కార్మికుల గుర్తింపు.. ఒకరి రక్షణ, మరొకరికి కౌన్సిలింగ్


**హైదరాబాద్, జనంసాక్షి:** అమీర్పేటలోని హెచ్ డీఎఫ్సీ బ్యాంక్ సమీపంలో ఉన్న శివ టిఫిన్ సెంటర్పై గురువారం లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. 'ఆపరేషన్ ముస్కాన్-12' ప్రత్యేక డ్రైవ్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఐ. జ్యోతి తెలిపారు. తనిఖీల సందర్భంగా టిఫిన్ సెంటర్లో పనిచేస్తున్న జార్ఖండ్కు చెందిన ఓ బాలుడిని గుర్తించి రక్షించారు. మరో బాలుడిని గుర్తించి కౌన్సిలింగ్ కోసం సంబంధిత అధికారుల వద్దకు తరలించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్లో చైల్డ్లైన్ ఆఫీసర్ సుమలత, ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ అశ్వినితో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు పిల్లలతో చట్టవిరుద్ధంగా పనులు చేయిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# టీజీ-20 విజేతలకు గ్రావ్టన్ క్వాంటా ఈ-బైక్‌లు

**ఖైరతాబాద్, జూలై 16 (జనం సాక్షి) :** తెలంగాణ యువ క్రికెటర్ల ప్రతిభను ప్రోత్సహించడం గర్వకారణమని గ్రావ్టన్ మోటార్స్ సీఈఓ పర్శురామ్ పాకా అన్నారు. ఇటీవల శ్రీనిధి యూనివర్సిటీ టీజీ-20 టోర్నమెంట్ ముగింపు సందర్భంగా హైదరాబాద్కు చెందిన గ్రావ్టన్ మోటార్స్ నాలుగు గ్రావ్టన్ క్వాంటా ఎలక్ట్రిక్ ఈ-బైక్లను అత్యుత్తమ ఆటగాళ్లకు బ హుమతిగా అందజేసినట్లు గురువారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు. ఉప్పల్ రాజీవ్ గాంధీ అంత ర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో అన్విత ఖమ్మం ఏసెస్కు చెందిన వేద్ రెడ్డి అమిస్తా పురం(ఎమర్జింగ్ ప్లేయర్), మిక్కిల్ జైస్వాల్(బెస్ట్ క్యాచ్), కరీంనగర్ డైమండ్స్ ఆటగాడు తన్మయ్ అగర్వాల్(పవర్ ప్లేయర్), హైదరాబాద్ ఈ-చాం పియన్స్కు చెందిన గణేష్ గడుగు(ప్రామిసింగ్ డిస్ట్రిక్ట్ ప్లేయర్) ఒక్కొక్కరు గ్రావ్టన్ క్వాంటా ఈ-బైక్ను అందుకున్నట్లు చెప్పారు.

## వెంకటాద్రి నగర్‌లో 13 ఏళ్లుగా..

# కబ్జాలో ఉన్న పార్కు స్థలం స్వాధీనం



**హయత్‌నగర్, జూలై 16 (జనం సాక్షి) :** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని వెంకటాద్రి నగర్ కాలనీలో సుమారు 1,200 గజాల పార్కు స్థలాన్ని 13 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆక్రమణ నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మధు యాష్కి గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ యాదవ్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ చొరవతో ఈ అంశంపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసిన అనంతరం, హైడ్రా అధికారులు చర్యలు చేపట్టి పార్కు స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా పార్కు స్థలాన్ని కాపాడేందుకు నిరంతరం పోరాటం చేశామని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి సహకరించిన మధు యాష్కి గౌడ్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, మాజీ జోనల్ కమిషనర్ హేమంత్, ప్రస్తుత జోనల్ కమిషనర్ వికాస్ మహతో, డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకటాద్రి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా సభ్యులు, కాలనీ ప్రతినిధులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖాజీపూర్ ఇసుక క్వారీపై గ్రామస్తుల నిరసన

- మాజీ మంత్రి గంగుల కమలాకర్ మద్దతు
- క్వారీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్
- రద్దు చేయకుంటే కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఆందోళన హెచ్చరిక
- ఆర్డీవో హామీతో విరమించిన ధర్నా



**కరీంనగర్ టౌన్, జూలై 16, (జనం సాక్షి) :** కొత్తపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలో ప్రభుత్వం అనుమతించిన ఇసుక క్వారీ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఇసుక అక్రమ తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, సాగు, తాగునీటి సమస్యలు తీవ్రతరం అవుతున్నాయని ఆరోపిస్తూ గ్రామస్థులు చేపట్టిన నిరసనకు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మద్దతు తెలిపారు. గురువారం ఖాజీపూర్ ప్రధాన రహదారిపై గ్రామస్థులతో కలిసి బైఠాయించి నిరసనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఖాజీపూర్ ప్రాంతంలో ఇసుక నిల్వలు సమృద్ధిగా ఉండటంతో ఇంతకాలం చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేదని అన్నారు. అయితే ప్రభుత్వం ఇసుక క్వారీకి అనుమతులు ఇవ్వడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఆరోపించారు. ప్రభుత్వం మట్టి తరలింపునకు మాత్రమే అనుమతి ఇచ్చినప్పటికీ, కాంట్రాక్టర్లు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారని విమర్శించారు.ఇసుక అధికంగా తవ్వడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, దీంతో ఖాజీపూర్, ఎలగందుల, బద్దిపల్లి, నాగులమల్యాల గ్రామాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటలకు నీరు అందక నార్లు ఎండిపోతున్నాయని, బోర్లు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా ప్రభుత్వం ఆదాయం కోసం మాత్రమే పనిచేస్తోందని ఆరోపించారు.

ఈ సమస్యను ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గంగుల విమర్శించారు. రైతుల ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు చెందిన వ్యవసాయ భూమిలో కూడా సాగునీటి కొరత ఏర్పడి పంటలు ఎండిపోయాయని పేర్కొంటూ, రైతుల కోసం ఎన్ని కేసులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఇసుక క్వారీని వెంటనే నిలిపివేసి అక్కడ ఉన్న లారీలను వెనక్కి పంపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్లను పట్టించుకోకపోతే జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కరీంనగర్‌లో భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

నిరసన సందర్భంగా గ్రామస్థులు కూడా ఇసుక తవ్వకాల కారణంగా భూగర్భ జలాలు తగ్గిపోయాయని, తాగునీటి సమస్యతో పాటు సాగునీటి కొరత తీవ్రంగా ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. క్వారీని పూర్తిగా రద్దు చేయాలని, రైతుల జీవనాధారాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

అనంతరం సంఘటన స్థలానికి చేరుకున్న ఆర్డీవో గ్రామస్థులు, గంగుల కమలాకర్‌తో చర్చలు జరిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వంతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్డీవో హామీతో గ్రామస్థులు తమ ధర్నాను విరమించారు.

ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాలు లేక ట్యాంకర్లతో పొలాలకు నీళ్లు

- ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతు తపన
- కొందుర్గు మండల కేంద్రంలో ఆవేదనకర దృశ్యం



**కొందుర్గు జనంసాక్షి :** కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కళ్ల ముందే చావకూడదు" అనే పట్టుదలతో రైతులు ఆరాటపడుతున్నారు. వర్షాల్లేక ఎండిపోతున్న పంటలను బతికించుకునేందుకు అనేక పాట్లు పడుతున్నారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు ఇందుకు అద్దం పడుతున్నాయి. మండల కేంద్రానికి చెందిన రైతు చాకలి రాజు తన పొలంలో వేసిన మొక్కజొన్న పంట వర్షాలు లేక నిలువునా ఎండిపోయే పరిస్థితికి చేరింది. ఆకాశం వైపు చూసి చూసి అలసిపోయిన ఆయన, చివరకు ప్రాణం లాంటి పంటను చావనివ్వకూడదనే ఉద్దేశంతో నీటి ట్యాంకర్లతో పొలానికి నీళ్లు అందిస్తున్నారు. రైతు మాట్లాడుతూ..సీజన్ ప్రారంభంలో వేలాది రూపాయలు అప్పులు తెచ్చి ఎరువులు, విత్తనాలు వేశాము. తీరా పంట ఎదిగే సమయానికి వాన దేవుడు మొహం చాటేశాడు. భూగర్భ జలాలు ఎండిపోవడంతో బోర్ల నుంచి కూడా చుక్క నీరు రావడం లేదు. పంట ఎండిపోతే చేతికందే గ్రాసం కూడా దక్కదని భావించిన చాకలి రాజు, రోజువారీగా వందలాది రూపాయలు అదనంగా ఖర్చు చేస్తూ ట్యాంకర్ల ద్వారా నీటిని పొలానికి అందిస్తున్న. ఈ నీటిని పొలానికి పారిస్తూ పంటను కాపాడుకునేందుకు తపన పడుతున్నాను ఖర్చు తలకు మించిన భారంగా మారినప్పటికీ, చేతికొచ్చిన పంటను వదులుకోలేక పోతున్నాను అంటూ ఆవేదనను వెళ్లబుచుడు.

సహాయం కోసం ఎదురుచూపులు

ఇలా ట్యాంకర్లతో నీళ్లు పోసి పంటలను కాపాడుకోవడం సాధారణ చిన్న, సన్నకారు రైతులకు అసాధ్యంగా మారింది. పెట్టుబడులు రెట్టింపవుతుండటంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఉన్న కొందుర్గు మండల రైతులను ప్రత్యేకంగా ఆదుకోవాలని, నష్టపరిహారం అందించి అండగా నిలవాలని రైతు చాకలి రాజుతో పాటు స్థానిక రైతులు వేడుకుంటున్నారు.

## ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలను ఆగస్టు 3 లోపు బీఎల్ఓలకు సమర్పించాలి

**కరీంనగర్ నగరపాలక డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు**



**కరీంనగర్ బ్యూరో, జూలై 16 (జనంసాక్షి) :** నగరంలోని ఓటర్లందరూ తమ ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలను ఆగస్టు 3వ తేదీ లోపు సంబంధిత (బీఎల్ఓ) బూత్ లెవల్ అధికారులకు సమర్పించి, తమ ఓటు హక్కును కాపాడుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా యాదగిరి సునీల్ రావు తన ఎన్యుమరేషన్ ఫారాన్ని పూరించి అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... ఓటు అనేది రాజ్యాంగం మనకు కల్పించిన ప్రాథమిక హక్కు అని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పై ఉందని గుర్తుచేశారు. మనల్ని పాలించే పరిపాలన అందించే సరైన నాయకులను ఎన్నుకోవడానికి ఓటు అనేది ప్రతి పౌరుడికి ఒక ఆయుధం లాంటిదని, ఒకవేళ మనం ఓటు హక్కును కాపాడుకోలేకపోతే, పాలకులను ప్రశ్నించే హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఆగస్టు 3వ తేదీలోపు నగర ప్రజలందరూ తమ పరిధిలోని బీఎల్ఓలను సంప్రదించి, ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిచేసి సమర్పించాలనీ పేర్కొన్నారు. ఎలాంటి తప్పులు లేని, పకడ్బందీ ఓటరు జాబితాను తయారు చేసే ప్రక్రియలో ప్రజలందరూ అధికారులకు పూర్తిగా సహకరించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ ప్రాథమిక హక్కును ఎవరూ వదులుకోవద్దని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఫారాలను సమర్పించి ఓటరు జాబితా రూపకల్పనలో భాగస్వాములు కావాలని యాదగిరి సునీల్ రావు కోరారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ని కలిసిన వొడితల ప్రణవ్

- హుజురాబాద్ లో అంబేద్కర్ భవనం, దళిత బంధు గ్రౌండింగ్ ప్రక్రియ, వెనకబడిన సంక్షేమ శాఖ నిధుల మంజూరుకు విజ్ఞప్తి.. సానుకూలంగా స్పందించిన మంత్రి

**హుజురాబాద్, జూలై 16 (జనం సాక్షి) :**



హుజురాబాద్ పట్టణంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కోరారు. హైదరాబాద్ సెక్రటేరియట్ లో గురువారం మంత్రిని మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో ప్రొసీడింగ్ ఇచ్చి అసంపూర్తిగా నిర్మించిన దానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని,దళిత బంధు గ్రౌండింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు దళిత బంధు అందేలా చూడాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి దీనిపై ఇప్పటికే పలుమార్లు చర్చించినట్లు తెలిపారు. హుజురాబాద్ నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని సంక్షేమ పాఠశాలలో వసతులకు నిధులు కేటాయించాలని కోరారు.

## వేధింపులు తాళలేక యువతి మృతి

**ఆత్మహత్యాయత్నం అనంతరం చికిత్స పొందుతూ కన్నుమూత**

**లైంగిక వేధింపులు, బెదిరింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ**

**మల్యాల, జూలై 16 (జనంసాక్షి):** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని గొర్రెగుండం గ్రామానికి చెందిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నం అనంతరం చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెగుండం గ్రామానికి చెందిన సుంకె నవ్య (31) ఈ నెల 14న తన ఇంటి బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో గురువారం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలి సోదరుడు దాసరి రాకేష్ ఇచ్చిన ఫిర్యాదులో, అదే గ్రామానికి చెందిన పబ్బ రాజు (30) గత ఆరు నెలలుగా తన సోదరిని లైంగికంగా వేధించడంతో పాటు బెదిరింపులకు గురి చేశాడని, ఆ వేధింపులను భరించలేకే నవ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణలో వెల్లడవుతాయని ఆయన పేర్కొన్నారు.

## పడిపోయిన కరెంట్ పోల్‌ను పట్టించుకునే నాథుడే లేడు

- ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు
- పొలాల్లోకి వెళ్లాలంటే భయపడుతున్న రైతులు



**సదాశివనగర్, జూలై16 (జనంసాక్షి):**
మండలంలోని యాచారం, ఎల్లమ్మ కుంట గ్రామ శివారులో విద్యుత్ స్తంభం (కరెంట్ పోల్) పడిపోయి రోజులుగా అలాగే ఉన్నా, విద్యుత్ శాఖ, సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాళేశ్వరం కెనాల్ కాలువ పనుల నిమిత్తం రైతుల పొలాల్లోంచి కరెంటు సరఫరా చేశారు. రైతులు పనుల నిమిత్తం పొలాల్లోకి వెళ్లాలంటే పడిపోయిన పోల్, వైర్లను చూసి కరెంటు ఉందో లేదో తెలియని పరిస్థితితో జంకుతున్నారు. ఈ విషయంపై రైతులు కాళేశ్వరం కెనాల్ కాలువ కాంట్రాక్టర్ దినేష్ రెడ్డికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేస్తలేరని, లైన్మెన్ కు చేస్తే మా పరిధిలోకి రాదని సమాధానం ఇచ్చారని రైతులు తెలిపారు. పొలాలకు వెళ్లే మార్గంలోనే ఈ పోల్ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో రైతులు బిక్కుబిక్కుమంటూ వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సరి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు.

**"ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?**
ప్రాణనష్టం జరిగితే దానికి బాధ్యులు ఎవరు?" అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యను విద్యుత్ శాఖ, కాళేశ్వరం కాంట్రాక్టర్ తో ఉన్నతాధికారులు కోఆర్డినేషన్ చేసుకొని అత్యవసరంగా పరిశీలించి, పడిపోయిన విద్యుత్ స్తంభాన్ని వెంటనే తొలగించి కొత్త పోల్ ఏర్పాటు చేయాలని రైతులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## మిడ్ మానేరు జలాశయం నుండి నీరు విడుదల చేయాలి

- బిఆర్ఎస్ నాయకులు, రైతులు పోత్తూరు బ్రిడ్జిపై మహాధర్నా.
- కాళేశ్వరం ప్రాజెక్టు కన్నెపల్లి పంపహౌజ్ మోటార్లు ఆన్ చేసి నీటి ఎత్తి పోయాలని డిమాండ్



**ఇల్లంతకుంట జూలై 16 (జనంసాక్షి) :**
మిడ్ మానేరు జలాశయం నుంచి వెంటనే సాగునీటిని విడుదల చేయాడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి నుండి ఎత్తిపోతలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇల్లంతకుంట మండలం, పోత్తూరు బ్రిడ్జిపై గురువారం రోజున రైతులు బిఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. నీటి విడుదలలో జరుగుతున్న జాప్యంపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పంప్ హౌస్‌లు సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయపోవడానికి కారణం ఏమిటి ఇప్పటికే తీవ్ర వర్షబావ పరిస్థితి ఉందని నీరు లేక వరినాట్లు ఇప్పటికి పూర్తి కాలేదని రైతుల దృష్టిలో ఉంచుకొని మిడ్ మానేరు నుంచి నీటిని విడుదల చేయాలని సాగు పనులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు తెలిపారు. పంటలకు నీటి అవసరం పెరిగిందని, ఆలస్యం కొనసాగితే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే మిడ్ మానేరు జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని నాయకులు రైతులు డిమాండ్ చేశారు. నీటి విడుదల జరిగే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని నాయకులు హెచ్చరించారు. పోలీసులు సిబ్బంది ఎటువంటి అవాంచనియా సంఘటనలకు చోటువ్వకుండ కట్టిదిట్ట ఏర్పాట్లు చేసి ధర్నాను విరమింప జేశారు. ఇట్టి కార్యక్రమంలో రైతులు,మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పల్లె నర్సింహారెడ్డ్,వేణు,పట్నం అశ్విని శ్రీనివాస్, రాజిరెడ్డి, కౌటం రాములు, మాజీ ఎంపీటీసీ సావనపెల్లి అనిల్, రవీందర్, రాగటి రమేష్, బుర్ర సూర్య గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

## 18, 19న కరీంనగర్‌లో 4వ ఆల్ ఇండియా ఓపెన్, జూనియర్ చెస్ చాంపియన్‌షిప్

**రూ.1.25 లక్షల నగదు బహుమతులు.. ఏర్పాట్లు పూర్తి: నిర్వాహకులు కంకటి అనూప్ కుమార్**

**కరీంనగర్ కల్చరల్, జూలై 16 (జనం సాక్షి) :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో స్థానిక వీ కన్వెన్షన్‌లో 4వ ఆల్ ఇండియా ఓపెన్, జూనియర్ చెస్ చాంపియన్‌షిప్-2026 ను ఘనంగా నిర్వహించనున్నట్లు పోటీల నిర్వాహకులు, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ తెలిపారు. గురువారం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పోటీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చెస్ క్రీడ మేధస్సుకు పదును పెట్టే అత్యుత్తమ క్రీడ అని పేర్కొన్న ఆయన, జిల్లా కేంద్రంలో వరుసగా నాలుగోసారి ఆల్ ఇండియా స్థాయి చెస్ పోటీలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో మొత్తం 8 రౌండ్ల మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలకు మొత్తం రూ.1.25 లక్షల నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర పక్క రాష్ట్రాల నుంచి కూడా పలువురు చెస్ క్రీడాకారులు పాల్గొననున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల కోసం రెండు రోజుల పాటు ఉచిత భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టోర్నమెంట్‌ను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, క్రీడాభిమానులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, టోర్నమెంట్ నిర్వాహకులు సృజన్, రవిచంద్ర, అకెనపల్లి నాగరాజు, భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు తాటిపల్లి సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అడవిలో దాచిపెట్టేందుకు తరలిస్తుండగా 9 నాటు తుపాకులు స్వాధీనం

- దేవక్కపేట్ అటవీ ప్రాంతంలో పోలీసుల మెరుపు దాడులు
- 9 మంది నిందితుల అరెస్టు.. అదుపులో ఆయుధాల మరమ్మతుదారుడు
- చిరుత మృతి ఘటన తర్వాత కట్టుదిట్టమైన నిఘాతో వెలుగులోకి అక్రమ ఆయుధాల వ్యవహారం



**నిజామాబాద్, జూలై 16 (జనంసాక్షి):**
నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని భీమ్‌గల్ మండలం దేవక్కపేట్ అటవీ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో పోలీసులు 9 నాటు తుపాకులను స్వాధీనం చేసుకుని 9 మంది నిందితులను అరెస్టు చేశారు. ఆయుధాలకు మరమ్మతులు చేసిన మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్, భీమ్‌గల్ పోలీసులు సంయుక్తంగా గురువారం తెల్లవారుజామున దేవక్కపేట్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న కొందరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద నుంచి మొత్తం 9 నాటు తుపాకులు లభించాయి. ఆయుధాలకు ఎలాంటి చట్టబద్ధమైన లైసెన్సులు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణలో నిందితులు అడవి జంతువులు, ఇతర వన్యప్రాణులను వేటాడేందుకు ఈ నాటు తుపాకులను ఉపయోగిస్తున్నట్లు వెల్లడైంది. ఇటీవల దేవక్కపేట్ అటవీ ప్రాంతంలో చిరుతపులి మృతి చెందిన ఘటన అనంతరం పోలీసులు, అటవీ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తమ వద్ద ఉన్న లైసెన్సులేని ఆయుధాలను అడవిలో దాచిపెట్టేందు కు తీసుకెళ్తుండగా పోలీసులకు చిక్కినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనపై భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 130/2026 కింద ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ 5 రీడ్ విత్ 25(1)(ఖ) ప్రకారం కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన వారిలో దేవక్కపేట్, కరేపల్లి, తల్లపల్లి గ్రామాలకు చెందిన భూక్యా రఘుపతి, కార్ల అంజయ్య, ముదావత్ తిరుపతి, భూక్యా చందర్, ముర్రి గంగ నర్సయ్య, అనిమేని లింబాద్రి, మాలావత్ కుంభ, బానావత్ గంగారెడ్డి, మాలావత్ ధారిసింగ్ ఉన్నారు. ఆయుధాలకు మరమ్మతులు చేసిన అకునూర్ రాజును కూడా అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచారు. ఈ ఆపరేషన్‌ను పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య పర్యవేక్షణలో సీసీఎస్ ఏసీపీ పి. శ్రీశైలం, ఆర్మూర్ ఏసీపీ జె. వెంకటేశ్వరరెడ్డి, సీఐలు సురేష్, పి. సత్యనారాయణ గౌడ్, సాయినాథ్, ఎస్ఐ సి.హెచ్. తిరుపతి, సీసీఎస్, భీమ్‌గల్ పోలీసు సిబ్బంది విజయవంతంగా నిర్వహించారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని పోలీసు కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, లైసెన్స్ లేకుండా ఎలాంటి ఆయుధాలను కలిగి ఉండటం, ఉపయోగించడం, దాచిపెట్టడం లేదా తరలించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అక్రమ ఆయుధాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు తెలియజేసి పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఆగస్టు 29న 'ఏథర్ కమ్యూనిటీ డే-2026'

**- ఈఎల్ ప్లాట్‌ఫామ్ రూపొందించిన ఆవిష్కరణ స్కూటర్**

**ఖైరతాబాద్, జూలై 16 (జనం సాక్షి) :** ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ తన 'ఏథర్ కమ్యూనిటీ డే-2026' కార్య క్రమాన్ని ఆగస్టు 29న బెంగళూరులో 'ఎ న్యూ డాన్ ఆఫ్ మ్యాజిక్' థీమ్‌తో నిర్వహించనున్నట్లు ఆ సం స్థ ప్రతినిధులు గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లా డుతూ ఈఎల్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా రూపొంది చిన తొలి మాస్-మార్కెట్ స్కూటర్‌తో పాటు కొత్త సాంకేతికతలు, ఛార్జింగ్, వాహన యాజమాన్య సేవలకు సంబంధించిన ఆవిష్కరణలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. రూ.1 లక్ష - 1.25 లక్షల ధర శ్రేణి వినియోగదారులను లక్ష్యంగా చేసుకున్న ఈ స్కూటర్ ఏథర్ మార్కెట్ విస్తరణలో కీలక మైలురాయిగా నిలవనుందని తెలిపారు.

## మీ పదేండ్ల పాలనలో రైతులపై ప్రేమ ఏది?

- కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో ముందుకు సాగుతుంది
- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు



**సిరిసిల్ల టౌన్ జూలై 16 (జనం సాక్షి) :** బీఆర్ఎస్ నాయకులు రైతుల పేరుతో చేస్తున్న కార్యక్రమాలు రాజకీయ డ్రామాలేనని, పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని వారు ఇప్పుడు రైతులపై ప్రేమ చూపించడం ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు విమర్శించారు.
గురువారం సిరిసిల్ల పట్టణం పెద్దూరు జీ,కే ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పక్షాన అనేక సంక్షేమ నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం, రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇటీవల నిర్వహించిన రక్తదాన కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, రక్తదానం చేయడం మంచి విషయమే అయినప్పటికీ దాన్ని రాజకీయ ప్రచారానికి ఉపయోగించడం సమంజసం కాదన్నారు. పదేళ్ల పాలనలో రైతుల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు రైతుల కోసం మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణ కొనసాగుతోందని, విచారణ పూర్తయ్యే వరకు బీ,ఆర్,ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రైతుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని, రైతుల ఖాతాల్లో ఆర్థిక సాయం జమ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీ,ఆర్,ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని సూర దేవరాజు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తోందని, తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తిప్పికొడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, బొప్ప దేవయ్య, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ కిరణ్ యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పోగుల దేవరాజు రెడ్డి, నాయకులు మంగ ప్రశాంత్, గంభీరావుపేట కిట్టయ్య, ప్రశాంత్, తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నీళ్లు ఇవ్వాలని రక్తదానం చేసిన మాజీ ఎమ్మెల్యే

**వినూత్న నిరసన తెలిపిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బిఆర్ఎస్ నాయకులు**

**గంగాధర జూలై 16 (జనం సాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేసి రైతుల పంటపొలాలకు నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ రక్తదానం చేసి నిరసన తెలిపారు.గురువారం మధురానగర్ ఎక్స్ రోడ్డు చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్‌తో పాటు నియోజకవర్గంలోని ఆరు మండలాల బి.ఆర్.ఎస్.నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానంతో వినూత్న నిరసన తెలిపారు.ఈ సందర్భంగా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీటినీ విడుదల చేసి రైతుల పంటపొలాలకు అందించాలని అడిగితే బి,ఆర్,ఎస్,నాయకుల రక్తాన్ని పొలాలపై చల్లితే పంటలు పండుతాయనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు రాష్టానికి తల్లి తండ్రి లాంటి స్తానంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హింసను ప్రేరేపించే విధంగా మాటలాడటం ఆశ్చర్యకరంగా ఉందన్నారు.రైతుల కోసం మా రక్తాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని మా రక్తం తీసుకోని రైతులకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్,మాజీ గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి,నాగి శేఖర్,మాజీ సర్పంచులు మెచినేని నవీన్ రావు, కంకణాల విజేందర్ రెడ్డి, వేముల దామోదర్.రామిడి సురేందర్, ఎండి నజీర్ హుస్సేన్.మడ్లపెల్లి గంగాధర్.జోగు సాగర్.శ్రీమల్ల మేఘరాజ్, వడ్లూరి అదిమల్లు.ముక్కెర మల్లేశం.అక్కేనపెల్లి కరుణాకర్, మాల చెంద్రయ్య.బొల్లాడి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఆకుల మధుసూదన్, ద్యావ మధుసుదన్ రెడ్డి, బంధారపు అజయ్, మామిడి అఖిల్, మడ్లపెల్లి శ్రీనివాస్,గడ్డం స్వామి,మరియు నియోజకవర్గంలోని ఆరు మండలాల బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి లక్ష్యం చేరుకోవాలి

- ఆటలు ఆడాలి.. చదవాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి కేజీబీవీ విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్
- ఆహార పదార్థాలు, కూరగాయలు, విద్యాలయం ఆవరణ పరిశీలన



**వేములవాడ రూరల్, జూలై 16 (జనంసాక్షి)**
ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని.. తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో యూనిఫాంల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని స్టోర్ రూమ్ లో బియ్యం, కూరగాయలు, పండ్లు, నెయ్యి, ఇతర పదార్థాల నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. మెనూ చార్ట్ పరిశీలించి.. ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో పరిశీలించారు. విద్యాలయంలో చదివి ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు ప్రస్తుతం ఎక్కడ చదువుతున్నారో ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని.. దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రవేశానికి చాలా మంది పోటీ పడతారని, ఇక్కడ చదివే మంచి అవకాశం విద్యార్థులకు వచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థులు రోజు ఆటలు ఆడాలని.. మంచిగా చదవాలని సూచించారు. చదువు మధ్యలో మానేయవద్దని, ఉన్నత విద్యాభ్యాసం చేయాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులు వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. అప్పుడే మహిళ సాధికారత సాధ్యమని తెలిపారు. విద్యార్థులకు మహిళా సంఘాల వారితో యూనిఫాంలు కుట్టిస్తున్నామని, వారికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తనిఖీ కోసం ఒక మండల, జిల్లా స్థాయి అధికారులను కేటాయించామని వివరించారు. వారు విద్యాలయం తనిఖీ చేసి.. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ మొండయ్య, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ అబూబాకర్, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లో-వోల్టేజ్‌కు చెక్.. రుద్రంగికి 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్

- రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే కాంగ్రెస్ లక్ష్యం
- విద్యుత్ వ్యవస్థ బలోపేతంతో నిరంతరాయ సరఫరాకు భరోసా
- వేములవాడ నియోజకవర్గంలో రెండున్నరేళ్లలో 13 కొత్త సబ్‌స్టేషన్లు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రుద్రంగి, జూలై 16 (జనంసాక్షి):** రైతులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ప్రారంభించిన ఆయన, ఈ ట్రాన్స్‌ఫార్మర్‌తో రుద్రంగి ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న లో-వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. రుద్రంగి సబ్‌స్టేషన్‌లో గతంలో 5 ఎంవీఏ, 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా, వ్యవసాయంతో పాటు గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగడంతో లో-వోల్టేజ్ సమస్య తీవ్రరూపం దాల్చిందన్నారు. వేములవాడ నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న ఆది శ్రీనివాస్, గత రెండున్నర సంవత్సరాల్లోనే 13 నూతన సబ్‌స్టేషన్లను మంజూరు చేయించామని తెలిపారు. రుద్రంగి, నూకలమర్రి, ఎనిగల్, లింగంపేట, మరిమడ్ల, పోసానిపేట, సిరికొండ, భీమారం, కాచారం, పోరుమల్ల తదితర ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరవగా, కొన్ని పూర్తై సేవలందిస్తుండగా మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. కత్లాపూర్‌లో కోట్ల రూపాయల వ్యయంతో 220 కేవీ భారీ సబ్‌స్టేషన్ నిర్మాణం వేగంగా కొనసాగుతోందని వెల్లడించారు. వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ డిమాండ్ పెరిగిన సందర్భాల్లో కూడా రైతులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా పనిచేస్తున్నారని తెలిపారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేసి కూడా నిరంతరాయ సరఫరా అందిస్తున్నామని చెప్పారు. విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ, వేములవాడ నియోజకవర్గంలో ఇప్పటివరకు 2,800కు పైగా మిడిల్ పోల్స్ ఏర్పాటు చేసినట్లు, గత ఏడాదిలోనే 1,300 మంది కొత్త రైతులకు విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు వెల్లడించారు. రుద్రంగికి 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరులో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారని, లింగంపేట, నర్సింగాపూర్ ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ టి. వేణుమాధవ్, డీఈ వెంకటరమణ, ఏడీఈ గంగాధర్, భూక్య శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ గండి నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రం గంగ నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తూమ్ జలపతి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
17 జూలై 2026

# నేటినుంచి రెండో విడత ఇంజనీరింగ్ కౌన్సిలింగ్

- ఖాళీ సీట్లలో రెండో విడతలో భర్తీకి ఏర్పాట్లు

**హైదరాబాద్, జూలై16 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2026 రెండో విడత ప్రవేశాల కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసింది. శుక్రవారం 17వ తేదీ రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. మొదటి విడత కౌన్సిలింగ్ ముగిసిన అనంతరం ఖాళీగా ఉన్న స్థానాలను ఈ విడత ద్వారా భర్తీ చేయనున్నారు. జూలై 17న ఆన్‌లైన్ ద్వారా ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. జూలై 18న స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు హెల్ప్ లైన్ కేంద్రాలలో ధృవపత్రాల పరిశీలన జరుగుతుంది.జూలై 18 నుండి 19 వరకు: అర్హులైన అభ్యర్థులు తమకు నచ్చిన కాలేజీలు, కోర్సుల ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. జూలై 22న విద్యార్థుల మెరిట్, వెబ్ ఆప్షన్ల ఆధారంగా రెండో విడత తాత్కాలిక సీట్ల కేటాయింపును ప్రకటిస్తారు. మొదటి విడత కౌన్సిలింగ్ ముగిసిన తర్వాత భారీ సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి. అధికారులు వెల్లడించిన గణాంకాల ప్రకారం మొదటి విడతలో సీట్లు పొంది, నిర్ణీత గడువులోగా కాలేజీలలో రిపోర్ట్ చేయని అభ్యర్థుల సంఖ్య 19,325 కాగా.. మొదటి విడత కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత నేరుగా మిగిలిపోయిన ఖాళీ సీట్ల సంఖ్య 8,162. ఈ రెండు విభాగాలూ కలిపి రెండో విడత కౌన్సిలింగ్‌లో అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మొత్తం 27,487 సీట్లు ఉన్నాయి.

## ఆత్మహత్య చేసుకున్న ఫోక్సో కేసు నిందితుడు

**కామారెడ్డి, జూలై 16 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం చింతామన్‌పల్లి గ్రామంలో యువకుడి ఆత్మహత్య కలకలం రేపింది. రంగబోయిన సందీప్ (23) అనే యువకుడు గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న సందీప్.. ఇటీవలే జైలుకు వెళ్లి బెయిల్‌పై తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి బాలిక తల్లిదండ్రులు తనను తరచూ వేధిస్తూ.. బెదిరింపులకు గురిచేస్తున్నారనే ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తీవ్ర మనస్తాపానికి గురై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. గ్రామ శివారులో సందీప్ మృతదేహం వేలాడుతుండటం గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించారు. బాధిత బాలిక కుటుం బ సభ్యుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని సందీప్ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణం వల్లే తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా దోమకొండ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

- మంత్రి సీతక్క వెల్లడి

**ములుగు, జూలై16 (జనంసాక్షి) :** ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గురువారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నాయిగూడెం, మంగపేట, ఏటూరునాగారం ఏజెన్సీ మండలాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. ప్రజలకు ఉపయోగపడే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలు లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పని చేయా లని సూచించారు. సమావేశంలో అటవీశాఖ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సిఎంతో టీజీ20 లీగ్ విజేతల భేటీ

### విజేతలకు చెక్కులు అందజేసిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 16 (జనంసాక్షి) :** టీజీ20 లీగ్ విజేతలైన హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టు సభ్యులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన సీఎం, జట్టు సభ్యులకు విజేతల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలో క్రీడలకు ప్రాధాన్యం పెంచే లక్ష్యంతో కొత్త స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని సీఎం వెల్లడించారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు, ప్రోత్సాహం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోం దన్నారు. టీజీ20 లీగ్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టు రాష్ట్ర యువతకు ఆదర్శంగా నిలవాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణకు పేరు తీసుకు రావాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని టీజీ 20 లీగ్ విజేత 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' ఫ్రాంచైజీ యాజమాన్యం, జట్టు సభ్యులు కలిశారు. సీఎంను కలిసిన వారిలో రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఈటీవీ ఎండీ బాపినీడు, జట్టు సభ్యులు ఉన్నారు. టోర్నీ తొలి విజేతగా నిలిచిన 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' టీమ్‌కు సీఎం అభినందనలు తెలిపారు.

## కుమారుడి అరెస్టు ప్రచారాన్ని ఖండించిన ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి

**హైదరాబాద్, జూలై16 (జనంసాక్షి) :** తన కుమారుడు భరత్ రెడ్డి డ్రగ్స్ తీసుకున్నారని, మంగళ్‌హాట్ పోలీసులు అరెస్ట్ చేశారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమని ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ గురువారం ఉదయం మంగళ్‌హాట్ పోలీసులు తమ నివాసానికి వచ్చి విచారణ నిర్వహించిన విషయం వాస్తవమేనని తెలిపారు. అయితే, పోలీసుల విచారణలో తన కుమారుడు డ్రగ్స్ తీసుకోలేదని స్పష్టమైనట్లు పేర్కొన్నారు. కామన్ ఫ్రెండ్స్ ఫోన్ నంబర్ల జాబితాలో ఉన్న వ్యక్తుల్లో ఒకరి వద్ద లభించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని పోలీసులు విచారణ చేపట్టారని, అంతకు మించి ఎలాంటి అంశం లేదని వెంకట్రాంరెడ్డి వివరించారు. 'భరత్ రెడ్డి అరెస్ట్ కాలేదు. డ్రగ్స్ కూడా తీసుకోలేదు. దీనికి విరుద్ధంగా జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దు' అని ఆయన విజ్ఞప్తి చేశారు. అసత్య ప్రచారాలను వ్యాప్తి చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి కోరారు.

### ప్రాణంతో పోరాడుతూ..


# ఎండుతున్న పంటలు

**ఎండ వేడిమికి తలవంచిన జొన్న, మొక్కజొన్న, పత్తి పంటలు**

- మేఘాల వైపు చూస్తున్న రైతన్న..
- 25 రోజులుగా చినుకు జాడ లేని పరిస్థితి
- లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి గాల్లో దీపంలా రైతాంగం

**వానాకాలం నడుస్తున్నా ఆకాశం మాత్రం కరుణ చూపకపోవడంతో రంగారెడ్డి జిల్లా రైతాంగం తీవ్ర ఆందోళనలో మునిగిపోయింది. గత 25 రోజులుగా చినుకు జాడ లేక జొన్న, మొక్కజొన్న, ప్రత్తి పంటలు ఎండవేడిమికి తలవంచి ప్రాణాలతో పోరాడుతున్నాయి. లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన రైతులు ఇప్పుడు మేఘాలవైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. పంటలు కళ్ల ముందే ఎండిపోతుండటంతో అన్నదాత గుండెల్లో భయం, నిరాశ, ఆవేదన రోజురోజుకూ పెరుగుతోంది. చెరువులు, వాగులు, బోర్లు నీరు లేక వెలవెలబోతుండగా పల్లెల్లో కరువు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సమయానికి వర్షాలు కురవకపోతే రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 16 (జనంసాక్షి)**



ప్రస్తుతం వర్షాకాలం కూడా వేసవిని తలపిస్తుంది. 2026-27 సాధా రణ సాగు విస్తీర్ణం రంగారెడ్డి జిల్లాలో 3,79,982 ఎకరాలు ఉండగా ఇప్పటివరకు జిల్లాలో 2,40,726 ఎకరాల్లో పంటలను సాగు చేశారు. ఇందులో మొక్క జొన్న, జొన్న, ప్రత్తి, వరి, కందులు వేసి ఉండగా వరి సాగుకు మాత్రం ఆగస్టు 15 వరకు ఇంకా సమయం ఉండడంతో రైతన్నలు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే సుమారుగా 25 రోజులుగా వర్షాలు లేక తీవ్రమైన ఎండ ఉక్కపోతతో అల్లాడుతున్నారు ప్రజలు వర్షాకాలంలో సైతం కూడా రాత్రి పూట ఫ్యాన్ లేకుండా ఉండలేని స్థితి నెలకొంది. గత 25 రోజులుగా వర్షాలు లేక మొక్కజొన్న, జొన్న, ప్రత్తి, పంట ఎండ వేడిమికి తట్టుకోలేకపోతుంది. ఎదిగేటి మొక్కజొన్న, జొన్న, ప్రత్తి పంట ఎండకు ఎండిపోతుంది. పంట పెట్టుబడి కోసం లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పెట్టిన రైతన్న వర్షం కోసం ఆకాశంవైపు ఎదురుచూస్తున్నాడు. వర్షం పడవకపోతే పెట్టిన పెట్టుబడితో రైతన్న మరింత అప్పుల పాలయ్యే పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా పల్లెలన్నీ పంట పొలాలని ఎండకు మండుతున్నాయి. చేలల్లో, చెలకల్లో, చెరువుల్లో, వాగుల్లో, చూద్దామన్న చుక్క నీరు దొరకని పరిస్థితి. చెట్లపై పక్షులు కూడా కనిపించనీ దుస్థితికి వెళ్ళిపోయింది ప్రకృతి. ఓ క్రమంలో పల్లె కన్నీరు పెడుతుందో మేఘమా ఒక్కసారిరా.. రైతు గుండె నవ్వించు అని పంట పొలం ఎదురు చూస్తున్నది. చినుకే జీవం, చినుకే ఆశ, చినుకే బ్రతుకు, వానమ్మ అన్నదాత కన్నీరు తుడిచే వానమ్మ నాగలి పట్టి ముద్దాడి నాటిన విత్తు వర్షం లేక నిద్రపోతుంది. రైతు గుండెను కాల్చేస్తుంది. అప్పుల భారంతో ముంచేస్తుంది. ఇప్పటికే జూలై మాసం ముగిసిపోతుండడంతో మరో రెండు నెలలు మాత్రమే వర్షాకాలం ఉండే అవకాశం ఉంది. ఇప్పటికీ చెరువులు ఎక్కడ కూడా నిండని పరిస్థితి ఉంది. దీంతో రైతన్న భయాందోళనకు గురవుతుండు.

### వర్షం పడకపోతే ఇక మాకు పురుగుల మందే దిక్కు..



మాకున్న భూమితో పాటు మరికొంత భూమి కౌలుకు తీసుకొని ప్రత్తి పంట వేశాం. విత్తనాలతో పాటు ఫర్టిలైజర్, లేబర్ కు కలిపి ఇప్పటివరకు 4లక్షల రూపాయలు పంటకు పెట్టుబడి పెట్టాం. దేవుడా అని వర్షం కోసం ఎదురుచూస్తున్నాం. వర్షాలు పడకపోతే మాకు ఇక మాకు పురుగుల మందే దిక్కు.

**- వార్ల సంతోష, ఎస్టిపల్లి గ్రామం, రంగారెడ్డి జిల్లా**

### మొక్క ఎదుగుదల దశలోనే ఎండిపోయింది..



రెండు ఎకరాల భూమిలో మొక్కజొన్న పంట పెట్టుబడికి 60 వేల రూపాయలు పెట్టాను. గత 25 రోజుల నుండి వర్షాలు లేక మొక్కజొన్న ఎదుగుదల దశలోనే పూర్తిగా ఎండిపోతుంది. ఇతర పంటలు వేసుకుందామన్న బోర్లలో, చెరువులలో చుక్క నీరు కూడా లేదు. లక్షల రూపాయలు పంట పెట్టుబడికి పెట్టుకున్న రైతును ప్రభుత్వమే ఆదుకోవాలి.

**- పిప్పళ్ళ గణేష్ ,సిద్దాపూర్ గ్రామం, రంగారెడ్డి జిల్లా..**

### ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించాం



2026-27 సంవత్సరాలకు సంబంధించి ఎలీనినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా ఉండొచ్చని ఇప్పటికే రైతులకు రైతు వేదికల, ప్రతి మంగళవారం నాడు రైతునేస్తం ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. వర్షాకాలం మీద ఆధారపడకుండా కూరగాయలు చిరుధాన్యాల లాంటి పంటలు వేసుకోవాలని చైతన్యం చేస్తున్నాం. ఇప్పటివరకు మొక్కజొన్న, జొన్నలాంటి పంటలు సరైన సమయంలో వర్షాలు పడకపోవడం వల్ల కొంత మేరకు నష్టం జరిగినట్టు తెలుస్తుంది.

**- జిల్లా వ్యవసాయాధికారి సుజాత..**

## వికలాంగ విద్యార్థుల సంక్షేమమే తొలి ప్రాధాన్యం

- దివ్యాంగుల కార్యాలయం, వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ
- సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**హైదరాబాద్, జూలై16 (జనంసాక్షి) :** రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం, వారి విద్యాభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదలే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం నల్లగొండ ఎక్స్‌రోడ్స్‌లోని దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం, ప్రభుత్వ దివ్యాంగుల వసతి గృహం, పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మమేకమైన మంత్రి, మూగ,చెవిటి విద్యార్థులు సంకేత భాష ద్వారా తమ సమస్యలను వివరించగా ఎంతో శ్రద్ధగా ఆలకించారు. విద్యార్థులకు అవసరమైన ప్రతి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల అవసరాలన్నింటినీ సమగ్ర ప్రతిపాదనల రూపంలో ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. శాఖలో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మంత్రి తీవ్రంగా పరిగణించారు. ఖాళీ పోస్టుల వివరాలు, అవసరమైన బోధనా సిబ్బంది, ఇతర సౌకర్యాలపై వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సహాయ సంచాలకుడు, విద్యాసంస్థ ప్రిన్సిపాల్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దివ్యాంగ విద్యార్థుల విషయంలో విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు అనే మూడు అంశాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వసతి గృహంలోని ఆహారం, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, తరగతి గదులు, బోధన సౌకర్యాలు, విద్యార్థుల భద్రత వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రత, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, సంక్షేమ పథకాల సమర్థ అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి దివ్యాంగ విద్యార్థికి నాణ్యమైన విద్య, మెరుగైన వసతి, అవసరమైన సౌకర్యాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి సమస్యను మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ప్రతిపాదనలను ఆలస్యం చేయకుండా ప్రభుత్వానికి పంపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## తెలంగాణ కమిటీకి చట్టబద్ధత కల్పించాలి

- సమీక్షల కోసం క మిటీ సభ్యులే జిల్లాలకు రావాలి
- మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారుల డిమాండ్

**హైదరాబాద్, జూలై16 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ గురువారం అమరవీరుల స్మారక చిహ్నంలో మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోతె శోభన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్ తదితరులు హాజరై ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి తరలివచ్చిన పోరాటయోధుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనలో మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారులు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని కొనియాడారు. సింగరేణి బొగ్గు గనుల సమ్మెల ద్వారా నాటి ప్రభుత్వ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మంచిర్యాల, ఆసిఫాబాద్ కార్మిక శ్రేణులు, ఉద్యమానికి ప్రధాన కేంద్రంగా నిలిచిన కరీంనగర్ పోరాట గడ్డల త్యాగాలు చారిత్రాత్మకమైనవని ప్యానల్ స్పష్టం చేసింది. ముఖాముఖి సంప్రదింపుల్లో పాల్గొన్న అత్యధిక శాతం మంది ఉద్యమకారులు సంక్షేమ పథకాల కంటే ముందే రెండు అత్యంత కీలకమైన డిమాండ్లను కమిటీ ముందు గట్టిగా లేవనెత్తారు. సుదూర ప్రాంతాలైన ఆసిఫాబాద్, మంచిర్యాల వంటి సరిహద్దు జిల్లాల నుండి వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న ఉద్యమకారులు హైదరాబాద్ దాకా రాలేకపోతున్నారని ప్రతినిధులు కమిటీ దృష్టికి తెచ్చారు. అందువల్ల, కమిటీ సభ్యులే స్వయంగా జిల్లాలకు వచ్చి క్షేత్రస్థాయిలో ఉండి నిజమైన ఉద్యమకారులను గుర్తించే పక్రియను చేపట్టాలని పట్టుబట్టారు. రెండు ప్రధాన డిమాండ్లతో పాటు, క్షేత్రస్థాయి యోధులు తమ ఇతర ఆత్మగౌరవ సంక్షేమ వినతులను కూడా కమిటీకి సమర్పించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి 250 గజాల నివాస స్థలం కేటాయించాలని,జీవన భృతి కోసం గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్ అందించా లని, ఉద్యమకారుల పిల్లలకు విద్యా, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వీటితో పాటు మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక ప్రయోజనాలు, ఉచిత కార్పొరేట్ వైద్యం కోసం హెల్త్ కార్డులు, ఉచిత నాణ్యమైన విద్య, మరియు ఆర్టీసీ బస్సులలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాల్సిందిగా వినతి పత్రాలు సమర్పించారు.



## పవన్ కళ్యాణ్‌కు గవర్నర్ నజీర్ పరామర్శ

- ఆరోగ్యం, ఆపరేషన్‌పై గవర్నర్ ఆరా
- త్వరగా కోలుకుని మళ్లీ విధుల్లోకి రావాలని ఆకాంక్ష

**హైదరాబాద్, జులై16 (జనంసాక్షి) :** కుడి భుజానికి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ మర్యాదపూర్వకంగా పరామర్శించారు. పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లిన గవర్నర్.. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని సూచించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శ అనంతరం గవర్నర్, పవన్ కల్యాణ్ నివాసంలోని లైబ్రరీని కూడా సందర్శించారు. అక్కడ రచయితలు, పరిశోధకులు, విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రచించిన పలు విలువైన పుస్తకాలను పరిశీలించారు. పుస్తకాలలోని అంశాలు, సమకాలీన సామాజిక, పరిపాలనా, ప్రజా విధానాలపై పవన్ కల్యాణ్‌తో గవర్నర్ ఆసక్తికరంగా చర్చించారు. ఈ సందర్భంగా పవన్ అభ్యర్థన మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఒక పుస్తకంపై తన ఆటోగ్రాఫ్ కూడా చేశారు. ఈ ఆత్మీయ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. తన ఆరోగ్యాన్ని తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చి పరామర్శించిన గవర్నర్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370